PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 356 | విజయవాడ, బుధవారం 26 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 26 July 2023 | Rs

ఇ-కెవైసి దెబ్బ

- పిఎం కిసాన్‌లో కోతల పర్వం
- కొత్తగా 5.34 లక్షల మంది రైతులు దూరం
- భరోసాపై ప్రభావం

లోపలి పేజీలో..

చంద్రుని దిశగా 'చంద్రయాన్ - 3

- ఐదవ రౌండ్ ప్రారంభం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

ఈ నెల 14న ఇస్రో నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రస్తుతం భూమి చుట్టూ తిరిగే ప్రక్రియలో భాగంగా నాలుగు రౌండ్లు పూర్తి చేసుకుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు ఐదవ రౌండును ప్రారంభించింది. చంద్రయాన్-3 ముందుగా భూమి చుట్టూ ఐదు రౌండ్లు తిరిగిన తరువాత తన ప్రయాణాన్ని చంద్రుని వైపునకు మళ్లిస్తుంది. భూమి చుట్టూ తిరిగే చివరి రౌండును ఆగస్టు 1 వ తేదీ రాత్రి 12 గంటలకు పూర్తి చేసుకొని తదుపరి చంద్రుని వైపునకు వెళ్లే ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది.

కీసర బ్రిడ్జికి వరద ప్రవాహం

విస్తారంగా వానలు

- విజయవాడలో విరిగిపడిన కొండ చరియలు
- నాలుగు ఇళ్లు ధ్వంసం
- నేడు వాయు'గండం'
- పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలోని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఉపరితల ఆవర్తనం బుధవారం నాటికి వాయుగుండంగా మారనుందని, దీని ప్రభావంతో రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, పల్నాడు, కర్నూలు, నంద్యాలలో బుధ, గురువారాల్లో అత్యంత భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, ఒకటి రెండు చోట్ల అత్యంత భారీ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అమరావతి కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయనున్నాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంపై చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల వరకూ విస్తరించింది. విశాఖ సాగర తీరంలో పది మీటర్ల ఎత్తులో సముద్రపు అలలు ఎగసిపడ్డాయి. మచిలీపట్నంలో అత్యధికంగా 57 మిల్లీమీటర్లు, నందిగామలో 41, గన్నవరంలో 38, విశాఖలో 19, తిరుపతిలో ఐదు, నెల్లూరులో నాలుగు, కడపలో మూడు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలకు ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలంలోని వైరా, కట్టలేరుకు మునేరు వరద ప్రవాహం చేరింది. వీరులపాడు మండలం పల్లంపల్లి, నందిగామ మండలం దాములూరు గ్రామాల మధ్య వైరా, కట్టెలేరు కాజ్‌వేపై నుంచి వరద ప్రవహించింది. దీంతో, అధికారులు ఈ కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేశారు. కీసర సమీపంలో బ్రిడ్జి వద్ద మునేరుకు వరద ఉధృతి పెరిగింది. దీంతో, 14 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువ కృష్ణా నదిలో కలిసినట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. భారీ వర్షాలకు విజయవాడ కస్తూరిబాయిపేటలో కొండచరియలు విరిగిపడి నాలుగు ఇళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో, ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి

మిగతా 2లో

మోడీ సర్కార్‌పై అవిశ్వాసం!

26 ప్రతిపక్ష పార్టీల యోచన • మణిపూర్‌పై ప్రధాని నోరువిప్పక తప్పదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలనే ప్రతిపాదనపై ప్రతిపక్ష పార్టీలు చర్చించాయి. అవిశ్వాస తీర్మానం పెడితే ,ప్రధాని మోడీ పార్లమెంట్‌కు రాకుండా, మణిపూర్‌పై సభలో మాట్లాడకుండా తప్పించుకునేందుకు ఇక ఎంతమాత్రం అవకాశం ఉండదు. అదే సమయంలో మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రతిపక్షాలకు అవకాశం వస్తుంది. అవిశ్వాసం ప్రవేశపెట్టే అంశంపై గత రెండు రోజులుగా 26 ప్రతిపక్ష పార్టీలు చర్చించుకుంటున్నాయి. బుధవారం పార్లమెంట్‌లోని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమై అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చే విషయాన్ని ఖరారు చేస్తారు. మణిపూర్‌పై ప్రధాని మోడీ పార్లమెంటుకు వచ్చి ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టడంతో మంగళవారం కూడా పార్లమెంటు స్తంభించిపోయింది.

రూల్ 267 కింద చర్చ కాకుండా.. రూల్ 176 కింద చర్చా?

వెంటనే కాంగ్రెస్ నేత పి. చిదంబరం జోక్యం చేసుకొని రూల్ 267 కింద 51 నోటీసులు ఇస్తే, దాన్ని పక్కన పెట్టి, రూల్ 176 కింద ఇచ్చిన నోటీసులపై ఎలా చర్చ ప్రారంభిస్తారని ప్రశ్నించారు. 51 నోటీసులు ఈ రోజు ఇచ్చినవని, కనుక ఈ రోజే (మంగళవారం) రూల్ 267 కింద ఆ నోటీసులపై చర్చ జరగాలని అన్నారు. ఆ తరువాత 176 కింద ఇచ్చిన నోటీసులపై చర్చ చేయాలని సూచించారు. దీంతో వెంటనే ఛైర్మన్ ధన్‌ఖర్ జోక్యం చేసుకొని మాట్లాడేందుకు ప్రయత్నించే సమయంలో, బిజెపి ఎంపి గణశ్యాం తివారీ లేచి రాజస్థాన్‌లో దాడులపై చర్చించాలని పట్టుపట్టారు. ఛైర్మన్ కూర్చోమని పదే పదే వారించినప్పటికీ ఆయన వినిపించుకోలేదు. కాగా బిజెపి ఎంపిలంతా తమ స్థానాల్లో లేచి నినాదాలు చేశారు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు కూడా లేచి, మణిపూర్‌పై చర్చకు పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఛైర్మన్ ధన్‌ఖర్ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య ఛైర్మన్ ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.

పార్లమెంట్‌లోని మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో బుధవారం సమావేశమైన ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు

రాజ్యసభలో ఎస్‌టి సవరణ బిల్లు ఆమోదం

సభ్యుల నిరసనలు, ఆందోళనల మధ్య రాజ్యాంగ సవరణ (షెడ్యూల్డ్ కులాల ఆర్డర్) బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తారు, తెలుగులో మాట్లాడిన వైసిపి ఎంపి ఆర్. కృష్ణయ్య బిల్లుకు మద్దతు తెలిపారు. వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి, బిజెడి ఎంపి నిరంజన్ బిషి, బిజెపి ఎంపిలు సమీర్ ఒరాన్, సరోజ్ పాండే, కిరోడి లాల్ మీనా తదితరులు బిల్లుపై మాట్లాడారు.

మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీస్ బిల్లు ఆమోదం

లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని వెల్‌లోకి దూసుకెళ్లారు. మణిపూర్‌పై ప్రధాని మోడీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు హోరెత్తించారు. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే జీవ వైవిధ్య (సవరణ) బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదింపజేసుకున్నారు. ఆ తరువాత సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (సవరణ) బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. బిల్లుపై కేవలం నలుగురు సభ్యులు మాత్రమే చర్చలో పాల్గొన్నారు. అందులో ఇద్దరు బిజెపి ఎంపిలే ఉన్నారు. బిజెపి ఎంపిలు మనోజ్ కిశోర్ బాయి, సంతోష్ కుమార్ గంగ్వార్, వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు, బిఎస్‌పి ఎంపి రామ్ శిరోమణి వర్మ చర్చలో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందగానే సభను బుధవారానికి వాయిదా వేశారు. మణిపూర్‌లో అశాంతిపై కేంద్రం, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు పలికేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు.

51 నోటీసులు ఇచ్చిన ప్రతిపక్ష సభ్యులు

పార్లమెంట్‌లో ఆప్ ఎంపి రాఘవ్ చద్దా మాట్లాడుతూ, "నిన్న (సోమవారం) ఆప్ ఎంపి సంజయ్ సింగ్ సస్పెన్షన్ తీర్మానం ఆమోదించకముందే, దాని కోసం ఓటింగ్ నిర్వహించాలని నేను మిమ్మల్ని అభ్యర్థించాను. సంజయ్ సింగ్ సస్పెన్షన్‌పై ఇప్పుడే విభజన కోరుతున్నాను" అని అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆయన విజ్ఞప్తిని తిరస్కరించి సభను ప్రారంభించారు. మణిపూర్‌పై చర్చ జరపాలని ప్రతిపక్ష ఎంపిలు జాన్ బ్రిట్టాస్, ఎలమరం కరీం, బినయ్ విశ్వం, ప్రమోద్ తివారీ, మల్లికార్జున్ ఖర్గే, మనోజ్ కుమార్ ఝా, కె.కేశవరావు, కెఆర్ సురేష్ రెడ్డి, పార్థసారధి రెడ్డి, జోగినిపల్లి సంతోష్ కుమార్, బడుగు లింగయ్య యాదవ్, జైరాం రమేష్, డోలా సేన్, తిరుచ్చి శివ, ప్రియాంక చతుర్వేది, ఎం.షణ్ముగమ్, రాఘవ్ చద్దా, జోషి కె మణి, రామ్ గోపాల్ యాదవ్ తదితరులు రూల్ 267 కింద 51 నోటీసులు ఇచ్చారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో మహిళలు, చిన్నారులపై జరిగిన అత్యాచారాలు, దాడులపై రూల్ 176 కింద స్వల్పకాలిక చర్చ కోసం బిజెపి ఎంపిలు గణశ్యాం తివారీ, కిరోడిలాల్ మీనా, రామీలా బెన్‌లు నోటీసులు ఇచ్చారు. దీనిపై సభా నేత, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ లేచి రూల్ 176 కింద ఇచ్చిన నోటీసులు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ నోటీసులను అనుమతించాలని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌ను కోరారు.

రైతులకు మేలు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో

- 421 ప్రాసెసింగ్ కలెక్షన్ సెంటర్లను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో మార్కెట్ సౌకర్యం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఆయన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. వాటిలో తిరుపతి జిల్లా శ్రీ సిటీలో మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రయివేట్ లిమిటెడ్, చాక్లెట్ అండ్ మిఠాయి తయారీ విస్తరణ యూనిట్, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్, చిత్తూరు జిల్లాలో మూడు, అన్నమయ్య జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం నాలుగు పండ్లు, కూరగాయల ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో మూడు టమాట ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం రేగ గ్రామంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను, కర్నూలు జిల్లా తడకనపల్లెలో వంద మైక్రో యూనిట్స్‌తో ఉల్లిపాయలు, టమోటా సోలార్ డీ హైడ్రేషన్ క్లస్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మొత్తం 421 ప్రైమరీ ప్రాసెసింగ్ కలెక్షన్ సెంటర్లను ప్రారంభించుకున్నామని, ఇవన్నీ 1,912 ఆర్‌బికెలకు మ్యాప్ చేశామని తెలిపారు. మొత్తం 945 కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. తొలిదశలో 344 కోల్డ్ రూముల పనులు జరుగుతున్నాయని, వీటిలో 43 కోల్డ్ రూములను ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇవి కూడా దాదాపు 194 ఆర్‌బికెలతో అనుసంధానం అయ్యాయన్నారు ప్రతి ఆర్‌బికెను కోల్డ్ రూములు, కలెక్షన్ సెంటర్లకు మ్యాపింగ్ చేసి ప్రైమరీ ప్రాసెసింగ్‌లో డ్రయ్యింగ్ ప్లాట్‌ఫామ్‌లు, కలెక్షన్ సెంటర్లు, వ్యవసాయ ఉపకరణాలు వంటి వాటిని వాటి పరిధిలోకి తీసుకొస్తామని తెలిపారు. సెకండరీ ప్రాసెసింగ్ కోసం జిల్లాకొకటి ఉండేటట్టుగా అడుగులు పడుతున్నాయన్నారు. శ్రీ సిటీలో మరో రూ.1600 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేయడం ఆనందం కలిగిస్తోందని పేర్కొన్నారు. మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ రెండో విడతలో రూ.1500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకురావడం రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. చాక్‌లెట్, క్యాడ్‌బెర్రీ, బోర్నవిటా వంటివి తయారు చేస్తున్న ఈ ప్యాక్టరీ దినదినాభివృద్ధి చెందాలని, మంచి జరగాలని ఆకాంక్షించారు. ధర్మవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో వేరుశనగకు మెరుగైన ధర లభించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రూ.3 వేల కోట్లు ప్రతి సంవత్సరం కేటాయించడంతో పాటు, ఈ నాలుగేళ్లలో దాదాపుగా రూ.8 వేల కోట్లు ఇతర పంటల కొనుగోలుకు ఖర్చు చేశామని తెలిపారు. మిల్లెట్స్‌లో దాదాపు 13 సెకెండరీ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో 32 పైచిలుకు ప్రైమరీ ప్రాసెసింగ్ మిల్లెట్ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా మిల్లెట్లకు ఎంఎస్‌పి అందించింది మన రాష్ట్రమేనని అన్నారు. కర్నూలులో ఉల్లిపాయల డీహైడ్రేషన్ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద వంద చోట్ల చేస్తున్నామని, లక్ష రూపాయల పెట్టుబడితో ప్రతి ఒక్కరికీ దాదాపు రూ.12 వేల ఆదాయం రానుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ యూనిట్లను ఐదు వేల వరకు పెంచుతామన్నారు.

చైనా విదేశాంగ మంత్రిగా వాంగ్ యీ

బీజింగ్: చైనా ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన విదేశాంగ మంత్రిగా వాంగ్ యీను తిరిగి నియమించింది. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న కిన్ గాంగ్‌ను తొలగించి వాంగ్ యీకు బాధ్యతలు అప్పగించింది. మంగళవారం జరిగిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో బాటు బ్యాంక్ ఆఫ్ చైనాకు కొత్త గవర్నరుగా పాన్‌గాంగ్‌షెంగ్‌ను నియమించింది. గత ఏడాది డిసెంబరులో విదేశాంగ మంత్రిగా కిన్ గాంగ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కిన్ గాంగ్ ఆకస్మిక తొలగింపునకు ఆరోగ్యపరమైన అంశాలే కారణమై ఉండొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికాతో కీలకమైన దౌత్య చర్చల్లో కిన్ గాంగ్ సమర్థవంతంగా వ్యవహరించలేకపోయారనే విమర్శలూ ఉన్నాయి. వాంగ్ యీ దాదాపు దశాబ్దం పాటు విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆయన ప్రస్తుతం చైనా కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ వ్యవహారాల కమిషన్ డైరక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

'పోలవరం' వరద బాధితులను ఆదుకోండి

- మంత్రి ధర్మానకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో పోలవరం ప్రాజెక్టు కారణంగా వరద బారిన పడుతున్న ప్రజానీకాన్ని ఆదుకోవాలని, వారు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం సంతకాలు చేసిన విజ్ఞాపన పత్రాన్ని రెవిన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు మంగళవారం అందచేశారు. గత ఏడాది వరదబారిన పడి అనేకసమస్యలు ఎదుర్కున్న ఇక్కడి ప్రజానీకం తాజాగా వచ్చిన వరదలతో మళ్లీ అనేక ఇబ్బందుల్లో చిక్కుకున్నారని వివరించారు. ఈ విషయమై దృష్టి సారించి ఇక్కడి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని మంత్రిని కలిసిన కె.ఎస్ లక్ష్మణరావు, మంతెన సీతారాం కోరారు. మంత్రికి అందించిన విజాక్షపన పత్రంలో గత సంవత్సరం జూలై 11న వచ్చిన గోదావరి వరద వల్ల రెండు జిల్లాల పరిధిలో కూనవరం, విఆర్‌పురం, దేవీపట్నం, ఎటపాక, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో 193 గ్రామాలు పూర్తిగా నీట మునిగి 100 రోజులపాటు వరద నీటిలో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. అది గోదావరి చరిత్రలో అతిపెద్ద వరదని పేర్కొన్నారు. పోలవరం వద్ద కాఫర్ డ్యాం నిర్మాణం వల్ల నీరు వెనక్కి తన్ని జల ప్రళయం సంభవించిందని తెలిపారు. ఈ మండలాల్లో ఊళ్లకు ఊళ్లు నేలమట్టం అయ్యాయని, వేలాది కుటుంబాలు కొండలు, గుట్టలు ఎక్కి వారాల తరబడి అక్కడే నానా అగచాట్లు పడ్డారని తెలిపారు. రెండు నెలల అనంతరమే గ్రామాలకు చేరుకున్నారని, సర్వం కోల్పోయిన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రెండువేల రూపాయలు సహాయం మాత్రమే ఇచ్చిందని, సర్వే చేయలేదని నష్టపరిహామూ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెక్కలు తప్పుల తడకలుగా ఉన్నాయని, ఈ మండలాల్లోని నిర్వాసిత కాలనీలూ వరద నీట మునిగాయని పేర్కొన్నారు. కాంటూరు లెక్కలు పేరుతో పునరావాసాన్ని మూడుదశలుగా నిర్ణయించారని, దీని వల్ల నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయం జరగడం లేదని, ఒకలక్షా

మిగతా 2లో

మంత్రి ధర్మానకు వినతి పత్రం అందజేస్తున్న కెఎస్ లక్ష్మణరావు, మంతెన సీతారాం

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా ఎన్నిక చెల్లదు

- జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటించిన హైకోర్టు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. 2018 ఎన్నికల్లో వనమా సమీప ప్రత్యర్థి జలగం వెంకట్రావును కొత్తగూడెం ఎమ్మెల్యేగా కోర్టు ప్రకటించింది. ఎన్నికల కమిషన్‌కు ఉద్దేశపూర్వకంగా తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని వనమాకు న్యాయస్థానం రూ.5 లక్షల జరిమానా విధించింది. 2018 ఎన్నికల అఫిడవిట్‌లో వనమా వెంకటేశ్వరరావు, ఆయన భార్య ఆస్తులకు సంబంధించి తప్పుడు సమాచారం ఇచ్చారంటూ అప్పటి ప్రత్యర్థి జలగం వెంకట్రావు ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 125 ఎ కింద 2019 జనవరిలో తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి తుది తీర్పు ప్రకటించారు. 2018 ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున వనమా వెంకటేశ్వరరావు, టిఆర్‌ఎస్ తరుపున జలగం వెంకట్రావు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారు. స్వల్ప మెజార్టీతో గెలిచిన వనమా ఆ తర్వాత టిఆర్‌ఎస్‌లో చేరారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఎపి ఒపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో జరిగిన పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు సొసైటీ డైరెక్టరు కెవి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జూన్ 26 నుంచి జులై 4 వరకు పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రెండింటిలోనూ బాలికలే పైచేయి సాధించారని వివరించారు. పదోతరగతిలో 13,320 మంది విద్యార్థులు హాజరైతే 7,619 (57.20 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో బాలికలు 52.60 శాతం, బాలురు 41.75 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. 88.19 శాతంతో కాకినాడ మొదటి స్థానంలో నిలవగా, 16.83 శాతంతో ఎన్‌టిఆర్ జిల్లా చివరిస్థానంలో ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 25,097 మంది హాజరుకాగా, 15,676 (62.46 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని అన్నారు. వీరిలో బాలికలు 65.32 శాతం, బాలురు 60.92 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 84.68 శాతంతో తూర్పుగోదావరి మొదటి స్థానంలో, 42.71 శాతంతో పశ్చిమగోదావరి చివరి స్థానంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఫలితాలను www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. జులై 27 నుంచి ఆగస్టు 4 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు సంబంధించిన ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన రుసుం ఎపి ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చుని, ప్రత్యేకమైన అభ్యర్థనలు పంపాల్సిన అవసరం లేదని తెలిపారు.

పట్టించుకోండి మహాప్రభో!

- పునరావాస కేంద్రాల్లో దీనస్థితిలో ముంపు మండలాల ప్రజలు
- తాగునీటికి కటకట
- నిత్యావసర సరుకులు ఇవ్వని ప్రభుత్వం
- దోమలతో కంటినిండా నిద్ర కరువు

3

కేంద్రం మళ్లీ అదే వంచన

- కడప స్టీల్ లాభదాయకం కాదట
- దుగరాజుపట్నం పోర్టు కుదరదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల పట్ల మరోమారు వంచనకు పాల్పడింది. కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని, దుగ్గరాజుపట్నంలో ఓడరేవు సాధ్యం కాదని తేల్చేసింది. మంగళవారం లోక్‌సభలో టిడిపి ఎంపిలు కేశినేని నాని, కె రామ్మోహన్ నాయుడు, వైసిపి ఎంపి అవినాష్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బిఆర్‌ఎస్ ఎంపి ఎం శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం చేయాల్సినవాటిలో చాలా చేశామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు.

కడప జిల్లాలో సమీకృత ఉక్కు పరిశ్రమ సాంకేతికంగా, ఆర్థికంగా లాభదాయకం కాబోదని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) అధ్యయన నివేదిక ఇచ్చినట్లు మంత్రి నిత్యానంద సెలవిచ్చారు. అయితే సెయిల్ నివేదిక తర్వాత ఏపిలో ఉక్కు కర్మాగారం సాధ్యాసాధ్యాలపై జాయింట్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమీప ప్రాంతాల్లో ఉన్న పోర్టులు నుండి గట్టి పోటీ ఉండటంతో దుగ్గరాజుపట్నంలో ప్రధాన ఓడరేవు ఏర్పాటు సాధ్యం కాలేదు. దుగ్గరాజుపట్నం బదులు రామాయపట్నం వద్ద మేజర్ పోర్టు అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిందని, అయితే రామాయపట్నం నాన్ మేజర్ పోర్టుగా నోటిఫై అయినందున ఏపి ప్రభుత్వమే దానిని మైనర్ పోర్టుగా డీ నోటిఫై చేయాలని, లేకపోతే ఇందుకోసం మరో ప్రాంతాన్ని గుర్తించాలని సూచించినట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఇప్పటి వరకు ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థల కోసం, పోలవరం కోసం రూ.21 వేల కోట్లు కేటాయించామని పేర్కొనడం గమనార్హం. 'ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎస్ఇఆర్, గిరిజన యూనివర్శిటీ, వ్యవసాయ యూనివర్శిటీ, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం కోసం ఇప్పటి వరకు రూ.21,154.568 కోట్లు విడుదల చేశాం' అని మంత్రి తెలిపారు. అలాగే ప్రత్యేక రైల్వే జోన్‌కు, సౌత్‌కోస్ట్ రైల్వేజోన్ ప్రధానకార్యాలయం ఏర్పాటుకు 2022లో రూ.106.89 కోట్లు మంజూరు చేశామన్నారు. 2023-24లో మరో రూ.పది కోట్లు ఇచ్చామన్నారు. విభజన చట్టం ప్రకారం పంపకాలకు సంబంధించి వివాదాలు పరిష్కరించేందుకు జోక్యం చేసుకోవడం కేంద్రం కృషి చేస్తోందన్నారు.

కేంద్రం మోసకారితనం : సిపిఎం

కడప ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రం మోసకారితనం బట్టబయలైందని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చేసిన ప్రకటనను ఖండించారు. అక్కడ ఉక్కు ప్యాక్టరీ సాధ్యం కాదన్న కేంద్రం ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వేజోన్, రామాయపట్నం పోర్టు, రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహం బయటపడ్డాయన్నారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాలని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టుపైనా వివరణ ఇవ్వాలని కోరారు.

ఎపిలో భారీగా తగ్గిన ధాన్యం సేకరణ : కేంద్ర మంత్రి తోమర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సేకరణ భారీగా తగ్గింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఇచ్చిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరణ 2020-21లో 56.66 లక్షల మెట్రిక్ టన్నులు చేస్తే, 2021-22లో అది 44.61 లక్షల మెట్రిక్ టన్నులకు, 2022-23లో 28.34 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గింది. గత రెండేళ్లగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పత్తి సేకరణ జరగటం లేదు. అంతకముందు తెలంగాణలో పత్తి సేకరణ తగ్గగా, ఎపిలో పెరిగింది. రాష్ట్రంలో వేరుశెనగ సేకరణ గత రెండేళ్లుగా జరగటం లేదు. అంతకు ముందు రెండేళ్లు సేకరణ జరిగింది. ఎపిలో పెసలు సేకరణ 2022-23లో జరగలేదు. 2021-22లో 2,209.52 మెట్రిక్ టన్నులు సేకరణ జరిగింది. గత నాలుగేళ్ల నుంచి కందులు సేకరణ జరగలేదు. 2022-23లో జొన్నలు 3,621 మెట్రిక్ టన్నులు సేకరించగా, అంతకముందు నాలుగేళ్లు సేకరించలేదు. ఎపిలో 2022-23లో 4 మెట్రిక్ టన్నులు రాగులు సేకరించగా, అంతకుముందు నాలుగేళ్లు సేకరణ జరగలేదు.

ప్రభుత్వ మెడికల్ సీట్లతో వ్యాపారం తగదు

- ఎపి ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్ సీట్లను అమ్మకానికి పెట్టే జిఒ నెంబరు 108ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్తగా ఈ ఏడాది నుండి ఏర్పాటుకానున్న ఐదు మెడికల్ కాలేజీల్లోని సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో ఫీజులు నిర్ణయించడం తగదని పేర్కొన్నారు. బి కేటగిరికి రూ.12 లక్షలు, సి కేటగిరికి రూ.20 లక్షల ఫీజులు పెడితే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర రిజర్వేషన్ సౌకర్యం వున్న పేద విద్యార్థులకు తీవ్రంగా నష్టం కలుగుతుందన్నారు. పెద్ద మొత్తంలో ఫీజులు పెడితే ప్రజావైద్య సేవలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు వైద్య సేవలు భారంగా మారే ఇలాంటి నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జిఒ 108ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

టిడిపి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జిగా కోటంరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని టిడిపి నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియమించినట్లు పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి గెలుపొందిన శ్రీధర్ రెడ్డి ఇటీవల ఆ పార్టీకి రెబల్‌గా మారిన సంగతి తెలిసిందే.

వ్యవసాయంపై చంద్రబాబుకు మాట్లాడే అర్హత లేదు : కాకాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని టిడిపి హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు నాయుడుకు వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన 14 ఏళ్ల కాలంలో వ్యవసాయాన్ని ఏనాడూ పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఎన్నికలు వున్నాయని మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని అన్నారు. 2014కు ముందు రైతు రుణమాఫీ హామిని ఎలా అటకెక్కించారో రాష్ట్ర ప్రజలు చూశారని, ఇప్పుడు మాయమాటలు చెబితే నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు ఆత్మహత్యలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను ఎగ్గొట్టారని విమర్శించారు.

ఇ-కెవైసి దెబ్బ

- పిఎం కిసాన్‌లో కోతల పర్వం
- కొత్తగా 5.34 లక్షల మంది రైతులు దూరం
- భరోసాపై ప్రభావం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు పెట్టుబడి సాయం అందించే కేంద్ర పథకం 'పిఎం కిసాన్'లో లబ్ధిదారుల కుదింపు ఆగట్లేదు. ఈ నెల 27న జమ అవుతుందంటున్న కిస్తుకు ఇ-కెవైసి ప్రతిబంధకంగా మారింది. మిగతా అవాంతరాలన్నీ దాటుకొని అర్హత సాధించిన రైతుల్లో ఇ-కెవైసి చేయించని కారణంగా 5.34 లక్షల మంది పిఎం కిసాన్ సాయానికి దూరమవుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో రైతులకు కేంద్రం ఇచ్చే రూ.2 వేల సాయం అందకుండా పోతోంది. ఏడాదిలో మూడు కిస్తుల్లో మొత్తం రూ.ఆరు వేలను 'పిఎం కిసాన్' పేరిట నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలకు కేంద్రం నగదు బదిలీ చేస్తోంది. స్వంత భూమి కలిగిన వారికే ఈ సాయం అందిస్తోంది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జులై మొదటి కిస్తు ఈ నెలాఖరులోపు వేసేందుకు కసరత్తు సాగుతోంది. ఎపిలో 45,41,177 మంది రైతులు పథకానికి ఎంపికయ్యారు. తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించుకుంటేనే వీరికి పిఎం కిసాన్ కిస్తు పడుతుందని కేంద్రం షరతు పెట్టింది. జులై నెలాఖరు సమీపిస్తున్నా ఇ-కెవైసి పూర్తి కాలేదు. 40,06,553 మందికి (88 శాతం) మాత్రమే ఇ-కెవైసి జరిగింది. ఇంకా 5,34,624 మందికి (12 శాతం) ఇ-కెవైసి పూర్తి కాలేదు. కిస్తు పడే నాటికి ఇ-కెవైసి జరగకపోతే ఆ రైతుల ఖాతాల్లో కేంద్రం నుంచి కిస్తు పడదు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 38,737 మంది రైతులకు ఇ-కెవైసి కాలేదు. అత్యల్పంగా విశాఖపట్నంలో 3,906 మందికి ఇ-కెవైసి కాలేదు.

అంతులేని కట్స్

'పిఎం కిసాన్' కోతలకు అంతే లేదు. 2019 ఎన్నికల ముంగిట మోడీ ప్రభుత్వం మొదలు పెట్టిన ఈ పథకానికి లబ్ధిదారులు క్రమేపి తగ్గిపోతున్నారు. రాష్ట్రంలో 60,80,161 మంది రైతులు పిఎం కిసాన్ సాయానికి అర్హులుగా ఉన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి కిస్తు (ఏప్రిల్-జులై) 46,62,768 మందికి జమ అయింది. వివిధ కారణాలతో 14 లక్షల మందికి సాయం చేయకుండా ఎగరగొట్టారు. అదే ఏడాది రెండవ కిస్తు (ఆగస్టు-నవంబర్) 52,18,734 మందికి పడింది. అర్హుల్లో సుమారు 8 లక్షల మందికి సాయం చేయకుండా ఎగనామం పెట్టారు. 2022-23 చివరి కిస్తు (డిసెంబర్-మార్చి) నుంచి

ఇ-కెవైసి నిబంధన కఠినంగా అమలు చేస్తున్నారు. దాంతో లబ్ధిదారుల సంఖ్య 48,91,293 కు దిగజారింది. త్వరలో వేస్తారంటున్న ఈ ఆర్థిక సంవత్సరంలో తొలికిస్తు (ఏప్రిల్-జులై) 40,06,553 మందికే పడుతుందని ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. ఇ-కెవైసి పెండింగ్ వలన 5.34 లక్షలు, ఇతరత్రా కారణాల వలన 15 లక్షలు వెరసి అర్హులైన రైతుల్లో 20 లక్షల మందికి పిఎం కిసాన్ సాయం దక్కట్లేదు.

చిక్కుతున్న భరోసా

రైతులకు పెట్టుబడి సాయం అందించే వైఎస్ఆర్ రైతు భరోసా పథకాన్ని కేంద్ర స్కీం పిఎం కిసాన్‌తో అనుసంధానించింది రాష్ట్ర ప్రభుత్వం. ఏడాదికి రూ.13,500 మూడు విడతల్లో ఇస్తామనగా వాటిలో కేంద్రం వాటా రూ.6 వేలు. కేంద్ర నిబంధనల వలన లక్షల మందికి పిఎం కిసాన్ అందట్లేదు. రాష్ట్రం ఇచ్చే 7,500 మాత్రమే పడుతోంది. ఈ ఏడాది 'భరోసా' తొలి కిస్తు రూ.5,500 జూన్ 1న రాష్ట్ర ప్రభుత్వం 52.30 లక్షల మందికి విడుదల చేసింది. ఇ-కెవైసి నిబంధన వలన కేంద్రం వాటా 'పిఎం కిసాన్' 40.06 లక్షల మందికే పడుతోంది.

జె నివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆశాలపై పని భారం తగ్గించండి

- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆశా వర్కర్లపై పని భారాన్ని వేంటనే తగ్గించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు జె నివాస్‌కు కోశాధికారి ఎ కమలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆన్‌లైన్ పనుల పేరిట అధికారుల వేధింపులు, బెదిరింపులను వెంటనే ఆపాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇస్తున్న 2జి సిమ్‌ల స్థానంలో 4జి సిమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగస్తుల మాదిరిగానే సెలవులు, మెడికల్ లీవ్‌లు ఆశాలకు అమలు చేయాలని కోరారు. సెలవులు లేకపోవడంతో ఆశా వర్కర్లు అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై స్పందించిన కమిషనరు.. సమస్యలను జిల్లా అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఇతర సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

వెంటిలేటర్‌పై రైతు : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాల వలన రాష్ట్రంలో రైతన్న వెంటిలేటర్‌పై ఉన్నాడని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగం ఎంత సంక్షోభంలో కూరుకుపోతుందో చెప్పడానికి వైసిపి నాలుగేళ్లపాలనే నిదర్శనమని చెప్పారు. నాలుగేళ్లల్లో రైతులకు, వ్యవసాయానికి చేసిన మేలుపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభమైనా రాష్ట్రంలో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. నాలుగేళ్లల్లో సాగును చంపి రైతును ముంచేశారని మండిపడ్డారు. నాలుగేళ్లల్లో 3వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతులకు అప్పులు తప్ప ఈ ప్రభుత్వం ఒరగబెట్టిందని శూన్యమని పేర్కొన్నారు. జగన్ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంజాయి పంట మాత్రమే సాగవుతుందని విమర్శించారు. గుంటూరు జిల్లాలో మిర్చి, గోదావరి జిల్లాల్లో ధాన్యం, అనంతపురంలో వేరుశనగ, కర్నూలు జిల్లాలో పత్తి, ఉత్తరాంధ్రలో జీడి రైతుల్లో ఒక్కరైనా బాగున్నారా అని పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్, కోస్తాను ఆక్వాహబ్‌లుగా మార్చాలని తాను పనిచేశానని చెప్పారు. వాణిజ్య పంటల సాగువిస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. లెక్కల్లో చూపకుండా మోసం చేయడం, తప్పుడు లెక్కల్లో జగన్ సిద్ధహస్తుడని విమర్శించారు. రాష్ట్రంలో 93శాతం రైతాంగం అప్పులపాలైందని, సగటున ప్రతి రైతుపై రూ.2,45,554ల అప్పు ఉందని తెలిపారు. రైతు భోరోసా కేంద్రాలు దోపిడీ కేంద్రాలుగా మారాయన్నారు. ధాన్యం రైతులకు సరైన గోతాలు ఇవ్వడం లేదన్నారు. మంత్రులు రైతుల్ని చులకనగా చూస్తుంటే, ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా రైతువద్దకు వెళ్లి పంటలు పరిశీలించి ధైర్యం చెప్పారా అని నిలదీశారు. రైతులకు కనీస గిట్టుబాటు ధర అందించి, ఉత్పత్తులు కొని వినియోగదారులకు అందించాలన్నారు. రైతుల మెడలకు ఉరితాళ్లు బిగించేలా మోటార్లకు మీటర్లు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు మీటర్లు పెట్టేందుకు ఒప్పుకోలేదన్నారు. అప్పులు తెచ్చి ఆ సొమ్ముతో విలాసాలు చేసేందుకే మీటర్లు అని విమర్శించారు.

ఓటరు జాబితాలో బిఎల్ఎల పాత్ర కీలకం

ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎ) పాత్ర కీలకమని చంద్రబాబు నాయుడు అన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ఆ పార్టీ నేతలతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 20 వరకు జరుగుతున్న ఓటరు జాబితా సవరణలో గ్రామస్థాయిలోని ప్రతిఒక్క బిఎల్ఎ డోర్‌టు డోర్ కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. గ్రామస్థాయిలో అధికార పార్టీ నేతలు కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అవకతవకలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇటువంటి తప్పులు గుర్తించిన బిఎల్ఎలు, పార్టీ నాయకులు వెంటనే పార్టీ కార్యాలయానికి వాట్సాప్ ద్వారా పంపించాలని చెప్పారు.

కొనసాగుతున్న వరద ప్రవాహం

- కాటన్ బ్యారేజీ వద్ద 9.90 అడుగులు
- భద్రాచలం వద్ద 37.10 అడుగుల నీటిమట్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరికి వరద ప్రవాహం కొనసాగుతుంది. రెండు రోజులు నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అల్పపీడన ప్రభావంతో మళ్లీ వరదలు వస్తాయోమోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 9.40 అడుగులు, భద్రాచలం వద్ద 39.00 అడుగుల నీటి మట్టం నమోదైంది. కాటన్ బ్యారేజీ 175 గేట్లను పైకెత్తి 6,96,290 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో అన్ని రేవులు, స్నానఘట్టాలను అధికారులు మూసేశారు. ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండటం, ఏజెన్సీ ప్రాంతంలో కుండపోత వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో గోదావరికి మళ్లీ వరద పోటెత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో 14 గిరిజన గ్రామాలకు వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని వశిష్ట గోదావరి వరద క్రమేపీ తగ్గుతోంది.

శబరికి పెరుగుతోన్న వరద

అల్లూరు జిల్లా చింతూరులో శబరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం 30 అడుగుల ఉండగా క్రమంగా తగ్గుతూ మంగళవారం ఉదయం 25 అడుగులకు చేరింది. మళ్లీ సాయంత్రానికి 26 అడుగులకు చేరింది. శబరి నదికి ఆనుకొని ఉన్న ప్రజలు ఎర్రంపేట, రత్నాపురం, పోతనపల్లి తదితర గ్రామాల్లో సామాన్లను భద్రపరుచుకొని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఫ్లడ్ సెంటర్లలో ఉంటున్నారు. చొక్కనపల్లి వరద బాధిత గ్రామంలో సిపిఎం నాయకులు సందర్శించారు. ఏ ఒక్క కుటుంబానికీ ఇప్పటి వరకు నిత్యావసరాలు ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద

ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి 9559 క్యూసెక్కుల నీరు వస్తుండగా కాల్వలకు, సముద్రంలోకి కలిపి అదే స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 3.07 టిఎంసిల నీటిమట్టం నమోదైంది. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో పులిచింతలలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 19.73 టిఎంసిలుగా నమోదైంది. ఎన్‌టిఆర్ జిల్లాలోని మునేరుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో ఎనిమిదివేల క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 14వేల క్యూసెక్కులుగా ఉంది. వీరులపాడు మండలం పల్లంపల్లి, నందిగామ మండలం దాములూరు గ్రామాల మధ్య వైరా, కట్టెలేరుకు వరద నీరు చేరటంతో కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేశారు.

త్రిపురాంతకం చేరిన సాగర్ జలాలు

నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేసి నీరు ప్రకాశం జిల్లా త్రిపురాంతకానికి చేరాయి. గొల్లపల్లి, దూపాడు, ముటుకుల, నడిగడ్డ, మంచినీటి చెరువులకు సాగర్ నీటిని పంపే పనిలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఉన్నారు. జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటాయని, సాగర్ జలాలను విడుదల చేయాలని ఇటీవల సిఎంను మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు.

భారతి సిమెంటు కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారతి సిమెంటుపై కేసు విచారణ ఆగస్టు ఒకటికి వాయిదా పడింది. భారతి సిమెంటుకు సంబంధించి జప్తు చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు సొమ్ము చేసుకున్న తరువాత పిటిషన్‌లో విచారణకు ఏముందని ఇడిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. భారతి సిమెంటుకు చెందిన సుమారు రూ.150 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు బ్యాంకు హామీతో విడుదల చేయాలని 2019లో అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. హైకోర్టు కూడా దీన్ని సమర్థించడంతో సుప్రీంకోర్టును ఇడి ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. డిపాజిట్లు సొమ్ము చేసుకున్న తర్వాత ఇంకేం చేయదలచుకున్నారో దర్యాప్తు సంస్థ నుంచి తగిన సూచనలు తీసుకోవాలని ధర్మాసనం ఇడి తరపున న్యాయవాది జోహెబ్ హుస్సేన్‌కు సూచించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు సొమ్ము చేసుకోవడంతోపాటు బ్యాంకు గ్యారెంటీని ఇడి వద్దే ఉంచుకుందని భారతి సిమెంట్స్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఆరోపించారు. దీంతో ఇడి సొమ్ము చేసుకున్న మొత్తాన్ని విడుదల చేయాలని మరో పిటిషన్ దాఖలు చేయాలని, ఈ పిటిషన్ విచారణ చేయడం ఎందుకని రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషన్ విచారించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని రోహత్గి కోరారు. భారతి సిమెంట్స్ ఇచ్చిన బ్యాంకు గ్యారెంటీ ఆగస్టు 20తో ముగుస్తుందని జోహెబ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం తదుపరి విచారణ ఆగస్టు ఒకటికి ధర్మాసనం వాయిదా వేసింది.

సిఎం జగన్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం విమానాశ్రయంలో 2018 అక్టోబరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో జరిగిన దాడి కేసులో వున్న కుట్ర కోణంపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ఎన్ఐఎ కోర్టులో వైఎస్ జగన్ వేసిన పిటిషన్ కొట్టివేయబడింది. జగన్ తరపున న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడలోని ఎన్ఐఎ కోర్టు మంగళవారం కొట్టేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వేసిన పిటిషన్‌పై వచ్చే నెల 1న విచారణ జరుపుతామని కోర్టు తెలిపింది. ఈ కేసులో నిందితుడు శ్రీనివాస్ నాలుగేళ్లుగా జైల్లోనే ఉన్నారని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పైనా ఆగస్టు 1న విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం శ్రీనివాస్ రాజమండ్రి జైల్లో ఉన్నారని, విజయవాడ ఎన్ఐఎ కోర్టులో రెగ్యులర్ విచారణకు హాజరుకావడం ఇబ్బందిగా మారిందని అతని తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై న్యాయమూర్తి ఎ సత్యానంద్ జైలు సూపరింటెండెంటును వివరణ కోరగా.. రాజమండ్రి జైల్లో రద్దీ ఎక్కువగా వుందని, ఎన్ఐఎ కేసులో రిమాండ్‌లో ఉన్న ఖైదీకి జైలు నుంచే విచారణ సాధ్యం కాదని కోర్టు దృష్టికి తెచ్చారు.

త్వరలో ఆలయాల వర్గీకరణ : మంత్రి కొట్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో ఆలయాల వర్గీకరణ చేపట్టనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాలకు యాత్రికుల తాకిడి ఎక్కువైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆలయాల ఆదాయాన్ని బట్టి మూడు కేటగిరీలుగా విభజించి అసిస్టెంట్ కమిషనరు, డిప్యూటీ కమిషనరు, రీజనల్ జాయింట్ కమిషనరు ఆధ్వర్యాన ఆలయాల వర్గీకరణ ఉంటుందన్నారు. రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల ఆదాయం లోపు ఆలయాలను అసిస్టెంట్ కమిషనరు, రూ.50 లక్షలకు పైబడి రూ.కోటి లోపు ఆదాయం ఉన్న ఆలయాలను డిప్యూటీ కమిషనరు, రూ.కోటికి పైబడి ఆదాయం ఉన్న ఆలయాలను జాయింట్ కమిషనరు పర్యవేక్షణలో ఉంచినట్లు తెలిపారు. మూడు కేటగిరీల ఆదాయ పరిమితిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

బరితెగించి మాట్లాడుతున్న సజ్జల : సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ తప్పుడు దర్యాప్తు చేసిందంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి బరితెగించి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్య రాజకీయ కారణాలతో జరిగిందని సిఎం జగన్ సోదరి షర్మిల అంటున్నారని, సజ్జల ఏదిపడితే అది మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. ఎపి సిఐడి మాదిరే సిబిఐ కూడా పనిచేయాలని సజ్జల కోరుకుంటున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. కోడికత్తి కేసులో ఎలాంటి కుట్రలేదని, ఏ శక్తులు, ఏ పార్టీలు ఆ ఘటన వెనుక లేవని ఎన్ఐఎ తేల్చిందని పేర్కొన్నారు. అమరావతిపై దుష్ప్రచారం చేయించిన జగన్ సిగ్గులేకుండా అదే ప్రాంతంలో పేదలకు ఇళ్లస్థలాలు ఎలా ఇస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు ప్రశ్నించారు. అమరావతిలో పేదలకు జగన్ కడతానంటున్న 50 వేల ఇళ్లు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నిర్మిస్తే ఆ ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. హైకోర్టులో రాజధాని కేసుల విచారణ పూర్తయి తీర్పు రిజర్వులో ఉందని, ఇళ్ల నిర్మాణానికి ఎందుకు శంకుస్థాపన చేశారని ప్రశ్నించారు.

ఐఐటి విద్యార్థి అదృశ్యం ఘటన విషాదాంతం

- ఆర్‌కె బీచ్‌లో కార్తీక్ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సంగారెడ్డిలోని ఓ ఐఐటి క్యాంపస్ నుంచి అదృశ్యమైన కార్తీక్ నాయక్ (21) కథ విషాదాంతమైంది. ఎనిమిది రోజుల క్రితం కనిపించకుండాపోయిన ఆయన విశాఖపట్నం ఆర్‌కె బీచ్‌లో మంగళవారం శవమై కనిపించాడు. ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కార్తీక్ సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న ఐఐటి క్యాంపస్‌లో రెండో సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల 17న క్యాంపస్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన తల్లిదండ్రులకూ సమాచారం ఇవ్వలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో కార్తీక్ తల్లిదండ్రులు క్యాంపస్‌కు వచ్చి విచారించగా అదృశ్యమైనట్లు తెలిసింది. దీంతో, తెలంగాణ పోలీసులు కార్తీక్ కోసం తీవ్రంగా గాలించారు. చివరిసారిగా శేరిలింగంపల్లి రేల్వే స్టేషన్‌లోని సిసి ఫుటేజ్‌లో కనిపించారు. అక్కడి నుంచి విశాఖకు జన్మభూమి రైలులో వెళ్లినట్టు గుర్తించిన పోలీసులు కార్తీక్‌పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజులుగా విశాఖపట్నం బీచ్‌లో తిరిగినట్టుగా సిసి కెమెరాల్లో నమోదైంది. ఈ క్రమంలోనే ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీచ్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్టుగా గుర్తించారు.

బైక్ మెకానిక్‌లకు సబ్సిడీ రుణాలు : లోకేష్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బైక్ మెకానిక్‌లకు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలో మంగళవారం కొనసాగింది. పాదయాత్రలో భాగంగా ద్విచక్ర వాహన మెకానిక్‌లతో చిట్‌చాట్ చేశారు. ప్రస్తుతం వస్తున్న బైకుల్లో బిఎస్5, బిస్6 ఇంజన్లు ఉన్నాయని, వాటిని రిపేరు చేయడం తెలియడం లేదని, తమకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి తగినట్లుగా పనిముట్లు అందించాలని లోకేష్‌ను మెకానిక్‌లు కోరారు. లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా లేదా పార్లమెంట్‌ని యూనిట్‌గా తీసుకొని బైక్ రిపేర్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంతనూతలపాడు, మంగమూరు గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యను వివరించారు.

నాటు పడవ బోల్తా : మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - సోంపేట : సముద్రంలో నాటు పడవ బోల్తా పడడంతో ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మెరైన్ పోలీసుల కథనం ప్రకారం.. ఇసకలపాలెంకు చెందిన గంట జనార్ధన (46), బైపల్లి కూర్మారావు, బైపల్లి రామారావు, బైపల్లి తులసయ్య, బైపల్లి రాజయ్య సముద్రంలో చేపల వేటకు నాటు పడవపై బయలుదేరారు. అలల ఉధృతికి పడవ బోల్తాపడడంతో జనార్ధన తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట బైఠాయించిన మత్స్యకారులు

యానాంలో మత్స్యకారుల ధర్నా

- నష్టపరిహారం సర్వే జాబితాలో పేర్లు లేవని ఆగ్రహం

ప్రజాశక్తి - యానాం

నష్టపరిహారం కోసం చేపట్టిన సర్వే జాబితాలో పేర్లు లేకపోవడంతో యానానికి చెందిన మత్స్యకారులు స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. సర్వేను సక్రమంగా నిర్వహించాలని, మత్స్యకారు లందరికీ పరిహారం ఇవ్వాలని నినదించారు. ఓఎన్‌జిసి సంస్థ యానాం ప్రాంతంలోని సముద్రంలో గ్యాస్‌పైప్ లైన్‌ను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో యానాం మత్స్యకారులకు 2022-23 సంవత్సరానికి నష్టపరిహారం పంపిణీ చేయనుంది. దీని కోసం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి కమిటీ ఇటీవల సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఈ జాబితాను ఇటీవల మత్స్యశాఖ విడుదల చేసింది. చేపల వేటతో పాటూ ఇతర పనులకు వెళ్తున్నారనే కారణంతో కొంతమందిని జాబితా నుంచి తప్పించింది. దీంతో మత్స్యకారులు యానాం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అర్ధాని దినేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సేన జెఎసి ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు, డిఎంకె ప్రతినిధి అరదాడి పోసియ్య ఆధ్వర్యంలో మత్స్యకార ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆంధ్ర తరహాలోనే యానాం మత్స్యకారులకూ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సుమారు ఏడు వేల మంది లబ్ధిదారులు ఉండగా రెండు వేల మందిని జాబితా నుంచి తొలగించారన్నారు. ప్రతి మత్స్యకారునికీ పరిహారం ఇవ్వాలని, లేకుంటే ఆందోళనకు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో ఆర్ఎఒ మునిస్వామి ఆందోళనకారులతో చర్చించారు. పూర్తి స్థాయిలో పరిశీలన చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.గొంతియ్య మాట్లాడుతూ.. మరోసారి గ్రామస్థాయి కమిటీ సర్వే నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విస్తారంగా వానలు

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స అందిస్తున్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఐద్వా నాయకులు కాజా సరోజ తదితరులు సందర్శించారు. ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముసురు వాన కొనసాగింది. ఈ జిల్లాలోని తూర్పు మండలాల్లో ఆరంజ్ అలర్ట్ ప్రకటించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడ్డారు. జగ్గంపేటలో భారీ వర్షానికి రహదారులపై మోకాల్లోతు నీళ్లు నిలిచిపోయాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆగి ఆగి వర్షం కురుస్తోంది. అక్కడక్కడా డ్రెయినేజీ కాలువలు సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. కర్నూలు, నంద్యాల, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో జల్లులతో కూడిన వర్షం కురిసింది.

విజయవాడ కస్తూరిభాయిపేటలో ధ్వంసమైన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, ఐద్వా నాయకులు కె.సరోజ

'పోలవరం' వరద బాధితులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఆరువేల నిర్వాసిత కుటుంబాలున్నాయని లోక్‌సభలో ప్రకటించినా ఇంతవరకు 10 శాతం పునరావాసం కూడా పూర్తి కాలేదని పేర్కొన్నారు. నష్టపరిహారం, పునరావాసం (ఆర్అండ్ఆర్) జరగకపోవడం వల్లే వేలాది కుటుంబాలు ప్రతి సంవత్సరం వరద వల్ల తీవ్ర కడగండ్లు అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి సిపిఎం రాష్ట్ర కమిటీ జూన్ 20న పెద్దఎత్తున పాదయాత్ర చేపట్టిందని వివరించారు. రెండు జిల్లాల్లో 10 మండలాల్లో 300 ముంపు గ్రామాలు, నిర్వాసితకాలనీల మీదుగా ఈ యాత్ర జరిగిందని, వేలాదిగా ప్రజలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారని పేర్కొన్నారు. జూలై నాలుగున విజయవాడలో మహాధర్నా జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విజయవాడలో, రాజమండ్రిలో సిపిఎం ప్రతినిధి బృందంతో చర్చలు జరిపిందని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో నిర్వాసితుల కాలనీల సమస్యలు, గ్రామాల సర్వేలపై చర్చ జరిగిందని, పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారని, గత వారం రోజులుగా ఈ మండలాలు గోదావరి, శబరి నదుల వరద వల్ల మళ్లీ జల దిగ్బంధనంలో ఉన్నాయని తెలిపారు. వరద ముంపు సమస్యపై సత్వరం చర్చ జరగాల్సి ఉందని, దీనిపై మంత్రి చొరవ తీసుకొని వరద సమస్యలకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వరద బాధితులకు నిత్యావసర సరుకులు వెంటనే అందించాలని, వరద గ్రామాల నుండి బాధితులను తరలించేందుకు వాహనాల ఏర్పాటు చేయాలని, పడవలు, లాంచీలు సిద్ధం చేయాలని కోరారు. ప్రతి కుటుంబానికి టార్పాలిన్లు ఇవ్వాలని, ప్రత్యామ్నాయ రహదారులు పునరుద్ధరించాలని, మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు మూతపడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, చింతూరులో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసరును సత్వరం నియమించాలని కోరరు. నిర్వాసితులకు సమగ్రంగా పరిహారం, పునరావాసం కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. 1986, 2022 నాటి వరద ముంపు అధారంగా గ్రామాల రీసర్వే చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా ఇచ్చే వరకూ గ్రామాలు ఖాళీ చేయించరాదని కోరారు.

పట్టించుకోండి మహాప్రభో!

- పునరావాస కేంద్రాల్లో దీనస్థితిలో ముంపు మండలాల ప్రజలు
- తాగునీటికి కటకట
- నిత్యావసర సరుకులు ఇవ్వని ప్రభుత్వం
- దోమలతో కంటినిండా నిద్ర కరువు

ప్రజాశక్తి- కూనవరం, విఆర్.పురం, చింతూరు విలేకరులు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

-పోలవరం నిర్వాసితుల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కోతులగుట్టలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అధికారులు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ కూనవరం, ఉదయభాస్కర్ కాలనీల వాసులు ఉంటున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యటనకు వచ్చిన రోజు, ఆ తరువాత రోజు మాత్రమే తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆ తరువాత వీరిని పట్టించుకున్న నాథుడు లేడు.

- విఆర్.పురం మండలంలోని బాధితులకు రేఖపల్లిలోని గురుకుల పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, అటవీ శాఖ కార్యాలయాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా చోట్లా కనీస సౌకర్యాలు మృగ్యంగానే ఉన్నాయి. వరద బాధితులకు నిత్యావసర సరుకులను ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు.

ఇక్కడే కాదు... పలు పునరావాస కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. గతేడాది వరదల సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లే ప్రభుత్వం ఈసారీ తమను పట్టించుకోవడంలేదని పునరావాస కేంద్రాల్లోని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను పట్టించుకోండి మహాప్రభో అని వేడుకుంటున్నారు.

ఎగువన కురుస్తోన్న వర్షాలకు అటు గోదావరి, ఇటు శబరి వరద ప్రవాహం తగ్గుతూ, పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది. కూనవరం, విఆర్.పురం, చింతూరు మండలాల్లోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను మళ్లీ వరద భయం పట్టుకుంది. దీంతో, ఈ మండలాలకు చెందిన పలువురు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లారు. వీటిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తాగునీరూ సౌకర్యం కూడా లేదు. దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో కంటినిండా కునుకులేకుండా ఉందని పునరావాస కేంద్రాల్లోని వారు వాపోయారు. విష పురుగులు, పాముల బెడద కూడా పొంచి ఉండడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చింతూరు మండల కేంద్రంలో 11 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యుత్, తాగునీరు సౌకర్యాలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ ఉంది. మంగళవారానికి కాస్త వరద తగ్గడంతో ఈ కేంద్రాల్లోని బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లారు. వారి సామాన్లు, ఇతర వస్తువులను మాత్రం పునరావాస కేంద్రాల్లోనే భద్రపరుచుకున్నారు. మిగిలిన మండలాల్లోని పునరావాస కేంద్రాల్లోని వారు అరకొర వసతుల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు.

కూనవరం మండలం కోతులగుట్టలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం

ఏ సాయమూ అందలేదు

గోదావరికి వరద వస్తుందని అధికారులు మమ్మల్ని కోతులగుట్ట పునరావాస కేంద్రానికి తరలించారు. ఇక్కడ కలెక్టర్ సుమిత్ కుమార్ వచ్చిన రోజు, ఆ మరుసటి రోజు మాత్రమే మంచినీటి సదుపాయం కల్పించారు. నాలుగు రోజుల నుంచి మావైపు ఎవ్వరూ కన్నెత్తి చూడలేదు. కష్టాల్లో ఉన్న మాకు నిత్యావసర సరుకులు ఇవ్వడం లేదు.

-గద్దల వెంకటేష్, ఉదయ భాస్కర్ కాలనీ, కూనవరం

ఈ కష్టాలు ఇంకెన్నాళ్లో..

మేం ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితోనే జీవనం సాగిస్తున్నాం. ఏటా ఇలా గోదావరి మమ్మల్ని ముంచేస్తుంటే భయమేస్తోంది. ఈ కష్టాలు మాకు ఇంకెన్నాళ్లో అర్థం కావడం లేదు. పునరావాస కేంద్రంలో తినేందుకు కూడా మా వద్ద ఏమీ లేవు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నిత్యావసరాలు ఇవ్వాలి.

-నాచుపల్లి వీరబాబు, కూనవరం

పచ్చళ్లతోనే కాలం గడుపుతున్నాం

ఆరు రోజుల నుంచి మాకు సాయం చేసే వారే కరువయ్యారు. మా వద్ద నిత్యావసర సరుకులు లేవు. కూరగాయలు కొందామంటే ధరలు ఆకాశాన్ని ఎక్కి కూర్చున్నాయి. మేము తెచ్చుకున్న ఊరగాయ, పచ్చళ్లతోనే కాలం గడుపుతున్నాం. నిత్యావసరాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. మంచినీటి సదుపాయం కూడా లేదు.

-ఎడ్ల మాణిక్యం, కూనవరం

కారుణ్య నియామక ఉద్యోగులకు టైపు పరీక్ష నుంచి మినహాయింపు

- జిఓ 69 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కారుణ్య నియామక ప్రభుత్వ ఉద్యోగులకు తెలుగు, ఇంగ్లీషు టైపు పరీక్ష పాస్ కావాలనే నిబంధన నుంచి మినహాయింపునిస్తూ ప్రభుత్వం మంగళవారం జిఓ ఎంఎస్ నెంబరు 69ని విడుదల చేసింది. ప్రభుత్వ సర్వీస్ రూల్స్ ప్రకారం కారుణ్య నియామకాల కింద టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు తెలుగు, ఇంగ్లీషు టైప్ రైటింగ్ టెస్ట్ పాసైతేనే వారి సర్వీస్ రెగ్యులర్ చేసేవారు. ఆయా పరీక్షలు పాస్ కాలేక చాలా మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి రెగ్యులరైజ్ కాకపోవడంతో పిఆర్‌సి అమలుకాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరీక్షల నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులివ్వడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, జిఎడి కార్యదర్శి పోలా భాస్కర్‌కు ఎపి గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఎపి సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు కృతజ్ఞతలు తెలిపారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- అకృత్యాలను నిరసిస్తూ నిరసనలు
- మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్

అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింస, ఆకృత్యాలను ఖండిస్తూ ఐద్వా, ప్రజా, గిరిజన, దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పలు జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించలేని మోడీ, అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలని పలువురు కోరారు. అనంతపురంలోని బిసి బాలికల వసతిగృహంలో ఐద్వా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ సమాజం సిగ్గుపడేలా మణిపూర్‌లో దారుణాలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు, హింస పెరిగిపోతోందని, దీనిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు. నగరంలోని లలిత కళాపరిషత్ నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ చేపట్టి, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లా అమలాపురంలో గడియార స్తంభం సెంటర్‌లో, రాజోలు, కాట్రేనికోన, ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. కాకినాడలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కృతికాశుక్లాకు వినతిపత్రం అందించారు. అమలాపురంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు జరిగాయి. ఏలూరులోని ఎపి బేవరేజ్ కార్పొరేషన్ గొడౌన్ ఎదురుగా రాస్తారోకో చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో మావుళ్లమ్మ గుడి సెంటర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భీమవరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజుకు వినతిపత్రం అందజేశారు. కర్నూలు జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. నంద్యాల జిల్లా సున్నిపెంట బస్టాండ్‌లో ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. కడప, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా మునగపాక మెయిన్ రోడ్డులో నిరసన తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆందోళనలు చేపట్టారు. తిరుపతి సుందరయ్యనగర్‌లో ధర్నా జరిగింది. చిత్తూరులో జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన నిరసనలో రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వర్‌రావు పాల్గొన్నారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన ద్వారం నుండి జాషువా విగ్రహం వరకు ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఎన్‌ఆర్‌టి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన సాగింది.

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కారు అడ్డగింత

మాణిపూర్‌లో మారణకాండ, మహిళలపై అకృత్యాలను ఆపాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు కారును సిపిఎం నాయకులు దిగ్బంధించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ తదితరులు కలెక్టర్ కారును అడ్డుకుని నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చలా తయారవుతున్న ఈ హింసను ఆపేలా కేంద్రం ప్రభుత్వం, ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లేలా కలెక్టర్ రాతపూర్వకంగా లేఖ రాయాలని కోరారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- పోలీస్, ఎస్ఐ, కానిస్టేబుల్ ఫిజికల్‌ఈవెంట్స్ నిర్వహించాలి
- నిరుద్యోగుల ర్యాలీ, ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న నిరుద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పోలీస్ శాఖ నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వెంటనే ఫిజికల్ పరీక్షలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ఆందోళనబాట పట్టారు. దాదాపు ఆరు నెలలుగా ఎదురు చూస్తున్న అభ్యర్థులకు వెంటనే ఈవెంట్స్ నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, ఎన్‌సిఎస్, బాలాజీ మార్కెట్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు డివైఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం ప్రదర్శన నిర్వహించారు.

అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్ రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. లక్షల సంఖ్యలో పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం, కోట్లలో ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చెప్పడం తప్ప అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా పోస్టులు భర్తీ చేయలేదని తెలిపారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి ప్రకటించినా ఆ దిశగా చర్యలు లేవన్నారు. వెంటనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, పోలీస్, డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సతీష్, హర్ష, జగదీష్, సోమేష్, రమేష్ నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ అమ్మకం

- నష్టాల్లోంచి లాభాల్లోకి జెన్‌కో

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విద్యుత్ అమ్మకాల ద్వారా జెన్‌కో ఆదాయం గణనీయంగా పెరిగింది. జెన్‌కో మొత్తం ఆదాయం కూడా గతేడాది కన్నా పెరగడంతో నష్టాల్లోంచి ఆ సంస్థ లాభాల్లోకి చేరింది. తాజాగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ నివేదికను జెన్‌కో అధికారులు సిద్ధం చేశారు. దీని ప్రకారం ఆదాయ వ్యయాలు దాదాపుగా సమానంగా ఉన్నప్పటికీ స్వల్పంగా లాభాలు నమోదు అయ్యాయి. తాజా గణాంకాల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో జెన్‌కో మొత్తం ఆదాయం రూ. 12,968 కోట్లుగా నమోదైంది. అదే అంతకు ముందు 2021-22లో ఆదాయం రూ. 9,904 కోట్లుగా నమోదు కావడం గమనార్హం. అంటే ఒక్క ఏడాదిలో రూ. 3,065 కోట్లు ఆదాయం పెరిగింది. 2022-23 ఆదాయంలో విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.10,497 కోట్లు ఆదాయం సమకూరగా, ఇతర మార్గాల ద్వారా మిగిలిన మొత్తం సమకూరింది. ఇక ఖర్చుల విభాగంలో 2022-23లో రూ.12,795 కోట్లుగా తేలింది. గతేడాది ఈ వ్యయం 10,202 కోట్లు .

ఆదాయ, వ్యయాల వివరాలు (రూ. కోట్లలో)

ఆదాయం	2021-22	2022-23
అమ్మకం ద్వారా	9,691	10,497
ఆపరేటింగ్	---	2,245
ఇతర ఆదాయం	213	226
మొత్తం	9,904	12,968
వ్యయం	**2021-22**	**2022-23**
పరికరాల కాస్ట్	5,634	7,475
ఉద్యోగులపై	1,067	1,225
ఇతర వ్యయం	436	432
ఇంటరెస్ట్ ఛార్జ్‌డ్	2,553	3,156
డిప్రిసియేషన్	511	506
మొత్తం	**10,202**	**12,795**

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కెఆర్ సూర్యనారాయణ సస్పెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఆయన దర్యాప్తుకు సహకరించడం లేదనే కారణాన్ని చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సస్పెండ్ చేసింది. ఆయన ఇప్పటి వరకు కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనరు కార్యాలయంలో సూపరింటెండెంటుగా బాధ్యతలు నిర్వహించారు. క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యేంత వరకు సస్పెన్షన్ ఉత్తర్వులు కొనసాగుతాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు కమర్షియల్ ట్యాక్స్ కమిషనరు గిరిజాశంకర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. 2019 నుంచి 2021 మధ్య కెఆర్ సూర్యనారాయణతోపాటు సహ ఉద్యోగులు, మెహర్‌కుమార్, సంధ్య, వెంకట చలపతి, సత్యనారాయణ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా వ్యవరించారని ప్రభుత్వం వారిపై అభియోగం మోపింది. ఎపి జిఇఎ, ఎపి కమర్షియల్ ట్యాక్సెస్ సంఘాల అధ్యక్షులుగా ఉన్న సూర్యనారాయణ వ్యాపారుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ప్రభుత్వం అభియోగాల్లో పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ విచారణకు సహకరించకపోవడంతో ప్రజా ప్రయోజనాల రీత్యా ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపింది. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా విజయవాడను వీడి వెళ్లొద్దంటూ ఆ ఉత్తర్వుల్లో గిరిజాశంకర్ పేర్కొన్నారు. ముందస్తు బెయిల్ కోసం సూర్యనారాయణ జూన్ నెలలో విజయవాడ 12వ అదనపు జిల్లా కోర్టును ఆశ్రయించారు. అనుకూలంగా తీర్పు రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై అవినీతి నిరోధకశాఖ కోర్టులో గతవారం వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా సస్పెన్షన్ వేటు వేసింది.

టాటా మోటార్స్‌కు రూ.3,202 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.3,202.2 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఏకంగా రూ.5,006 కోట్ల నష్టాలు చవి చూసింది. కాగా.. గడిచిన మార్చితో ముగిసిన త్రైమాసికంలోని రూ.5,408 కోట్ల లాభాలతో పోల్చితే 40.7 శాతం తగ్గుదల చవి చూసింది. క్రితం క్యూ1లో టాటా మోటార్స్ రెవెన్యూ 42.6 శాతం పెరిగి రూ.1.01 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.71,227.76 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఈ ఏడాది మిగితా కాలంలోనూ మెరుగైన ప్రగతిని కనబర్చాలని నిర్దేశించుకున్నామని టాటా మోటార్స్ పేర్కొంది. వచ్చే పండగ సీజన్‌లో వాణిజ్య, ప్యాసింజర్ వాహన విభాగంలో కొత్త విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తేనున్నామని తెలిపింది.

బజాజ్ ఆటో లాభాల్లో 41 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో బజాజ్ ఆటో నికర లాభాలు 41.35 శాతం పెరిగి రూ.1,665 కోట్లుగా చోటు చేసుకున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,173 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.8,005 కోట్ల రెవెన్యూ నమోదు చేయగా.. గడిచిన క్యూ1లో 29 శాతం పెరుగుదలతో రూ.10,310 కోట్ల రెవెన్యూకు చేరింది. మంగళవారం బిఎస్‌ఇలో ఈ కంపెనీ షేర్ విలువ 0.82 శాతం తగ్గి రూ.4,843.25 వద్ద ముగిసింది.

ఎజిఐ గ్రీన్‌పాక్‌కు రూ.558 కోట్ల రెవెన్యూ..

ప్రముఖ ప్యాకేజింగ్ ఉత్పత్తుల సంస్థ ఎజిఐ గ్రీన్‌పాక్ 2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 7 శాతం వృద్ధితో రూ.558 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. పన్ను చెల్లింపులకు ముందు 55 శాతం వృద్ధితో రూ.85 కోట్ల లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది. గడిచిన త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను నమోదు చేశామని ఎజిఐ గ్రీన్‌పాక్ లిమిటెడ్ సిఎండి సందీప్ సోమాని పేర్కొన్నారు. కంపెనీ అమ్మకాలు, లాభదాయకత పెరిగిందన్నారు.

ఎల్అండ్‌టి స్పెషల్ డివిడెండ్...

ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థ ఎల్అండ్‌టి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను తమ వాటాదారులకు ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించింది. ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.6 చెల్లించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. 2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 46.4 శాతం వృద్ధితో రూ.2,493 కోట్ల లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,702 కోట్ల లాభాలు నమోదు చేసింది.

ట్విట్టర్‌ను సూపర్ యాప్‌గా రూపొందిస్తాం

- అందుకే ఎక్స్‌గా పేరు మార్చాం : ఎలన్ మస్క్

శాన్‌ఫ్రాన్సిస్కో : ట్విట్టర్‌ను భవిష్యత్తులో సూపర్ యాప్‌గా మార్చాలనే లక్ష్యంతోనే ఎక్స్‌గా పేరు మార్చామని ఆ సంస్థ అధినేత ఎలన్ మస్క్ వెల్లడించారు. ట్విట్టర్ పేరు మార్పునపై రెండు రోజుల తర్వాత ఆయన స్పందించారు. వచ్చేకొన్ని నెలల్లో ఎక్స్‌లో కీలక మార్పులు రానున్నాయన్నారు. వినియోగదారులు తమ ఆర్థిక లావాదేవీల కోసం ఇతర యాప్‌లను ఉపయోగించాల్సిన అవసరం లేకుండా చేస్తామన్నారు. ఎక్స్‌ను ఎవ్రీథింగ్ యాప్‌గా మార్చబోతున్నామన్నారు. ఇప్పటికే పలు ఫీచర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. "వాక్ స్వాతంత్ర్యానికి గుర్తుగా ట్విటర్‌ను మార్చాలని ఎక్స్ కార్పొరేషన్ దాన్ని కొనుగోలు చేసింది. అందులో భాగంగానే ట్విటర్ పేరును ఎక్స్‌గా మార్చాం. ట్వీట్‌కు 140 అక్షరాల పరిమితి ఉన్నప్పుడు ట్విటర్ అనే పేరు సరిపోతుంది. కానీ, ఇప్పుడు ఆ పేరు ఉండటంలో అర్థం లేదు. ఎందుకంటే ప్రస్తుతం ఎక్స్‌లో ట్వీట్‌లు మాత్రమే కాదు అధిక నిడివి వీడియోలు కూడా పంచుకోవచ్చు." అని ఎలన్ మస్క్ పేర్కొన్నారు.

ముచ్చుమర్రిలో నాటు బాంబుల కలకలం

- నీళ్ల ట్యాంకులో 22 లభ్యం

సంచిలో ఉన్న నాటు బాంబులు

ప్రజాశక్తి-పగిడ్యాల (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలో మంగళవారం నాటు బాంబులు లభ్యం కావడం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వైసిపి నేత బోయ మధు అలియాస్ అల్లరి మధు ఇంటిపై ఉన్న నీళ్ల ట్యాంకులో 22 నాటు బాంబులు ఉంచారు. వాటర్ ట్యాంక్‌లోని నీటితో పిల్లలు స్నానం చేస్తుంటే దురద వస్తుండడంతో మధు తన భార్య సూచన మేరకు ట్యాంక్‌ను శుభ్రం చేయాలనుకున్నారు. ట్యాంకులో ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేసేందుకు వెళ్లగా ట్యాంక్‌లో సంచి కనిపించింది. దానిని బయటకు తీసి చూడగా బాంబులు ఉన్నట్లు మధు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. నందికొట్కూరు ఇన్‌ఛార్జ్ సిఐ విజయ్ భాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున ఘటనా స్థలాన్ని పరిశీలించి బాంబులను స్వాధీనం చేసుకున్నారు. మధును స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు. మధు ఇంటిపై ఉన్న నీళ్ల ట్యాంకులోకి బాంబులు ఎలా వచ్చాయనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మధు వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అనుచరుడు కావడం విశేషం.

కల్పిత కథలతో సిబిఐ చార్జిషీట్

- పరామర్శకు వెళ్తే తప్పా..? : సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ వాస్తవాలను వదిలేసి కల్పిత కథలతో చెత్త చార్జిషీట్ వేసిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కుటుంబ సభ్యులు కనుకే పరామర్శకు ఇంటికి వెళ్లామని, అలాగే ఫోన్ సంభాషణలు సహజంగా వుంటాయని, సిబిఐ చార్జిషీట్‌లో ఇలాంటి అంశాలను పొందుపర్చడం ఏమిటని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిబిఐ వేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌లో వాస్తవాలను మరుగున పరిచి టిడిపి ప్రచారానికి పనికొచ్చే అంశాల చుట్టూ సాగిందని అన్నారు. విచారణలో సిబిఐ బేసిక్ లాజిక్‌ను మర్చిపోయిందన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు వైరస్‌లా పాకారని, వివేకా హత్యను కూడా అడుగడుగునా తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. వివేకా హత్య వల్ల జగన్‌మోహన్‌రెడ్డికి, వైసిపికి నష్టం అని అంశాన్ని చిన్న పిల్లాడిని అడిగినా చెప్తారని అన్నారు. జగన్ మనోధైర్యం దెబ్బతినేలా ఎన్నికలకు నెలముందు ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకానందరెడ్డి హత్యపై టిడిపి ప్రభుత్వంలో తమ ప్రభుత్వంలో రెండు సిట్‌లు విచారణ చేశాయని, ఈ సిట్ విచారణ అంశాలను సిబిఐ పక్కన పెట్టి కేవలం ఎవరిని ఈ కేసులో బుక్ చేయాలో ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యంతోనే విచారణ జరుపుతోందని అన్నారు. సిట్ ఇచ్చిన ఆధారాలను సిబిఐ ఏమి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. గూగుల్ టేకవుట్ అనేది నిలబడదని ఇప్పుడు కొత్త అంశాలను తెరపైకి తెస్తోందన్నారు. సునీత ఇప్పటి వరకూ ఆరేడు స్టేట్‌మెంట్స్ ఇచ్చారని, ఇందులో కొన్ని అంశాలను తీసుకుని తమపై విషం చిమ్ముతున్నారని అన్నారు. వివేకానందరెడ్డి వ్యక్తిత్వం దెబ్బతినకూడదని తాము మౌనంగా భరిస్తూ వస్తున్నామని తెలిపారు. ఏ కుటుంబంలోనైనా సమస్య వస్తే పరామర్శించడం సహజ న్యాయమని, అందులో భాగంగానే తన భార్యతో కలిసి పరామర్శకు వెళ్లాను తప్ప వైఎస్ భారతితో ఎన్నడూ వెళ్లలేదని అన్నారు. ఈ విషయంలో సునీత చెప్పినవన్నీ అబద్ధాలేనని ఖండించారు. అవినాష్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడాలని తానెప్పుడూ చెప్పలేదని అన్నారు. సునీతను ప్రెస్‌మీట్ పెట్టాలని కూడా చెప్పలేదన్నారు.

ఎనిగ్మా నుంచి ఏంబియర్ ఎన్8

నోయిడా : విద్యుత్ వాహన తయారీ అంకురసంస్థ అయిన ఎనిగ్మా ఆటోమొబైల్స్ కొత్తగా ఏంబియర్ ఎన్8 ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇది ఒకే ఒక్క ఛార్జ్ పైన 200 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుందని పేర్కొంది. 2-4 గంటల్లో వేగంగా ఛార్జింగ్ అవుతుందని తెలిపింది. గంటకు 50 కిలోమీటర్ల వేగంగా ప్రయాణించగలదని వెల్లడించింది. దీని ఎక్స్‌షోరూం ధరను రు.1,05,000 నుండి రు.1,10,000గా నిర్ణయించినట్లు తెలిపింది. ప్రయాణికులు, సరుకు రవాణకు ఉపయోగపడుతుందని పేర్కొంది.

సిఎఐటితో మెటా భాగస్వామ్యం

ముంబయి : కోటి మంది చిన్న వ్యాపారులకు మద్దతును అందించడానికి కాన్ఫిడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సిఎఐటి)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మెటా ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా 17 నగరాలకు చెందిన చిన్న వ్యాపారాలకు డిజిటలైజేషన్‌లో సాధికారిత కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఇందుకోసం మెటా తమ వాట్సాప్ బిజినెస్ యాప్‌లో 'వాట్సప్ సే వ్యాపార్' కార్యక్రమయం ద్వారా స్థానిక వ్యాపారులకు డిజిటల్‌గా శిక్షణ ఇచ్చేందుకు, నైపుణ్యాభివృద్ధి మద్దతును అందించనున్నట్లు పేర్కొంది. చిన్న వ్యాపారాలు తమ వినియోగదారులతో సమర్థవంతంగా అనుసంధానం అయ్యేందుకు ఇది దోహదం చేయనుందని మెటా గ్లోబల్ అఫైర్స్ ప్రెసిడెంట్ నిక్ క్లెగ్ పేర్కొన్నారు.

భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ
(రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వశాఖ - భారత ప్రభుత్వం)
ప్లాట్ నెం.74, వనమాలి బిల్డింగ్, ఎన్. ఎ. సి. కళ్యాణ వేదిక పక్కన, కమర్షియల్ టాక్సెస్ కాలనీ, గురునానక్ నగర్ కాలనీ, విజయవాడ -520 008
ఫోన్: 0866-2543496, ఇ - మెయిల్ : vij@nhai.org

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా, రోడ్డు, రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారిచే భారత రాజపత్రం విశేష రాజపత్రం ఇష్యూ నెం.6 పార్టు -II , సెక్షన్-3 సబ్-సెక్షన్-(ii), తేది. 01 మార్చి 2023 నందు ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ నెం. S.O. 950(E) ననుసరించి, NH-216 (పాత NH-214A) యొక్క మచిలీపట్నం నుండి అవనిగడ్డ వరకు కి.మీ. 82.300 - కి.మీ. 117.60 వరకు నున్న సెక్షన్ కొరకు కొత్త మోపిదేవి ఫీజు ప్లాజా 01.08.2023 (08.00:00 గంటలు) నుంచి ప్రారంభించబడుతుంది. మరియు సదరు సెక్షన్ కొరకు నిర్దేశించిన యూజర్ ఫీజు రేట్లు 01.08.2023 (08.00:00 గంటలు) నుంచి 31 మార్చి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని మోపిదేవి ఫీజు ప్లాజా (చైనేజ్ : 116.332, మోపిదేవి గ్రామం దగ్గర, కృష్ణా జిల్లా) వద్ద వర్తిస్తాయని గమనించగలరు.

వాహన శ్రేణి	ఒక వైపు ప్రయాణానికి రుసుం (రూ)	ఒకే రోజులో తిరుగు ప్రయాణానికి రుసుం (రూ)	నెలలో 50సార్లు ఒకవైపు ప్రయాణానికి నెలవారీ పాస్‌రుసుం (రూ)	ప్లాజా జిల్లాలో నమోదైన వాణిజ్య వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి రుసుం (రూ)
కారు, జీపు, వ్యాన్ లేదా తేలికైన మోటారు వాహనము	35	55	1245	20
తేలికైన వ్యాపార వాహనము, తేలికైన సరుకుల వాహనము లేదా చిన్న బస్సు	60	90	2010	30
బస్సు లేదా ట్రక్కు (రెండు యాక్సిల్స్)	125	190	4210	65
మూడు- యాక్సిల్ వ్యాపార వాహనములు	140	205	4590	70
భారీ నిర్మాణ మెషినరీ (HCM) లేదా ఎర్త్ మూవింగ్ సామాగ్రి (EMC) లేదా బహుళ యాక్సిల్ వాహనము (MAV) (నాలుగు నుండి ఆరు యాక్సిల్)	200	295	6600	100
భారీ సైజులోని వాహనాలు (ఏడు లేక ఇంకా ఎక్కువ యాక్సిల్)	240	360	8035	120

2023-24 ఆర్థిక సంవత్సరమునకు స్థానిక వాణిజ్యేతర వాహనములకు నెలసరి పాస్ రేటు రూ.330.00 వంతున వర్తించును.

క్రింద టోల్ ప్లాజా(లు) కొరకు నిర్దేశించిన నికర రోడ్డు పొడవుకు దిగువ టోల్ ప్లాజాల వద్ద బకాయి ఉన్న, చెల్లించదగిన రుసుం దిగువ విధంగా విధించబడి, వసూలు చేయబడును.

టోల్ ప్లాజా ప్రదేశం (కి.మీ)	దిగువ పొడవుకు చెల్లించవలసిన రుసుం (కి.మీ.లు)
కి.మీ. 116.332 (మోపిదేవి గ్రామం దగ్గర, కృష్ణా జిల్లా)	34.760 కి.మీ. లు

జాతీయ రహదారి విభాగంలో (పలు ప్రయాణాలు) అనేక సార్లు ప్రయాణించుటకు ఈ క్రింది రేట్లలో పాసులు జారీ చేయబడతాయి.

చెల్లించవలసిన మొత్తం	ఒకవైపు ప్రయాణాలకు అనుమతించు గరిష్ట సంఖ్య	చెల్లుబాటు కాలం
ఒక వైపు ప్రయాణానికి ఫీజు ఒకటిన్నర రెట్లు	రెండు	చెల్లింపు చేసిన సమయం నుంచి ఇరవై నాలుగు గంటలు
యాభై లేదా అంతకంటే ఎక్కువ ఒక వైపు ప్రయాణాలకు చెల్లించవలసిన రుసుములో 2/3 వంతు	యాభై	చెల్లింపు చేసిన తేది నుంచి ఒక నెల

వాటి తరగతి కొరకు పేర్కొనబడిన అనుమతించిన లోడ్ కంటే అధికంగా లోడ్ చేయబడిన మెకానికల్ వాహనములు, సదరు రూల్స్ యొక్క రూల్ 10 యొక్క సబ్ రూల్ 1ఎ లో పేర్కొనబడిన ఫీజుకు సమానమైన దానిని, ఫీజు కలెక్టింగ్ ఏజెన్సీకి జాతీయ రహదారి పై ఓవర్ లోడ్ అయిన వాహనము ప్రవేశము కొరకు ఫీజును చెల్లించవలసి ఉంటుంది, మరియు అట్టి మెకానికల్ వాహనము నుండి అధిక లోడ్ ను తొలగించితే తప్ప హైవే సెక్షన్ ఉపయోగించుటకు హక్కు ఉండదు.

సం/- జనరల్ మేనేజర్ (Tech.) & ప్రాజెక్టు డైరెక్టర్,
NHAI, PIU - విజయవాడ

సంపాదకీయం

చర్చకు అడ్డంకులొద్దు

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు... అన్నట్టు కేంద్ర ప్రభుత్వ తీరు ఉంది. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేలా చూడాల్సిన కేంద్రప్రభుత్వమే సమావేశాలకు అడ్డంపడటం ఆందోళనకరం. మోడీ ప్రభుత్వం రెండోసారి ఎన్నికైన 2019 నుంచి పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిష్టంభన ఓ సాధారణ అంశంగా మారిపోయింది. ప్రభుత్వం దృష్టికి ప్రజా సమస్యలను తీసుకొచ్చి వాటి పరిష్కారానికి ప్రయత్నించే ప్రతిపక్షాలను నిలువరించేందుకు అధికారపక్షం ఎత్తులు.. జిత్తులు సాధారణమయ్యాయి. 2021 వర్షాకాల సమావేశాల్లో పెగాసస్ స్పైవేర్‌పై చర్చకు మొండిగా తిరస్కరించి పార్లమెంటు ప్రతిష్టంభనకు కారణమైంది. ఈ ఏడాది మార్చిలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా అదానీ కుంభకోణాలకు సంబంధించి ఇచ్చిన హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చ విషయంలోనూ ఇదే పరిస్థితి. దేశ సంపద కార్పొరేట్ దిగ్గజానికి కట్టబెట్టిన క్రోనీ క్యాపిటలిజంపై దేశవ్యాప్తంగా చర్చ జరిగినా పార్లమెంట్‌లో ప్రధాని సమాధానం చెప్పలేదు.

తాజాగా మణిపూర్ మంటల్లో దేశం పరువు మంటగలుస్తున్నా ప్రధాని మొసలి కన్నీరు కార్చడానికి 79 రోజులు పట్టింది. మే 3న అల్లర్లు చెలరేగిన కొద్ది సేపటికే కాంగ్‌పోక్సి గ్రామంలో ఇద్దరు కుకీ గిరిజన మహిళలను వివస్త్రలను చేశారు. వారిలో ఒకరు కార్గిల్ యుద్ధ వీరుడి భార్య. రెండున్నర నెలల తరువాత వెలుగుచూసిన ఈ వీడియోతో దేశం నివ్వెరపోయింది. నిరసనలతో హోరెత్తింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పని తాము చేయకపోతే తామే రంగంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించిన తరువాత ప్రధాని పార్లమెంట్ బయట స్పందించారు. మణిపూర్ మత విద్వేష హింసాకాండపై తాజాగా వెలుగుచూస్తున్న కథనాలు మరింత హృదయవిదారకంగా ఉన్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను ఇంటిలో బంధించి సజీవ దహనం చేసిన కాషాయ గూండాల కర్కశాన్ని చెప్పడానికి మాటలు చాలవు.

విద్వేషాలను విత్తడం, విభజించడం, పండించడం, అధికారాన్ని కాపాడుకోవడమే కాకుండా కార్పొరేట్ గుత్తాధిపత్యంతో ఒప్పందాలు కుదుర్చుకోవడం అన్న మోడీ - అమిత్ షా, సంఘ్ పరివార్ వ్యూహంలో భాగంగానే ఈ మారణకాండ సాగింది. ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాల పర్యటనల్లో ఈ అంశంపై నిరసనలు చెలరేగినా మోడీ నోట మాట పెగలలేదు. అన్నదమ్ముల్లా కలసిమెలసి బతికిన కుకీలు, మెయితీలు బద్ధ శత్రువులయ్యారు. మెయితీ మహిళలుసైతం కుకీ యువతులను కాషాయ గూండాలకు అప్పగించారని వస్తున్న కథనాలు వారి మెదళ్లలో సంఘ్ వాట్సాప్ అబద్ధాల ఫ్యాక్టరీ రగిల్చిన విద్వేషాన్ని చాటిచెబుతున్నాయి. కుకీల హింసాకాండను నియంత్రించకపోగా, పెంచి పోషించిన సిఎం బీరేన్‌సింగ్‌ను కొనసాగించి మోడీ సర్కారు ఏమి సందేశం ఇస్తోంది? చదువు, ఉపాధి వెతుక్కుంటూ లోయలకు వెళ్లిన కుకీలను అటవీ ప్రాంతానికి తరిమికొట్టారు. వ్యాపారం, పనుల కోసం అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న మెయితీలు పారిపోయారు. కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో జరుగుతున్న ఈ మారణహోమం దేశ ప్రజలందరినీ కలచివేస్తోంది. అందుకే మూలమూలనా నిరసన కార్యక్రమాలు వెల్లువలా సాగుతున్నాయి.

మణిపూర్ దురాగతాలపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా అడ్డుకునేందుకు మోడీ సర్కారు నానా ఎత్తులు వేస్తోంది. పార్లమెంట్‌లో ఇతర కార్యక్రమాలన్నింటినీ నిలిపివేసి రూల్ 267 కింద మణిపూర్ మారణహోమంపై పూర్తిస్థాయిలో చర్చించాలని, పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు భిన్నంగా రూల్ 176 కింద రెండు లేదా రెండున్నర గంటల్లో చర్చ ముగించి, డబుల్ ఇంజిన్ సర్కార్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రం యత్నించడం దుర్మార్గం. దేశ అత్యున్నత చట్టసభలో ఇంతటి కీలకమైన అంశంపై చర్చను నిరోధించడం, దాటవేయడం ప్రభుత్వ నిరంకుశ పోకడలకు నిదర్శనం. ప్రతిపక్షాలు సమన్వయంతో పార్లమెంటులో సాగిస్తున్న ఐక్య ప్రతిఘటన మరింత శక్తివంతంగా ముందుకెళ్లాలి. మోడీ సర్కారు మెడలు వంచి, మణిపూర్‌పై చర్చ జరపాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలి.

మంచి మాట

శ్రమ చేసేవారు, శ్రమ దోపిడీకి గురయ్యేవారు ఎప్పటికీ పేదలుగానే వుంటారు. స్వేచ్ఛా మార్కెట్‌లో కార్మికులు ఎప్పటికీ స్వేచ్ఛను పొందలేరు.

- ఫ్రెడరిక్ ఏంగెల్స్

ఏకరూప పౌర స్మృతి ఒక వితండ వాదం

విమర్శ

గుమ్మడిదల రంగారావు

ఇప్పుడు దేశంలో ఏకరూప పౌర స్మృతి గురించి చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ చర్చ కొన్ని వర్గాలకే పరిమితమైంది గాని సామాన్య ప్రజలు దీన్ని గురించి పెద్దగా పట్టించుకోవటం లేదు. వాస్తవానికి సామాన్య ప్రజలకు ఇది ఒక పెద్ద విషయమే కాదు. కొంతమంది ఎంతో ఆసక్తిగా చర్చించుకుంటున్న విషయం సామాన్య ప్రజానీకానికి పెద్ద విషమేమీ కాకపోవటానికి కారణం ప్రజల అవసరాలకు, పాలకుల అభిరుచులకు మధ్య వున్న వ్యత్యాసమే. ఏమిటీ ఆ వ్యత్యాసం? ప్రజలు కోరుకుంటున్నది రోటీ, కపడా, మకాన్. అంటే కడుపు నిండా తిండి, వంటి నిండా బట్ట, తల దాచుకోటానికి నీడ. కానీ ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్నది అయోధ్యలో రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు, ఏకరూప పౌర స్మృతి.

ప్రజలు కోరుకుంటున్నది మెరుగైన ఉపాధి అవకాశాలు, మెరుగైన విద్య, వైద్య సదుపాయం, తాగునీరు, సాగు నీరు, స్థిరమైన విద్యుత్తు, అందుబాటులో వుండే నిత్యావసర వస్తువుల ధరలు. కానీ సంఘ్ పరివార్ ప్రాధాన్యం మాత్రం హిందీ, హిందూ, హిందుత్వ. ఇది ఈనాటిది కాదు. భారతీయులు ఒక జాతిగా మనుగడ సాగించటానికి ప్రధానమైన ఆధారం భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతం. ఈ సిద్ధాంతానికి బద్ధ విరోధులు పరివారీయులు. భిన్నత్వం అసలు వద్దే వద్దు. ఏకత్వం కన్నా ఏకీకరణే ముద్దు. అంటే యూనిటీ కన్నా యూనిఫార్మిటీ ముద్దు. వివిధ వర్గాలవారు ఐకమత్యంగా వుండటం కన్నా ఒకేవిధంగా ఉండటం వీరికి ప్రధానం. అలా అయితేనే దేశం బలంగా ఉంటుందనేది వారి వాదన. ఒకే విధం అంటే మెజారిటీ ప్రజలు ఎలా ఉంటే మిగతా వారు కూడా అలాగే ఉండటం అన్నమాట. ఈ భావజాలంలో భిన్నత్వానికి తావెక్కడిది? అందరూ ఒకే సైజు చెప్పులు వేసుకుంటే బాగా నడుస్తారనటం లాంటిదే ఇది గూడా! అందుకే ఇది వితండ వాదం. ఈ ఏకీకరణ వాదం ఒక ఉన్మాద భావజాలం లోనుంచి పుట్టింది. వైవిధ్యాలను సహించదు. ఒకే విధానం కావాలి దేశమంతటా అంటుంది. ఒక దేశం ఒక ఎన్నిక, ఒక దేశం ఒక పన్ను, ఒక దేశం ఒక పౌర స్మృతి. తదుపరి ఒక దేశం ఒక భాష అనే నినాదాలు ఈ ఏకీకరణలో భాగమే. ఆ పైన ఒక దేశం ఒక వాతావరణం అన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రస్తుతానికి ఒక దేశం ఒక ఎన్నిక అనేది కుదరలేదు. అది కుదిరేదికాదు మన రాజ్యాంగ వ్యవస్థలో అని చెప్పలేదు కేంద్ర ఎన్నికల సంఘం. పార్లమెంటుకు శాసన సభలకూ ఒకేసారి ఎన్నికలకు మేము సిద్ధమే అని చెప్పింది! కానీ అది రాజ్యాంగపరంగా కుదిరేది కాదని తెలుసుకొని ప్రస్తుతానికి వెనకడుగు వేశారు పాలకులు.



అయితే 21వ లా కమిషన్ మాత్రం ఏకరూప పౌర స్మృతి పస్తుత పరిస్థితులలో అవసరం లేదు, అభిలషణీయం కూడా కాదని తేల్చిచెప్పింది 2018లో. అది కూడా ఎంతోమంది అభిప్రాయాలు తీసుకొని, ఎంతోమంది భాగస్వాములతో చర్చలు జరిపిన తరువాత చేసింది ఆ సిఫార్సు. అయితే, అది పాలకులకు రుచించలేదు కనుక బుట్ట దాఖలు చేసి, పార్లమెంటుకు ఎన్నికలు కేవలం సంవత్సరం లోపు ఉండగా మళ్ళీ ఈ అంశాన్ని తెర మీదకు తీసుకువచ్చారు. ఏకరూప పౌరస్మృతి మీద దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సందర్భంలో పార్లమెంటు ఆలోచించవలసిన అంశం ఒకటి వున్నది. ఇది చాలా చాలా కీలకమైన అంశం. ఈ అంశం ప్రాధాన్యతను మనం పెద్దగా గుర్తించినట్లు అనిపించడంలేదు. అదేంటంటే సామాజిక పరివర్తన చట్టం ద్వారా వస్తుందా అన్న ప్రశ్న.

ఏకరూప పౌర స్మృతి గూడా సామాజిక పరివర్తన కోసం ఉద్దేశించబడినదే గదా! మనిషి అంతరంగాన్ని మార్చటం అనేది ఇక్కడ ప్రధానమైన అంశం గదా. సమాజం తీరు తెన్నులు మారడం అంటే మనిషి ఆలోచనా విధానంలో మార్పు రావటమేకదా ? మనిషి వేరు సమాజం వేరు కాదు కదా. మరి ఈ మార్పు కేవలం చట్టం ద్వారానే సాధ్యమవుతుందా? ఈ ప్రశ్నకి అవును అని సమాధానం చెబితే అది అవివేకమూ, అమాయకత్వమూ అవుతుంది. దీన్ని కాస్త లోతుగా పరిశీలిస్తే విషయం అర్థమౌతుంది. ఇప్పటి వరకు ఏ దేశంలోనూ చట్టం ద్వారా సామాజిక మార్పు రాలేదు. మనలాంటి దేశాల్లో అది ఇంకా మరీ కష్టం. సంప్రదాయం అనేది మనిషి అంతరంగంలో తరతరాలుగా జీర్ణించుకొని పోయి వుంటుంది. అటువంటి పరిస్థితిలో హడావుడిగా చట్టం చేసి రేపటి నుంచి మనుషులు ఈ విధంగా ఆలోచించాలి, ఈ విధంగా వ్యవహరించాలి అని ఆదేశించటం సాధ్యమా?

మారుతున్న కాలానికి అనుగుణంగా మనిషిలోనూ సమాజ ధోరణిలోనూ మార్పు రావాలి. అందులో ఎలాంటి సందేహం లేదు. మనిషిని ఒప్పించి తీసుకువచ్చే మార్పు నిలబడుతుంది. మనిషిని నొప్పించి తీసుకువచ్చే మార్పు నిలవదు. ఒక పద్ధతిలో నుంచి మరో పద్ధతిలోకి మారటం అంటే రైలు బండి పట్టాలు మారినంత యాంత్రికంగా జరగదు. మనిషి మార్పు అవసరాన్ని అర్థం చేసుకోవాలి, ఆ మార్పుని అంతర్లీనం చేసుకోవాలి. ఇది చాలా సమయం పట్టే ప్రక్రియ. ఇది జరగటానికి ముందు అనేక సంస్థలు, వ్యవస్థలు, వ్యక్తులు, శక్తులు బహుళ వ్యూహంతో మనిషి ఆలోచన మార్చాలి. మనిషిని ఒప్పించటానికి ఓపికతో వ్యూహాన్ని అమలు చెయ్యాలి. ఈ వ్యూహాన్ని ఎవరు అమలు చెయ్యాలి? మార్పును కోరేవారు అమలు చెయ్యాలి. ఎప్పుడైనా మార్పును కోరేవారు మొదట్లో కొద్దిమందే వుంటారు. ఆ కొద్దీ మంది సమాజాన్ని ప్రభావితం చేసేవారై ఉండాలి. సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి కవులకు, కళాకారులకు, మేధావులకు, విద్యావంతులకు, సంఘసంస్కర్తలకు, మీడియాకు ఉంటుంది. వీరందరూ కలసి మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే ప్రయత్నం చెయ్యాలి. ఇది ఒక రోజులోనో ఒక సంవత్సరంలోనే అయ్యేది కాదు. మనం కోరుకున్న మార్పు సాకారం అవ్వటానికి సహనం, సంయమనం చాలా అవసరం.

భారతీయులు ఒక జాతిగా మనుగడ సాగించటానికి ప్రధానమైన ఆధారం భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతం. దీనికి బద్ధ విరోధులు పరివారీయులు. భిన్నత్వం అసలు వద్దే వద్దు. ఏకత్వం కన్నా ఏకీకరణే ముద్దు. అంటే యూనిటీ కన్నా యూనిఫార్మిటీ ముద్దు. వివిధ వర్గాలవారు ఐకమత్యంగా వుండటం కన్నా ఒకేవిధంగా ఉండటం వీరికి ప్రధానం. అలా అయితేనే దేశం బలంగా ఉంటుందనేది వారి వాదన. ఒకే విధం అంటే మెజారిటీ ప్రజలు ఎలా ఉంటే మిగతా వారు కూడా అలాగే ఉండటం అన్నమాట. ఈ భావజాలంలో భిన్నత్వానికి తావెక్కడిది? అందరూ ఒకే సైజు చెప్పులు వేసుకుంటే బాగా నడుస్తారనటం లాంటిదే ఇది గూడా! అందుకే ఇది వితండ వాదం.

ఎప్పుడైతే మార్పు కోరేవారు మార్పుకు అనువైన వాతావరణం సృష్టిస్తారో అప్పుడే మనిషి ఆ మార్పు అవసరాన్ని అంతర్లీనం చేసుకుంటాడు. మార్పును అంగీకరించటానికి సిద్ధమవుతాడు. తన నడవడిని మార్చుకోవటానికి సుముఖంగా ఉంటాడు. అది చట్టం చెయ్యటానికి సరైన సమయం. అంతేగానీ సమాజాన్ని మార్పుకి సిద్ధం చెయ్యకుండా చట్టం చేసి చేతులు దులుపుకుంటే వచ్చేదేమీ ఉండదు.

ప్రస్తుత సందర్భంలో కూడా ప్రజలు కోరుకుంటున్నది ఒకటి, పాలకులు ఇవ్వాలనుకుంటున్నది వేరొకటి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలుగానీ పార్లమెంటుగానీ ప్రజల అభీష్టం మేరకే వ్యవహరించాలిగానీ అందుకు భిన్నంగా వెళ్ళరాదు. ఒకవేళ ప్రభుత్వం ప్రజల అభీష్టానికి విరుద్ధంగా నడుస్తుంటే అది తప్పు అని చెప్పాల్సిన గురుతర బాధ్యత మీడియా మీద వున్నది. కానీ ప్రధాన మీడియా ఆ బాధ్యతను విస్మరిస్తున్నట్లు కనిపిస్తుంది. పార్లమెంటు చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటం పట్ల ఆ మీడియా వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం. ఏకరూప పౌర స్మృతి సందర్భంగా పాలకులు వ్యవసాయ చట్టాల విషయంలో ఎదురైన అనుభవాన్ని విస్మరించటం విచారకరం. ఏ రైతుల శ్రేయస్సు కోసం సాగు చట్టాలు చేశామని చెప్పారో ఆ రైతుల విశ్వాసం పొందలేకపోయారు. దానికి అవసరమైన కసరత్తు చెయ్యలేదు. వ్యవసాయ చట్టాల మీద సరైన చర్చ జరగలేదు. రైతు సంఘాలతో సంప్రదింపులు జరగలేదు. జీవితాన్ని ప్రభావితంచేసే చట్టాలు చేసేటప్పుడు సంబంధిత వర్గాలలో అవగాహన కల్పించవలసిన బాధ్యత పాలకుల మీద ఉంటుంది. సాగు చట్టాల విషయంలో అది జరగలేదు. రైతులకు వ్యవసాయం వృత్తి కాదు. అది వారికి జీవితం. ఆ జీవితాన్ని చట్టం ద్వారా ఇబ్బందుల పాలుచేస్తున్నారు అనుకొన్న రైతుల మనోభావాలను అర్థం చేసుకోలేకపోయారు నాయకులు. ఇప్పుడు ఏకరూప పౌర స్మృతి విషయంలోనూ అదే జరుగుతోంది.

ప్రజల విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలతో ముడిపడి వున్న అంశాల మీద చట్టం చెయ్యటం సులువు కాదు. దానికి ముందుగా ప్రజలను సమాయత్తం చెయ్యాలి. మార్పు పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించాలి. విస్తృతమైన చర్చ జరగాలి. వివాహం, విడాకులు, సంతానం, దత్తత, వారసత్వం అనేవి ఉద్వేగంతో కూడుకున్న వ్యక్తిగత అంశాలు. ఇటువంటి సున్నితమైన అంశాల మీద చట్టం చేసే ముందు చాలా కసరత్తు చెయ్యాల్సి ఉంటుంది. ఆయా వర్గాల వారితో విస్తృత సంప్రదింపులు జరపాలి. వారి విశ్వాసాన్ని పొందాలి. పౌర స్మృతి ఆచారాలు, సంప్రదాయాలతో కూడుకున్నది. ప్రజలకు ఏదో చేసినట్లు చూపించాలి. అది అనుత్పాదక అంశాలయితే ప్రజలు బేరీజు వేసుకోలేరు. వారికి ఏ మాత్రం ప్రయోజనం అనేది. అందుకనే వివాదాస్పదమైన విషయాలను తెర మీదకు తీసుకువస్తే ప్రజల దృష్టి మరల్చడం శులభం. దీనివలన ఎన్నికల్లో గెలిచినా చరిత్రహీనులుగా నిలిచిపోయే ప్రమాదం వున్నది. అన్నివేళలా చరిత్రను తిరగరాయలేము అన్న విషయం కూడా తెలుసుకోవాలి. కానీ నేటి పాలకులు చరిత్ర గతిని మార్చాలనుకుంటున్నారు. కానీ ఈ కోరిక నెరవేరేది కాదని తెలుసుకోవాలి. ప్రపంచంలో ఏ దేశంలోనూ చరిత్రను తిరగ రాయటం కుదరలేదు. అలాంటి ప్రయత్నం వల్ల భావితరాల వారికి చాలా అన్యాయం చేసిన వాళ్ళం అవుతాం. సత్యాన్ని తెలుసుకునే హక్కు అందరికీ వుంది. మరో విషయమేమిటంటే మన రాజ్యాంగం లోని ఆదేశిక సూత్రాల్లో ఆర్టికల్ 44 ప్రకారం ఏకరూప పౌర స్మృతి కోసం రాజ్యం కృషి చెయ్యాలని ఆదేశించిన మాట వాస్తవం. అదే ఆదేశిక సూత్రాలు ప్రజా సంక్షేమానికి సంబంధించి పలు అంశాలను నెరవేర్చాలని గూడా ఆదేశించిన సంగతి మరచి పోరాదు. ప్రజాసంక్షేమాన్ని నెరవేర్చే అంశాలను అమలు చేయాలంటే ఆర్థిక వనరులు కావాలి. ఏకరూప పౌర స్మృతికి నిధులేమీ అవసరం లేదు, ఇది అనుత్పాదక అంశం కాబట్టి. మతపరమైన అంశాలమీద, ఆచారాలు సంప్రదాయాలమీద చట్టం చేసేటప్పుడు అనుసరించవలసిన జాగ్రత్తలు ఏవీ పాటించటం లేదు. ఇది ప్రజల్లో అసంతృప్తిని, అపోహలను సృష్టించగలదు. అందువలన పట్టుదలకు పోకుండా సంయమనం పాటించి ప్రజలకు తగు సమయమిచ్చి లోతుగా చర్చించిన తరువాతే ముందుకు వెళ్తే ఉపయుక్తంగా ఉంటుంది. ఈ విషయాన్ని మీడియా సంస్థలు కూడా విడమర్చి విశదీకరించి చెప్పవలసిన గురుతర బాధ్యతను విస్మరించరాదు.

(వ్యాసకర్త లోక్‌సభ సచివాలయంలో మాజీ డైరెక్టర్)

పంచాయతీ వ్యవస్థ - గ్రామ వాలంటీర్లు

విశ్లేషణ

వి. రాంభూపాల్

గ్రామ స్థాయి నుండే పజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకే రాజ్యాంగంలోని నలభయ్యవ అధికరణంలో స్థానిక స్వపరిపాలన ప్రాముఖ్యతను గురించి పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో పంచాయతీ వ్యవస్థను పాలకులు నిర్వీర్యం చేస్తూ వచ్చారు. వాటికి నిధులు, విధులు కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ పంచాయతీలను మరింత బలహీనం చేసింది. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ సకాలంలో పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కొంత తోడ్పడింది. అయితే ఎన్నికైన గ్రామ ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించివేసింది. మరోవైపు పంచాయతీలకు రావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్ళించుకుంటుంది. అందువల్ల పంచాయతీలు తమ కనీస విధులను నిర్వహించలేకపోతున్నాయి. కీలకమైన విషయాన్ని వదిలేసి సమస్యలన్నింటికీ వాలంటీర్లు మూలమైనట్లు, మహిళల అదృశ్యానికి వీరే కారణమైనట్లు జనసేన నేత మాట్లాడడం, వాలంటీర్లు వైసిపి ఏజెంట్లు అంటూ ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయబోమని చెప్పడం ద్వారా ఇప్పుడున్న వారిని తొలగించి తమ వారిని నియమించుకుంటామనే అర్థంలో మాట్లాడుతున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య మనుగడలో పంచాయతీ వ్యవస్థ స్ఫూర్తి, దాని పురోగతి అత్యంత కీలకమనే విషయాన్ని పాలక పార్టీలు ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నాయి.

పంచాయతీ వ్యవస్థ ఆవిర్భావం

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, జిల్లా బోర్డులు అనే మూడంచల పాలన వ్యవస్థ ఏర్పడింది. గ్రామ పరిపాలన ప్రాధాన్యత గురించి మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే కమ్యూనిస్టులు లేవనెత్తారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ఏర్పడిన గ్రామస్వరాజ్య విధానం పాలకులు గ్రామ పరిపాలన అమలు చేసేటట్లు ఒత్తిడి చేసాయి. బల్వంతరాయ్ మెహతా ఆధ్వర్యాన పంచాయతీరాజ్ వ్యవస్థ పరిశీలన కోసం కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ సిఫార్సులతో 1959లో పంచాయతీ వ్యవస్థ ఏర్పడింది. దేశంలో మొట్టమొదటిసారి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అలాంటి పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. తెలుగు ప్రజలు గతంలో కొంత భాగం మద్రాసు రాష్ట్రంలో, మరికొంత నిజాం ప్రభుత్వంలో వుండడం వల్ల ఈ రెండు ప్రాంతాలకు రెండు పంచాయతీ చట్టాలు వుండేవి. మద్రాసు గ్రామ పంచాయతీ చట్టం-1950, హైదరాబాద్ గ్రామ పంచాయతీ చట్టం-1956 లను 1964లో రద్దు చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం ఏర్పడింది. ఆ తర్వాత కొంత కాలానికి పంచాయతీ సమితులు, గ్రామ పంచాయతీల పనితీరు పరిశీలించిన అశోక్ మెహతా కమిటీ 1978లో తన సిఫార్సులు చేసింది. దాని ఫలితంగా 1986లో 330 పంచాయతీ సమితుల స్థానంలో 1096 మండల పరిషత్తులు ఏర్పడ్డాయి.

కేరళలో 2018లో వచ్చిన వరదలు, ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం ప్రపంచాన్ని ఆకర్షించిందంటే దానికి కారణం అక్కడవున్న పటిష్టమైన పంచాయితీ వ్యవస్థ. మన రాష్ట్రంలో నిజంగా పాలన వికేంద్రీకరణ విధానం అమలు కావాలంటే వాలంటీర్ల వ్యవస్థను పంచాయతీ పాలన కిందకు తెచ్చి ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా గ్రామ సభలు జరపడం, అక్కడ ప్రణాళికలు రూపొందించడం, వాటి అమలుకు సరిపడా నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించడం, అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరగాలి.

దేశవ్యాపితంగా స్థానిక స్వపరిపాలన పటిష్టంగా అమలు చేయడం కోసం 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగంలో 9, 9ఎ విభాగాలను అదనంగా చేర్చారు. 11వ షెడ్యూల్ ద్వారా 29 అంశాలు నిర్వహించడానికి గ్రామ పంచాయతీలకు పూర్తి అధికారాలు ఇచ్చారు. దీనిద్వారా ప్రజలకు అవసరమైన ప్రాథమిక, కనీస సదుపాయాలు కల్పించడం, వాటిని నిర్వహించడం పంచాయతీల పరిధిలోకి వచ్చింది. గ్రామీణ వ్యవస్థ లోని భూస్వాములు, ధనిక రైతాంగం పంచాయతీ ఎన్నికలు జరగకుండా, తమ పెత్తనాన్ని కొనసాగించుకునేందుకు మొదటి నుండి ప్రయత్నించారు. అయితే సిపిఎం నాయకత్వంలో బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో ఏర్పడిన వామపక్ష ప్రభుత్వాలు పంచాయతీల ఎన్నికలకు, వాటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాయి. గ్రామ సభలు నిరంతరం జరపడం ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులకు పాలనలో నిజమైన భాగస్వామ్యం కల్పించారు. అందులో ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, ప్రతి ఐదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఆ రాష్ట్రాల బడ్జెట్ నుండి గ్రామ పంచాయతీలకు 30 నుండి 37 శాతం నిధులు కేటాయించేవారు. ఈ నిధులను గ్రామ పంచాయతీలకు బదిలీ చేయడం, వాటి ద్వారా ప్రజా సేవ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆదర్శవంతమైన గ్రామపాలన అందించారు. అందుకే ఈ రాష్ట్రాల పంచాయతీలు దేశంలోనే కాదు ప్రపంచ మన్ననలు పొందాయి. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికలు నిర్దిష్ట గడువులో నిర్వహిస్తేనే కేంద్రం నిధులు విడుదల చేసే విధంగా నిబంధనలు మార్చాల్సి వచ్చింది. మంచి లక్ష్యంతో ఏర్పడిన పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభం నుండి విధులు, నిధుల కొరతను ఎదుర్కోవలసి వచ్చింది.

వాలంటీర్ వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో జి.వో నెం: 104 ద్వారా 2019 ఆగస్టు 15న గ్రామ వాలంటీర్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఈ వ్యవస్థ ద్వారా 'ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సేవలను, కుల, మత, వర్గ, లింగ, రాజకీయ అనుబంధాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదార్లకు 'నవరత్నాల' రూపంలో చేరవేయడం లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం అందులో పది మంది సిబ్బంది, 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో లక్ష 34 వేల మంది సచివాలయ సిబ్బంది, రెండు లక్షల 65 వేల మంది వాలంటీర్లు వచ్చినప్పటికీ గ్రామ పంచాయతీలు బలపడకపోగా, మరింత బలహీనపడ్డాయి. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు కొన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి నెల మొదటి తేదీన పింఛను అందించడం, పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, రైతుభరోసా, విద్యాదీవెన, విద్యా వసతి, గోరుముద్ద లాంటి పథకాల అమలులో సాంకేతిక అభ్యంతరాలను సరిదిద్దే ప్రయత్నం వాలంటీర్లు చేస్తున్నారు. ప్రతి చిన్న పనికి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే పాలనాపరమైన ఇలాంటి పనులు జరగడం మంచి విషయం. అయితే వాలంటీర్లలో అత్యధిక మంది అధికార పార్టీకి సంబంధించిన వారు కావడం, పాలనా పరమైన పనులన్నింటికీ వీరే కీలకంగా మారడంతో పంచాయతీ అధికారులు, ఎన్నికైన పంచాయతీ ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ పెత్తనం పెరిగింది. ప్రతి కుటుంబం గురించి ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల వివరాలు ఈ వాలంటీర్ల దగ్గర వుండడం వల్ల ప్రజలను భయపెట్టడం, అవినీతికి, అనైతిక పనులకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్, భూమి వివరాల లాంటి సమగ్ర సమాచారం ఈ వాలంటీర్ల వద్దకు చేరింది. ఈ సమాచారానికి భద్రత ఎంత?

పంచాయతీలు నిర్వీర్యం

గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీటి కొళాయిల ఏర్పాట్లు, కాలవల మరమ్మతులు, చెత్త శుభ్రం చేయించడం లాంటి రోజువారీ పనులకు కూడా పంచాయతీల వద్ద నిధులు లేవు. ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పథకాల అమలులో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర లేదు. అందుకే ప్రజల చేత ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు రోడ్లపైకెక్కి ఉద్యమిస్తున్నారు. పోలీసు నిర్బంధాన్ని ఎదిరించి తమ బాధలను వినిపించే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో అత్యధిక సర్పంచులు అధికార పార్టీ వారే అయినప్పటికీ ఆందోళనలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థమవుతుంది.

రాష్ట్రంలో మూడున్నర కోట్ల గ్రామీణ ప్రజలకు 12,918 మంది సర్పంచులు ప్రతినిధులుగా వున్నారు. పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం ద్వారా 2018-19లో రూ.1729.23 కోట్లు, 2019-20లో రూ.2,336.5 కోట్లు వచ్చాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020-21లో రూ.2,625 కోట్లు, 2021-22లో రూ.1,939 కోట్లు...మొత్తం రూ.8,629.73 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు మళ్లించింది. సిఎంఎఫ్ఎస్ అకౌంట్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ నిధులను మళ్లించుకుంటుంది. కేంద్ర ఆర్థిక సంఘం నుండి 2022-23, 2023-24 సంవత్సరాలకు వచ్చిన రూ.4,041 కోట్ల నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తన దగ్గర నిలుపుకుంది. అంతేకాకుండా రిజిస్ట్రేషన్లపై పంచాయతీలకు ఈ సంవత్సరం జనవరి నుండి రావలసిన స్టాంపు డ్యూటీ వాటా సుమారు నాలుగు వేల కోట్లు ఇవ్వడంలేదు.

నిధుల కొరతతో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అవుతుంటే...9 వేల కోట్లతో 35 వేల సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు కట్టడంవల్ల ఏం ఉపయోగం? పంచాయతీ వ్యవస్థను బలహీనం చేసి అధికార యంత్రాంగం ద్వారా, తమ పార్టీ కార్యకర్తల ద్వారా పరిపాలిస్తున్నారు. దేశంలో అమలవుతున్న వినాశకర ఆర్థిక విధానాల కేంద్రీకృత పాలన లక్ష్యంగా వున్నాయి. రాష్ట్రంలో అమలవుతున్న ఈ చర్యలన్నీ అందులో భాగమే. ఇప్పటికే రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో వున్న విద్య, వ్యవసాయం, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్యం, మంచినీటి సరఫరా లాంటి వాటన్నింటిలో కేంద్ర పెత్తనం పెరిగింది. ఈ రంగాలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం చట్టాలు రూపొందిస్తుంది. తమ హక్కులు హరించుకుపోతుంటే ప్రశ్నించలేని రాష్ట్ర ప్రభుత్వం హక్కుల రక్షణ కోరుతున్న సర్పంచులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. ప్రజల చెంతకే పాలన అంటే భవనాలు కట్టడం, తాత్కాలిక సిబ్బందిని పెంచడం కాదు, స్థానిక సంస్థలకు నిధులు పెంచి వాటి ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. కేరళలో 2018లో వచ్చిన వరదలు, ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం ప్రపంచాన్ని ఆకర్షించిందంటే దానికి కారణం అక్కడవున్న పటిష్టమైన పంచాయితీ వ్యవస్థ. మన రాష్ట్రంలో నిజంగా పాలన వికేంద్రీకరణ విధానం అమలు కావాలంటే వాలంటీర్ల వ్యవస్థను పంచాయతీ పాలన కిందకు తెచ్చి ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా గ్రామ సభలు జరపడం, అక్కడ ప్రణాళికలు రూపొందించడం, వాటి అమలుకు సరిపడా నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించడం, అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరగాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

★

మావోయిస్టులపై సమిష్టి వ్యూహంతో దాడి

● నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల డిజిపిల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిషేధిత మావోయిస్టులపై సమిష్టి వ్యూహాలతో దాడులు నిర్వహించాలని, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని మావోయిస్టు ప్రభావిత నాలుగు రాష్ట్రాల డిజిపిలు నిర్ణయించారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్ నేతృత్వంలో మహారాష్ట్ర డిజిపి రజనీశ్ సేఠ్, ఛత్తీస్‌గఢ్ డిజిపి అశోక్ జునేజా, ఆంధ్రప్రదేశ్ డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశమై మావోయిస్టుల కార్యక్రమాలను నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల కార్యకలాపాలు, ప్రస్తుతం వారి బలం, కొత్త రిక్రూట్‌మెంట్ అనే అంశాలపై ఆయా రాష్ట్రాల డిజిపిలు చర్చించారని తెలిసింది. కరోనా కారణంగా నాయకత్వ శ్రేణిలో కొందరు కీలక నేతలు మరణించడంతో మావోయిస్టు కేంద్ర కమిటీ చాలా వరకు బలహీనపడిందని అధికారులు అభిప్రాయ పడినట్టు తెలిసింది. సరిహద్దు రాష్ట్రాలుగా మావోయిస్టు కార్యకలాపాలపై సమీక్షించుకుంటూ వారి కార్యకలాపాలను కఠినంగా అణచి వేయడానికి సమిష్టిగా వ్యూహాలతో ముందుకు సాగాలని నిర్ణయించినట్టు తెలిసింది.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఒపెన్ ఇ-టెండరు నోటీసు నెం.డిప్యూటీ.సిఇ/జిఎస్/ఎస్‌సి/22& 23/2023/ఓటి, తేది.24.07.2023

భారత రాష్ట్రపతి తరపున క్రింది సంతకందారుడు దిగువ పనుల కొరకు 16.08.2023న 14.00గం.ల వరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

1. ఇ-టెండరు నెం: 22-జిఎస్-ఎస్‌సి-23-ఓటి, **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్-జిఎస్‌యు-(ఎస్‌డబ్ల్యు1): సికింద్రాబాద్-వాడి సెక్షన్-సికింద్రాబాద్ ఎండ్‌వైపు సనత్‌నగర్ స్టేషన్ యార్డు అప్రోచ్‌ల వద్ద రైల్వే కిమీ.175/39 నుండి 176/1వద్ద సైజ్ 2×9.50×5.5ఎం (మిన్) ఆర్‌సిసి బాక్స్ యొక్క రోడ్ అండర్ బ్రిడ్జి (పోర్ లైన్) యొక్క ప్రతిపాదిత నిర్మాణం. (ఎస్‌డబ్ల్యు2): సికింద్రాబాద్-వాడి సెక్షన్-జేమ్స్ స్ట్రీట్ మరియు సికింద్రాబాద్ స్టేషన్‌ల మధ్య కిమీ.192/31-33 రాజీగంజ్ దగ్గర ప్రస్తుతమున్న ఆర్‌యుబి నెం.244 ఆఫ్ స్పాన్ 1×11.99మీ (ఎస్‌కె) లియూలో ఎంజిరోడ్ వైపు బాక్స్ పుషింగ్& (33.495.ఎం) (ఎస్‌కె)లెంగ్త్ న్యూ 15చే 2 నెం.ల 1=×11.00 ఎం×5.50ఎం (మిన్, విసి) క్లియర్ హెచ్‌టి ఆర్‌సిసి బాక్స్‌గా ఆర్‌యుబి నెం.244 యొక్క ప్రతిపాదిత రీబిల్డింగ్. **సుమారు టెండరు విలువ రూ.** 45,03,02,674/-, **ఈఎండి:** రూ.24,01,500/-, **పూర్తిచేయు కాలవ్యవధి నెలల్లో:** 18 నెలలు, **నిర్వహణ వ్యవధి నెలల్లో:** 36 నెలలు.

2. ఇ-టెండరు నెం: 23-జిఎస్-ఎస్‌సి-23-ఓటి, **పని పేరు:** ఎస్‌సి డివిజన్/గతి శక్తి యూనిట్: బిపిక్యూ-కెజెడ్‌జె సెక్షన్-పిడిపిఎల్-పెద్దపల్లి-కరీంనగర్ లైన్‌కు కాజీపేట్-బల్లార్ష మెయిన్‌లైన్‌ను కలుపుతూ పెద్దపల్లివద్ద న్యూ బైపాస్ లైన్ కోసం ఇతర చిన్నతరహా పనుల నిర్వహణ మరియు కనీస ప్రయాణ వసతులతో న్యూ స్టేషన్ బిల్డింగ్ నిర్మాణం, బ్రిడ్జిల (2 నెం.ల) నిర్మాణం, ఫార్మేషన్, బ్లాంకెటింగ్‌లలో మట్టిపని, ప్రస్తుత ట్రాక్ & పాయింట్స్ & క్రాసింగ్స్ స్లీవింగ్ మరియు స్టోన్ బల్లాస్ట్, డిస్‌మాంట్లింగ్ డంపింగ్ మరియు సరఫరా, లీడింగ్, ఎస్‌ఇజెలు& జిజెలు పాయింట్స్ & క్రాసింగ్స్ యొక్క ఇన్సర్షన్ మరియు బిజి ట్రాక్, ప్రతిపాదిత అసెంబ్లింగ్ వేయుట & లింకింగ్. **సుమారు టెండరు విలువ రూ.**10,62,42,738/-, **ఈఎండి:** రూ.6,81,200/-, **పూర్తిచేయు కాలవ్యవధి నెలల్లో:** 12 నెలలు, **నిర్వహణ వ్యవధి నెలల్లో:** 36 నెలలు.

1) టెండరుదారులు ఇటెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు ఏలాంటి మ్యానువల్ ఆఫర్లు పరిగణలోకి తీసుకోబడవు.
2) నిర్ణీత టెండరుదారులను కోరడమేమనగా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా మాత్రమే ధరావత్తును చెల్లించాలి.
3) ఎటువంటి కారణాలు తెలుపకుండానే టెండరునురద్దుచేయు హక్కు రైల్వే వారికి ఉంటుంది.
4) నిర్ణీత టెండరుదారులందరూ జిఎస్‌టిఐఎన్ గుర్తింపు నెంబరును పొందాలిమరియు వారి ఆఫర్‌తోసహా సమర్పించాలి.

డిప్యూటీ చీఫ్ ఇంజనీరు/గతి శక్తి/ సికింద్రాబాద్

PUB/0823

ఇ-టెండరు నోటీసు నెం.07-2023 తేది.19.07.2023

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజనీరు/గతిశక్తి యూనిట్/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు. ముగింపు తేది: సమయం: 10.08.2023న 11.00గం.లకు.

1. టెండరు నెం.జిటిఎల్-జిఎస్‌యు-ఎఫ్‌ఎస్-15ఆర్‌ఓబి-20-**పని వివరణ:** గుంతకల్ డివిజన్: రేణిగుంట-గూటీ-వాడి సెక్షన్-ఫీసిబిలిటీ స్టడీ: జిఏడిలు, అభివృద్ధి మరియు తయారీ కోసం కన్సల్టెన్సీ సేవలుబీ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక, ఫౌండేషన్ కోసం వివరణాత్మక డ్రాయింగ్‌ల తయారీ మరియు డిజైన్, వయాడక్ట్ స్పాన్స్ మరియు అప్రోచ్‌లతో సహా రోడ్ ఓవర్ బ్రిడ్జ్/రోడ్ అండర్ బ్రిడ్జ్ యొక్క ఉప-నిర్మాణం& సూపర్ స్ట్రక్చర్‌బీ రీన్‌ఫోర్స్డ్ ఎర్త్ వాల్ & రిటైనింగ్ వాల్ డిజైన్‌బీ ఫౌండేషన్, స్ట్రక్చరల్ మరియు ఆర్‌ఇ వాల్/రిటైనింగ్ వాల్ డిజైన్ యొక్క రుజువు తనిఖీ బిపిక్యూ: తయారీబీ వివరణాత్మక అంచనా తయారీబీ భూసేకరణ ప్రతిపాదనల తయారీ ; రేణిగుంట-వాడి సెక్షన్15 (పదిహేను) లెవెల్ క్రాసింగ్‌లు (ప్రాజెక్ట్) బదులుగా రోబ్ నిర్మాణం కోసం సంబంధిత కోడ్‌లు/మాన్యువల్స్ ప్రకారం జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించడం మరియు సాంకేతిక నిర్దేశాలతో బిడ్ డాక్యుమెంట్ తయారు చేయడం. **ప్రకటన విలువ: రూ.** 12560911.30 **ధరావత్తు (రూ.):** 212800.00

2. టెండరు నెం.జిటిఎల్-జిఎస్‌యు-ఎఫ్‌ఎస్-14ఆర్‌ఓబి-21-**పని వివరణ:** గుంతకల్ డివిజన్: రేణిగుంట-గూటీ-వాడి సెక్షన్-ఫీసిబిలిటీ స్టడీ: జిఏడిలు, అభివృద్ధి మరియు తయారీ కోసం కన్సల్టెన్సీ సేవలుబీ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక, ఫౌండేషన్ కోసం వివరణాత్మక డ్రాయింగ్‌ల తయారీ మరియు డిజైన్, వయాడక్ట్ స్పాన్స్ మరియు అప్రోచ్‌లతో సహా రోడ్ ఓవర్ బ్రిడ్జ్/రోడ్ అండర్ బ్రిడ్జ్ యొక్క ఉప-నిర్మాణం & సూపర్ స్ట్రక్చర్‌బీ రీన్‌ఫోర్స్డ్ ఎర్త్ వాల్ & రిటైనింగ్ వాల్ డిజైన్‌బీ ఫౌండేషన్, స్ట్రక్చరల్ మరియు ఆర్‌ఇ వాల్/రిటైనింగ్ వాల్ డిజైన్ యొక్క రుజువు తనిఖీ బిడిపిక్యూ తయారీబీ వివరణాత్మక అంచనా తయారీబీ భూసేకరణ ప్రతిపాదనల తయారీ, గూటీ-వాడి సెక్షన్ లో 14 నెం.(పద్నాలుగు) లెవెల్ క్రాసింగ్‌లు (ప్రాజెక్ట్) బదులుగా ఆర్‌ఓబి నిర్మాణం కోసం సంబంధిత కోడ్‌లు/మాన్యువల్స్ ప్రకారం జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించడం మరియు సాంకేతిక నిర్దేశాలతో తయారు చేయడం. **ప్రకటన విలువ: రూ.** 11049884.48 **ధరావత్తు (రూ.):** 205300.00

బిడ్ డాక్యుమెంట్ తయారు చేయడం. బిడ్ పత్రం మరియు ఇతర వివరాలను http//ireps.gov.in కు లాగిన్ ఇవ్వండి, ఏదేని సవరణ ఉంటే ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజనీరు/ గతిశక్తి యూనిట్/ గుంతకల్

PUB/0825

టెండరు ప్రకటన

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజన్ సిగ్నల్ & టెలికం ఇంజనీరు,హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా దిగువ తెలిపిన పనుల కొరకు **18.08.2023న 11.30గం.ల వరకు** ఒపెన్ టెండరును ఆహ్వానిస్తున్నారు, **టెండరు తేది: 24.07.2023**

1. టెండరు నెం.వై/ఎస్‌జి/36/2023-24/07. **పని పేరు:** హైదరాబాద్ డివిజన్-గతి శక్తి: 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' (ఏబిఎస్‌ఎస్) క్రింద హైదరాబాద్ డివిజన్‌లో ఏబిఎస్‌ఎస్ స్టేషన్లలో టెలికాం ఏర్పాట్ల ఏర్పాటు (7 నెం.లు అనగా, నిజామాబాద్, మలక్‌పేట, హప్పుగూడ, కామారెడ్డి, మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, కర్నూలు సిటీ స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (12మీ) ఏర్పాటుకు సంబంధించి. **సుమారు విలువ (రూ.):** 3,63,16,503.88, **ధరావత్తు (రూ):** 3,31,600

2. టెండరు నెం.వై/ఎస్‌జి/36/2023-24/08. **పని పేరు:** హైదరాబాద్ డివిజన్-గతి శక్తి: 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' (ఏబిఎస్‌ఎస్) క్రింద హైదరాబాద్ డివిజన్‌లో ఏబిఎస్‌ఎస్ స్టేషన్లలో టెలికాం ఏర్పాట్ల ఏర్పాటు, లిఫ్టులు (11 నెం.ల) ఏర్పాటు పనులతోకలుపుతూ మరియు ఎస్కాలేటర్లు (7 నెం.ల) ఏర్పాటుచేయుట. **సుమారు విలువ (రూ.):** 2,41,75,171.50, **ధరావత్తు (రూ):** 2,70,900

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికం ఇంజనీరు, హైదరాబాద్

PUB/0824

టెండరు ఆహ్వాన ప్రకటన ఇ-టెండరు నెం.డిప్యూటీ సిఇ-జిఎస్-బిజెడ్ఏ-18-2023 తేది.24.07.2023 (ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజనీరు గతిశక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు దిగువ పనుల కొరకు
టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ సిస్టమ్/ ఒపెన్ టెండరును ఆహ్వానిస్తున్నారు.

1. టెండరు నెం: డిప్యూటీ సిఇ-జిఎస్-బిజెడ్ఏ-18-2023-24, తేది.24.07.2023. **పని వివరణ:** విజయవాడ డివిజన్- నర్సాపూర్ (ఎన్ఎస్) వద్ద న్యూ స్టేషన్ బిల్డింగ్ యొక్క ప్రతిపాదిత నిర్మాణం. **టెండరు విలువ:** రూ.67054094.50, **ధరావత్తు: రూ.**485300.00. **పూర్తిచేయు వ్యవధి:** (09) తొమ్మిది నెలలు, **టెండరు ఫారం ధర:** నిల్, **ముగింపు తేది& సమయం:** 16.08.2023న 15.00గం.లకు.

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాలకు దయచేసి వెబ్‌సైట్: https://ireps.gov.in కు లాగిన్ అవ్వండి.
2. ధరావత్తు మరియు టెండరు పత్రం ధరను చెల్లింపును ఐఆర్ఇపిఎస్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులోగల నెట్ బ్యాంకింగ్/ పేమెంట్ గేట్‌వే వసతుల ద్వారా మాత్రమే.
3. టెండరు సమర్పించు /బిడ్డింగ్ కాలవ్యవధి సమయంలో టెండరుదారులు వారి ఆఫర్లను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలి, అది టెండరు ముగింపుకు ముందు పదిహేను రోజుల కాలవ్యవధి ఉంటుంది.
4. టెండరు సమర్పించు/ బిడ్డింగ్ కాలవ్యవధి ప్రారంభ తేది వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్ ద్వారా జారీచేయబడు)ను టెండరుదారులు గమనించాలి.

డిప్యూటీ చీఫ్ ఇంజనీరు, గతిశక్తి, విజయవాడ.

PUB/0826

ఒపెన్ ఇ-టెండరు నోటీసు నెం.బి/ఇ.ఐజిఎస్/ 05/2023-24, తేది.24.07.2023

భారత రాష్ట్రపతి తరపున, క్రింది సంతకందారుడు దిగువ తెలిపిన కొరకు దిగువ పేర్కొన్న తేదీలపై 15.00గం.ల వరకు
ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

1. టెండరు నెం.బి/ఇ.29/ఐ/ఇజిఎస్/16/23-24, తేది.21.07.23. **పని పేరు:** విజయవాడ డివిజన్-బిజెడ్ఏ-విఎస్‌కెపి సెక్షన్‌పై ఎడిఇఎన్/ఇఇ సబ్-డివిజన్‌లో గన్నావరం (జిడబ్ల్యుఎం) మరియు చెబ్రోలు (సిఇఎల్) యార్డు వద్ద పిక్యూఆర్ఎస్‌డిపో వద్ద పటిష్ట పరుచుట కొరకు జనరల్ ఎలక్ట్రికల్ ఏర్పాట్లను నిర్వహించుటకు. **పూర్తిచేయు కాలవ్యవధి:** 6 నెలలు, **టెండరు విలువ (రూ):** 2876356.60, **ధరావత్తు /బిడ్ సెక్యూరిటీ:** (రూ) 57500/-, **టెండరు పత్రం ధర:** నిల్, **ముగింపు తేది:** 14.08.2023

2. టెండరు నెం.బి/ఇ.29/ఐ/ఇజిఎస్/17/23-24, తేది.24.07.23. **పని పేరు:** విజయవాడ డివిజన్-బిజెడ్ఏ-విజయవాడ డివిజన్‌పైగల ఎలక్ట్రికల్ అసెట్స్ అనగా బిఎల్‌డిసి ఫ్యాన్స్, ట్రాన్స్‌ఫార్మర్, ఏసిలు మరియు ఎర్త్ పిట్స్ యొక్క ప్లేస్‌మెంట్. **పూర్తిచేయు కాలవ్యవధి:** 06 నెలలు, **టెండరు విలువ (రూ):** 18380231/-, **ధరావత్తు /బిడ్ సెక్యూరిటీ:** (రూ) 241900/-, **టెండరు పత్రం ధర:** నిల్, **ముగింపు తేది:** 16.08.2023

3. టెండరు నెం.బి/ఇ.29/ఐ/ఇజిఎస్/18/23-24, **పని పేరు:** విజయవాడ డివిజన్-అమృత్ భారత్ స్టేషన్ కొరకు బిజెడ్ఏ డివిజన్‌పైగల వివిధ స్టేషన్లు/లొకేషన్ల వద్ద 22 లిఫ్టుల డిజైన్, సరఫరా, ట్రాన్స్‌పోర్టేషన్ మరియు ఎఎంసి. **పూర్తిచేయు కాలవ్యవధి:** 09 నెలలు, **టెండరు విలువ (రూ):** 56852400/-, **ధరావత్తు /బిడ్ సెక్యూరిటీ:** (రూ).434300/-, **టెండరు పత్రం ధర:** నిల్, **ముగింపు తేది:** 16.08.2023

1) నిర్ణీత టెండరుదారులు ఏదేని టెండరు కొరకు ఏదేనిమార్పులు/ సవరణను గమనించుటకు టెండరు ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్: www.ireps.gov.in ను దర్శించండి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ

PUB/0827

ఆర్‌టిఐ పరిధిలోకి రాజకీయపార్టీలు

కుదరదన్న కేంద్రం : సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) పరిధిలోకి తీసుకురావాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) ఆదేశాలను సుప్రీంకోర్టులో రిట్‌ను కోరేందుకు ఉపయోగించలేమని కేంద్ర ప్రభుత్వం మంగళవారం వాదనల్లో స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు కేంద్రం తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

'రాజకీయ పార్టీలను ఆర్‌టిఐ పరిధిలోకి తీసుకురావడానికి మాండమస్ (అధికారిక విధులను నిర్వహించడానికి ప్రభుత్వానికి న్యాయపరమైన ఆదేశాలు) కోరడానికి సిఐసి ఉత్తర్వు ఉపయోగించబడదు' అని కోర్టుకు తెలిపారు.

అభ్యంతరం లేదన్న సిపిఎం

మరో వైపు ఆర్థిక అంశాలకు సంబంధించి ఆర్‌టిఐపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సిపిఎం తరపున న్యాయవాది పివి దినేష్ తెలిపారు. అయితే, అభ్యర్థిని ఎందుకు ఎంపిక చేశారో మాత్రం చెప్పడం సాధ్యం కాదన్నారు. అది పార్టీ అంతర్గత నిర్ణయాల ప్రక్రియకు సంబంధించిన విషయమన్నారు. రాజకీయ వ్యవస్థలో పారదర్శకత ఉండేలా ప్రభుత్వం నుంచి పన్ను మినహాయింపులు, భూములు పొందడం తదితర ప్రయోజనాలను పొందుతున్న రాజకీయ పార్టీలను ఆర్‌టిఐ పరిధిలోకి తీసుకురావాలని 2013లో సిఐసి ఉత్తర్వులు జారీ చేసిందని పిటీషనర్ల తరుపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు.

ఎన్‌జిఒ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్), న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై విచారణను ఆగస్టు ఒకటో తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అయితే, అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కేసు వ్యవహారాలను చూసుకుంటున్నారని, ఆయన అందుబాటులో లేరని సొలిసిటర్ జనరల్ ధర్మాసనం ముందుకు తీసుకురాగా.. పరిగణలోకి తీసుకుంటూ వాయిదా వేసింది.

రాజకీయ పార్టీలు ఏమంటున్నాయంటే..?

అయితే, రాజకీయ పార్టీలు సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) పరిధిలోకి వచ్చేందుకు ఏమాత్రం ఇష్టపడడం లేదు. సమాచార హక్కు చట్టం పరిధిలోకి వస్తే రాజకీయాలకు సంబంధించిన అత్యంత గోప్యమైన అంశాలను కూడా వెల్లడించాల్సి వస్తుందని, దాంతో తమ పార్టీల మనుగడకు, రాజకీయానికి ప్రమాదం వస్తుందని పార్టీలు భావిస్తున్నాయి. పార్టీకి అందే విరాళాలు, నిధుల సేకరణ, ఎన్నికల ఖర్చుకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేస్తున్నామని, ఇదే సమాచారాన్ని అడిగితే ఇచ్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పలు పార్టీలు పేర్కొంటున్నాయి. పార్టీలు చేసే రాజకీయాలను ఇతర వ్యక్తులతో పంచుకోవడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నాయి.

ఫాసిస్టు శక్తులకు చెక్ పెట్టారు

స్పెయిన్ ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ



వోక్స్ పార్టీ అధినేత శాంటియాగో

సదరు విషయమై సంబంధించిన భూయజమానులు/ ఆసక్తి గల వ్యక్తులు దిగువ సంతకందారుకు సంబంధిత భూమిని అప్పగించవలసిందిగా /స్వాధీనపరచవలసిందిగా తెలియజేయడమైనది. భూయజమానులు అందులో ఆసక్తి కలిగిన వ్యక్తులను మరోసారి కోరబడుచున్నారు. లేనిచో 60 రోజుల తర్వాత పోలీసుల సహకారంతో సదరు సంబంధించిన భూమిని స్వాధీనం చేసుకొనబడుతుంది.

సం/- శ్రీమతి అదితి సింగ్, I.A.S.,
కాంపిటెంట్ అథారిటీ భూసేకరణ &
సబ్ కలెక్టర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా.

ఓంకార అసెట్స్ రికన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: సి/515, కానకియ జిల్లియన్, ఎల్‌బిఎస్ రోడ్ మరియు సిఎస్‌టి రోడ్ యొక్క జంక్షన్, బికెసి అనెక్స్, ఈక్వినాక్స్ దగ్గర, కలిన, కుర్ల (వెస్ట్), ముంబయి-400070.
టెలి: 022-26544000, ఇ-మెయిల్:Mumbai@omkaraarc.com
రిజిష్టర్డు ఆఫీసు: నం.9, ఎం.పి.నగర్, మొదటి వీధి, కొంగు నగర్ ఎక్స్‌టెన్షన్, తిరుపూర్-641607.
సిఐఎన్: U67100TZ2014PTC020363 / www.omkaraarc.com

స్వాధీనతా ప్రకటన

[illegible]

పై ఖాతాలో ఆస్తులు / ఆస్తుల వివరాలు హైపోథెకేటెడ్ / కేటాయించిన / ఛార్జ్ చేయబడిన / తనఖా పెట్టబడిన టూర్ కంపెనీ %డ% దీని ఆధీనంలో ఇక్కడ ఇవ్వబడింది:

స్థిరాస్తి వివరణ

ఆంధ్రప్రదేశ్-521002, కృష్ణాజిల్లా, మచిలీపట్నం మండలం, కరఅగ్రహారం గ్రామ పంచాయతీ, డో.నం.4-3, ఎస్‌వై.నం.23/2బి లో ఉన్న మొతం ఆ స్థలం భాగం మరియు పౌల్ట్రీ షెడ్ స్థలం కొలిచే 677.6 చ.గ.లు. తో బిల్డప్ 280 చ.అ.లు. మరియు హద్దులు: ఉత్తరం: పుంత, దక్షిణం: మిద్ది లక్ష్మి, మిద్ది వెంకటేష్ స్థలం, తూర్పు: వేముల కృష్ణమూర్తి స్థలం, పడమర: మదమల నాగేశ్వరరావు స్థలం.

తేది: 19.07.2023
ప్రదేశం: కృష్ణాజిల్లా

ఓంకార అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున
(దీని సామర్థ్యంతో ఓంకార పిఎస్ 33/2021-22 ట్రస్ట్ యొక్క ట్రస్టీగా వ్యవహరిస్తుంది)
(అధీకృత అధికారి)

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
బ్రాంచి ఆఫీస్ యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం.22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003.

స్వాధీనత ప్రకటన (రూల్-8(1) (స్థిరాస్తి వివరములు)

ఇందుమూలంగా **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ (ఇంతకు పూర్వము యు.టి.ఐ బ్యాంక్ లిమిటెడ్ గా తెలిసిన)** యొక్క అధీకృత అధికారి వారి నమోదిత కార్యాలయము: "త్రిసూల్", సామర్తేశ్వర్ గుడి ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, ఇతర ప్రదేశములలో ఉన్న బ్రాంచీలు నందు గల **బ్రాంచ్ ఆఫీస్ యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం.22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003** వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు అందలి సెక్షన్ 13(12) తో కలిపి చదవబడే ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 3 క్రింద తమకు లభించిన అధికారములను వినియోగించుకుంటూ ఈ దిగువ తెలియజేసిన ఋణగ్రహీతలను బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేసినారు.

అప్లికెంట్/కో-అప్లికెంట్/హామీదారుల యొక్క పేర్లు / ఖాతా నెం.లు : 1) శ్రీ నర్రా సుబ్బయ్య, తండ్రి. గంగయ్య, డి.నెం.7-113, గోకుల్ నగర్, నిజాంపట్నం, నిజాంపట్నం పోస్ట్, గుంటూరు జిల్లా-522314. **2) శ్రీమతి నర్రా నాగమణి, భర్త. ఎస్. సుబ్బయ్య,** డి.నెం.7-113, గోకుల్ నగర్, నిజాంపట్నం, నిజాంపట్నం పోస్ట్, గుంటూరు జిల్లా-522314.
అకౌంట్ నెం. : 917030081898464, **డిమాండ్ నోటీసు తేదీ : 19.10.2022,** **స్వాధీనం నోటీసు తేదీ : 19.07.2023**
బకాయి మొత్తం : రూ.38,12,199/- (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల పన్నెండు వేల నూట తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే) ఒప్పంద రేటుపై భవిష్యత్తు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర పరిణామాలు, నష్టాలు మొదలైనవి. వాటిపై ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయించాలని అన్నారు.
షెడ్యూల్ ఆస్తి వివరములు : గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్, మంతెనవారిపాలెం సబ్ జిల్లా, నిజాంపట్నం మండలం, నిజాంపట్నం గ్రామ పంచాయితీ, నిజాంపట్నం గ్రామం, డి.నెం.431/13 లోని ఎకరా 27.26 సెంట్లు విస్తీర్ణం మరియు డి.నెం.7-113 లోని 710.36 చ॥గ॥లు విస్తీర్ణంలోని స్థలంతో పాటు ఆర్.సి.సి. రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తులతో కలదు. **వైడ్ దస్తావేజు నెం.765/2016, తేది.13.06.2016 మంతెనవారిపాలెం యొక్క ఎస్.ఆర్.ఓ ప్రకారం హద్దులు : తూర్పు** : పంచాయితీ బజార్ - 58 ½ అ॥లు, **పడమర** : నర్రా నాగేశ్వర రావు గారికి చెందిన స్థలం - 48 ½ అ॥లు, **ఉత్తరం** : పంచాయితీ బజార్ - 121 అ॥లు, **దక్షిణం** : 2 గజాలు వెడల్పు గల నేడక దారి - 118 అ॥లు.

పైన తెలియజేయబడిన నోటీసు నందు బకాయి మొత్తములను డిమాండ్ నోటీసులు స్వీకరించిన 60 దినములలోగా చెల్లింపు చేయవలసినదిగా కోరినారు. అయినప్పటికినీ సదరు నోటీసులు నందు చెప్పబడిన బకాయి మొత్తములను తిర్గిగి చెల్లింపులో ఋణగ్రహీతలు విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు తమకు పై చట్టం యొక్క 13(4) తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8తో కలిపి చదవబడే ప్రకారం తమకు లభించిన అధికారములను వినియోగించుకుంటూ పైన చెప్పబడిన తేదీలలో సదరు ఆస్తులను స్వాధీనత చేసికొని ఉన్నారని ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలను హెచ్చరించడమైనది. సాధారణ ప్రజానీకము మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు ఈ నోటీసు ద్వారా చేయు హెచ్చరిక ఏమనగా పైన చెప్పబడిన ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదు, అట్లు జరపబడిన ఎడల అట్టి లావాదేవీలు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, వారి యొక్క పైన చెప్పబడిన నోటీసు నందు బకాయి మొత్తములు మరియు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు మొదలగునవి ఛార్జ్‌కి లోబడి ఉండును.

సదరు పై సర్ఫేసి 2002 చట్టం యొక్క సెక్షన్ 13 నందు సబ్-సెక్షన్ 8 లో గల నిబంధనలకు లోబడి ఋణగ్రహీతలు తమ సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి విడిపించుకొనుటకు శ్రమించు కాలపరిమితిని దయచేసి గమనించవలసినదిగా కోరడమైనది.

సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే ఈ నోటీసు ప్రచురణ తేదీకి ముందుగా ఏ సమయములోనైనా వారి బకాయి మొత్తములు మరియు ఇతర అన్ని కాస్ట్స్, ఛార్జీలు మరియు వారిచే చేయబడిన ఖర్చులుతో కలిపి చెల్లించిన ఎడల లేదా బహిరంగ వేలం లేదా కొటేషన్లు లేదా టెండర్లు బహిరంగ లేదా ప్రైవేటు వారి నుండి స్వీకరించిన, ట్రీటీ, లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ చేయుటకు ముందుగానే పూర్తిగా చెల్లించవలెను.
1) సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే ఈ హామీ ఆస్తులు లీజు ద్వారా, అసైన్‌మెంటు లేదా విక్రయం ద్వారా బదిలీ చేయబడదు; మరియు
2) సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే లీజు లేదా అసైన్‌మెంట్ లేదా ఈ ఆస్తుల విక్రయం వంటి ఏదేని చర్యలు తీసుకొనుటకు తగినంత ముందుగానే వారి బకాయి మొత్తములు ఈ సబ్-సెక్షన్ క్రింద పూర్తిగా చెల్లించినచో వారిచే బదిలీ లేదా లీజు లేదా ఆస్తుల విక్రయం వంటి తదుపరి తీసికొనబడవు.

తేది : 19.07.2023 ప్రదేశము : నెల్లూరు
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

దేశం అప్పు రూ.220.5 లక్షల కోట్లు

- కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.6 లక్షల కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం అప్పు రూ.76.1 లక్షల కోట్లు
- పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజలపై మొత్తం రూ.220.5 లక్షల కోట్ల అప్పు ఉందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఇది స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 80.9 శాతంగా ఉందని పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభలో సిపిఎం ఎంపి వి శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అందులో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.155.6 లక్షల కోట్లు (జిడిపిలో 71 శాతం), అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అప్పు రూ.76.1 లక్షల కోట్లు (జిడిపిలో 35 శాతం)ని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే అప్పుల్లో రూ.51 లక్షల కోట్లు (624.65 బిలియన్ యుఎస్ డాలర్లు) విదేశీ అప్పు ఉందని మరో ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనికి రూ.159,246 కోట్లు మేర వడ్డీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.

రైతు రుణమాఫీ పథకం అమలు చేయటం లేదు

కేంద్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం అమలు చేయటం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత మూడు ఏళ్ల, ప్రస్తుత సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి రైతుల రుణమాఫీ పథకం అమలు చేయలేదని పేర్కొన్నారు.

బ్యాంకులకు రూ. 5.71 లక్షల కోట్లు ఎన్‌పిఎ

దేశంలో రూ.5.71 లక్షల కోట్లు మొండి బకాయిలు (ఎన్‌పిఎ) ఉన్నాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి భగవత్ కరడ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 మార్చి 31 నాటికి దేశంలోని బ్యాంకులకు రూ.5,71,515 కోట్లు మొండి బకాయిలు ఉన్నాయని చెప్పారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు మినహా కుల గణన జరగలేదు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జన గణనలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి) మినహా కులాల వారీగా జనాభాను కేంద్ర ప్రభుత్వం లెక్కించలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. లోక్‌సభలో ఒకప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

'ఉపాధి' నిధుల్లో రూ.20,309 కోట్ల కోత

గత మూడేళ్లలో ఉపాధి హామీ నిధులు విడుదలలో రూ.20,309.2 కోట్లు కోత జరిగింది. ఈ మేరకు లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ఇచ్చిన సమాధానంలో ఈ విషయం స్పష్టం అయింది. ఉపాధి హామీకి 2020-21లో రూ.1,11,170.86 కోట్ల నిధులు విడుదల అయితే, 2021-22 నాటికి రూ.98,467.85 కోట్లకు తగ్గిందని, 2022-23 నాటికి రూ.90,861.96 కోట్లకు తగ్గిందని తెలిపారు.

పది పిఎస్‌యుల ప్రయివేటీకరణ పూర్తి

- వివిధ దశల్లో మరో 26 పిఎస్‌యులు
- ఇందులో విశాఖ స్టీల్ కూడా ఉంది
- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను మోడీ సర్కార్ అడ్డూఅదుపు లేకుండా కొనసాగిస్తోంది. ప్రయివేటీకరించాలని నిర్ణయించిన 36 ప్రభుత్వ రంగ సంస్థల్లో పది సంస్థల ప్రయివేటీకరణ పూర్తి చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి ఎలమరం కరీం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రయివేటీకరణ పూర్తి కావాల్సిన సంస్థల్లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కూడా ఉందని ఆమె తెలిపారు. 2016లో 36 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నామని, అందులో హెచ్‌పిసిఎల్, ఎయిర్ ఇండియా, డ్రెజ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి పది సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్, బిపిసిఎల్, ఐడిబిఐ బ్యాంక్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సిఇఎల్ వంటి 26 ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు.

మానసిక క్షోభతో బిక్కుబిక్కుమంటున్నారు !

- మణిపూర్ అత్యాచార బాధితులకు దక్కని న్యాయం
- ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్మన్ స్వాతి మాలివాల్

న్యూఢిల్లీ/ ఇంఫాల్ : మణిపూర్‌లో సంఘ్ పరివార్ గూండాల అకృత్యాలకు గురైన బాధితులను ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్మన్ స్వాలి మాలివాల్ మంగళవారం ఓదార్చారు. కుకి తెగకు చెందిన ముగ్గురు మహిళలపై దారుణాలకు ఒడిగట్టి, వారిలో ఇద్దరిని నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని నివ్వెర పాటుకు గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వాతిమాల్ మంగళవారం మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ సహాయక శిబిరానికి వెళ్లి బాధిత మహిళలను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, ఆ భయానక క్షణాలతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని స్వాతి తెలిపారు. ప్రాణాలతో బయటపడిన వారికి ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి కౌన్సిలింగ్, న్యాయ సహాయం, లేదా పరిహారం కూడా అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మణిపూర్ హింసాకాండకు రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొన్నారు.

'అల్లరి మూక నుండి కుమార్తెను రక్షించుకునే ప్రయత్నంలో నా భర్తను, నా కుమారుడిని పోగొట్టుకున్నా. అయినా మా బిడ్డను రక్షించుకోలేకపోయాం. బరితెగించిన ఆ మానవమృగాలు నాపైనా అఘాయిత్యానికి పాల్పడ్డారు' అని బాధితురాలి తల్లి స్వాతి మాలివాల్ బృందం వద్ద విలపించారు. మణిపూర్ హింసాకాండ ముసుగులో అల్లరి మూక అకృత్యాలకు బలైన వారి ఆవేదన వర్ణనాతీతమని స్వాతి చెప్పారు. చురాచంద్‌పూర్ సహాయక శిబిరంలో 70 ఏళ్ల మహిళను కలుసుకున్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన తమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కూడా అందలేదని స్వాతిమలివాల్ పేర్కొన్నారు. కనీస భద్రత ఏర్పాట్లు కూడా కల్పించలేదన్నారు. మణిపూర్ మారణకాండకు బాధ్యత వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పాక్షికంగా ఇంటర్నెట్ పునరుద్ధరణ

మణిపూర్‌లో ఇంటర్నెట్ సేవలను పాక్షికంగా పునరుద్ధరిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను పొందిందేందుకు అనుమతి ఇచ్చింది. స్థిరమైన ఒక్క ఐపి కనెక్షన్ నుంచి ఇంటర్నెట్ పరిమితంగా వినియోగించుకోవచ్చని తెలిపింది. అయితే మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధాన్ని మాత్రం తొలగించలేదు. అలాగే సోషల్ మీడియా వినియోగానికి కూడా అవకాశం ఇవ్వడంలేదని స్పష్టం చేసింది.

సుభాషిణీ అలీపై ఎఫ్‌ఐఆర్

- మరో ఇద్దరిపై కూడా...
- మణిపూర్ డిజిపికి ఎన్‌సిపిసిఆర్ ఆదేశం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాకాండను అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ..హింసాకాండను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై కక్షపూరిత చర్యలకు పూనుకుంటున్నాయి. ఈ క్రమంలోనే సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ, మేఘాలయకు చెందిన తరుణ్ భారతీయ, తమిళనాడుకు చెందిన ఎం కమాలుద్దీన్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని బాలల హక్కుల రక్షణ జాతీయ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) మణిపూర్ డిజిపిని ఆదేశించింది. ఈ మేరకు ఓ లేఖ రాసింది. మణిపూర్‌లో మే 4న ఇద్దరు యువతులను నగ్నంగా ఊరేగించిన ఘటనలో పాల్గొన్న ఓ మైనర్ ఫొటోను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై వీరిపై కేసు నమోదు చేయాలని ఆ లేఖలో డిజిపి రాజీవ్ సింగ్‌ను ఎన్‌సిపిసిఆర్ ఛైర్‌పర్సన్ ప్రియాంక్ కానూంగో ఆదేశించారు. పద్నాలుగు సంవత్సరాల బాలుడి గుర్తింపును బయటపెట్టారంటూ ఈ ముగ్గురిపై ఫిర్యాదు అందినట్లు తెలిపారు. వీరు ముగ్గురూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, బాల న్యాయ చట్టంలోని సెక్షన్ 75, సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ 66-ఈతో పాటు చట్టంలోని ఇతర నిబంధనలను ఉల్లంఘించారని ప్రాథమిక ఆధారాలు లభించినందున ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. అయితే మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ, అందులో బలైపోతున్న మహిళలు, బాలల హక్కులు ఎన్‌సిపిసిఆర్‌కు పట్టవా? అని ఇప్పుడు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థంభించిన ఐఆర్‌సిటిసి

న్యూఢిల్లీ : రైల్వే టిక్కెట్లు, సేవలకు సంబంధించిన ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి)లో మంగళవారం తీవ్ర సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో ఆ సంస్థకు సంబంధించిన ఆన్‌లైన్ కార్యకలాపాలు అన్నీ పూర్తిగా స్థంభించాయి. ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లలో నాలుగు గంటల పాటు సేవలు నిలిచిపోయాయి. టికెట్ బుకింగ్, ఇతర సేవలకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపాల పట్ల సేవల్లో అంతరాయం కలిగినందుకు మన్నించాలని మంగళవారం ఉదయం గంటల ప్రాంతంలో ఐఆర్‌సిటిసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. అయితే అమెజాన్, మేక్ మై ట్రిప్ వంటి బి2సి వేదికల ద్వారా రైల్వే ప్రయాణికులకు తమ సేవలు అందుబాటులో ఉన్నట్లు ఐఆర్‌సిటిసి పేర్కొంది. అయితే దాదాపు నాలుగు గంటల తర్వాత సాంకేతిక సమస్యలను పరిష్కరించామని, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని మంగళవారం మధ్యాహ్నం 2.15 గంటల ప్రాంతంలో ఐఆర్‌సిటిసి తెలిపింది. కానీ ఈ ప్రకటన తర్వాత కూడా టికెట్, ఇతర సేవల బుకింగ్ విషయంలో సమస్యలు వస్తున్నట్లు ప్రయాణీకులు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులపై 5,097 క్రిమినల్ కేసులు పెండింగ్

- సుప్రీం అమికస్ క్యూరీ వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ సభ్యులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీం కోర్టుకు అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా తెలిపారు. దేశవ్యాప్తంగా పార్లమెంట్, శాసనసభ సభ్యులకు సంబంధించి మొత్తం 5,097 క్రిమినల్ కేసులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు తన 17వ నివేదిక సమర్పించారు. 2022 జూలై నాటికి 44 శాతం లోక్‌సభ ఎంపిలు, 31 శాతం రాజ్యసభ ఎంపిలపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ చేసిన అధ్యయనం ఆధారంగా తన నివేదికలో పేర్కొన్నారు. 2016లో ఎంపి, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని న్యాయవాది అశ్విని కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారిస్తుంది. ఎంపి, ఎమ్మెల్యేలపై 5,097 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 40 శాతం కంటే ఎక్కువ (2,122) కేసులు ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2022 జూలై నాటికి 542 మంది లోక్‌సభ ఎంపిల్లో 236 మంది (44 శాతం), 226 మంది రాజ్యసభ సభ్యుల్లో 71 మంది (31 శాతం), 3,991 మంది ఎమ్మెల్యేల్లో 1,723 మంది (43 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు.

దళితులపై నేరాలలో మధ్యప్రదేశ్ టాప్

- ఎన్‌సిఆర్‌బి నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : 2021లో మధ్యప్రదేశ్‌లోనే దళితులపై అత్యధిక నేరాలు జరిగాయి. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) విడుదల చేసిన సమాచారం ప్రకారం.. 2019లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. 2021లో ఎస్సీలపై నేరాల విషయంలో జాతీయ సగటు రేటు 22.6 కాగా మధ్యప్రదేశ్‌లో 63.6గా నమోదైంది. రాజస్థాన్ 60.8 రేటులో రెండో స్థానంలో నిలిచింది. 2011 జనగణన ఆధారంగా ఎస్సీల జనాభాను లెక్కించారు. లక్ష మంది ఎస్సీ జనాభాపై జరిగిన నేరాలకు సంబంధించి రేటును లెక్కించారు. అన్ని రకాల నేరాలు, వేధింపులను దీనిలో చేర్చారు. ఎస్సీలపై జరిగిన నేరాల సంఖ్యకు సంబంధించి ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో (9,492) ఉండగా రాజస్థాన్ (7,435), మధ్యప్రదేశ్ (7,211) తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద 2011లో దేశంలో 45,619 కేసులు నమోదయ్యాయి. ఇక ఎస్టీలపై నేరాలకు సంబంధించి కేరళ మొదటి స్థానంలో నిలవగా రాజస్థాన్ రెండో స్థానంలో, మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. నేరాల సంఖ్య విషయానికి వస్తే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా మొదటి మూడు స్థానాలలో నిలిచాయి.

బ్యాంక్ బచావో.. దేశ్ బచావో

- ప్రయివేటీకరణ ఆపాలని బ్యాంక్ సంఘాల ఐక్య వేదిక డిమాండ్
- ప్రభుత్వ బ్యాంకులను కేంద్రం శత్రువులుగా చూస్తోందని విమర్శ

కొల్‌కతా : దేశంలోని సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు బ్యాంకుల ప్రయివేటీకరణకు స్వస్తి చెప్పాలని బ్యాంకుల అధికారులు, ఉద్యోగులు, కార్మికుల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. 'బ్యాంక్ బచావో.. దేశ్ బచావో మంచ్' పేరిట ఏర్పాటైన ఈ వేదిక కొల్‌కతాలో మంగళశారం ప్రత్యేక సదస్సు నిర్వహించింది. కొల్‌కతా యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ హాలులో జరిగిన ఈ సదస్సులో వక్తలు ప్రసంగిస్తూ ఎట్టి పరిస్థితులలోనూ బ్యాంకుల ప్రయివేటీకరణను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆర్థికంగా విఫలమైన సంస్థలకు చేయూత అందించాలని, ప్రభుత్వ రంగంలోని పారిశ్రామిక యూనిట్లను మరింత అభివృద్ధి చేయాలని వారు కోరారు. బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు కోరతామని చెప్పారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసి పారిశ్రామికవేత్తల ప్రయోజనాలు కాపాడాలని చూడకూడదు. రుణ బకాయిలన్నింటినీ కేంద్రమే వసూలు చేయాలి. రుణాల ఎగవేతదారులు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలి' అని వారు తెలిపారు.

సదస్సు అనంతరం మంచ్ జాయింట్ కన్వీనర్ సౌమ్యా దత్తా విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తాము ఏకమయ్యామని చెప్పారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడడమే తమ లక్ష్యమని అన్నారు. 'బ్యాంకులలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. పదవీవిరమణ చేసిన కొంతమంది ఉద్యోగులనే మళ్లీ తాత్కాలికంగా విధులలోకి తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా బ్యాంకులలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్ట్ కార్మికులు ఊడవడం, తుడవడం, ఇతర విధులు నిర్వర్తిస్తున్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందాలంటే కేంద్ర ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఖాళీలను భర్తీ చేయాలి' అని కోరారు. అంతకుముందు సదస్సులో ఆమె ప్రసంగిస్తూ ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు, సంస్థలను ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనివల్ల దేశ ఆర్థిక పునాది దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ బ్యాంకుల వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

మంచ్ జాయింట్ కన్వీనర్ బిశ్వరంజన్ రాయ్ మాట్లాడుతూ వ్యవసాయం నుండి మైనింగ్ వరకూ, చిన్న తరహా పరిశ్రమలు, విద్యార్థుల నుంచి పేదల వరకూ అందరికీ సులభ పద్ధతిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. దీనిని ప్రయివేటు బ్యాంకుల నుంచి ఆశించలేమని అన్నారు. సామాజిక భద్రత, ప్రభుత్వ పథకాలను సర్కారు బ్యాంకులే అమలు చేస్తాయని వివరించారు. అలాంటి ప్రభుత్వ రంగ బ్యాంకులను కేంద్రం శత్రువుల మాదిరిగా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కూడా ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తమ ఆందోళనకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

పిఎస్‌యుల కారణంగానే దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నదని ప్రధాని చెబుతుంటారని, అయితే అలాంటి వాటిని ప్రయివేటీకరించి నాశనం చేస్తున్నారని సంచార్ నిగమ్ పెన్షనర్ల సంక్షేమ సంఘం సంయుక్త ప్రధాన కార్యదర్శి దిలీప్ సాహా విమర్శించారు. ప్రజలు కష్టపడి దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోతుందని అంటూ ఈ పరిస్థితి మారాలని అన్నారు. ఈ సదస్సుకు వివిధ బ్యాంక్ సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, తాత్కాలిక కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బెఫీ ప్రధాన కార్యదర్శి దెబాశిష్ బసు చౌదరి, అఖిలభారత బ్యాంక్ అధికారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సంజయ్ దాస్, డీవైఎఫ్ఐ నాయకుడు వాజిద్ హుస్సేన్, ఎస్ఎఫ్ఐ నాయకుడు దెబానిల్ పాల్, కాంగ్రెస్ నాయకుడు అశుతోష్ ఛటర్జీ తదితరులు హాజరైన వారిలో ఉన్నారు.

ప్రతిపక్షాల కూటమిపై మోడీ విసుర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు లైబ్రరీ భవనంలో బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రతిపక్షాల 'ఇండియా' కూటమిపై తన అక్కసునంతా వెళ్లగక్కారు. ఇండియా అని పేరు పెట్టుకున్నంత మాత్రాన... ప్రతిపక్షాల తీరు మారుతుందా..? అని ప్రశ్నించారు. గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియన్ ముజాహిదీన్ వంటి వాటి పేర్లలో కూడా ఇండియా ఉందన్నారు. ఆఖరికి పిఎఫ్ఐ వంటి ఉగ్ర సంస్థల పేరులో కూడా ఇండియా ఉందన్నారు. ఇప్పటి వరకు ఇలాంటి దశ, దిశ లేని ప్రతిపక్షాన్ని చూడలేదన్నారు.

రాహుల్ కౌంటర్

ప్రతిపక్షాలపై ప్రధాని చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఖండించారు.. మణిపూర్ గాయాన్ని నయం చేయడానికి తమ ప్రతిపక్ష కూటమి ఉందని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ విధానమని ఆయన స్పష్టం చేశారు. "ప్రధాని గారూ.. మీరు ఎలా కావాలంటే అలా పిలుచుకోండి. మేము ఇండియా. మణిపూర్ గాయాన్ని నయం చేయడానికి, ప్రతి మహిళ, చిన్నారుల కన్నీరు తుడిచేందుకు మేము ప్రయత్నిస్తాము. ప్రజలందరి మధ్య ప్రేమ, శాంతిని, తిరిగి పాదుకొల్పుతాం. మణిపూర్‌లో భారతదేశ ఆత్మను పునరుద్ధరిస్తాం " అని ట్వీట్ చేశారు.

సంజయ్ సింగ్ ధర్నా...

- ప్రతిపక్షాల సంఘీభావం

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్ సింగ్‌ను రాజ్యసభ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష కూటమి సభ్యులు సోమవారం రాత్రంతా బృందాల వారీగా ధర్నాలో పాల్గొన్నారు. పార్లమెంట్‌లో ఆవరణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఈ నిరసన జరిగింది. మణిపూర్‌లో హింసాకాండపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటులో చర్చను ప్రారంభించాలని పట్టుబట్టారు. మంగళవారం కూడా సంజయ్ సింగ్ ధర్నా కొనసాగించారు.

రూ.5 వేల నగదు మింగేశాడు !

భోపాల్ : ఓ రెవెన్యూ అధికారి లంచం సొమ్మును మింగేసిన ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. మధ్యప్రదేశ్‌లోని కట్నీ నగరంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న గజేంద్ర సింగ్ ఓ వ్యక్తి నుండి రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా.. లోకాయుక్తా స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎస్‌పిఇ) అధికారులు పట్టుకున్నారు. దీంతో బిత్తరపోయిన సదరు అధికారి.. రూ. 5 వేల నోట్లను ఒక్కసారిగా మింగేశాడు. అతనిని వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌పిఇ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సంజయ్ సాహూ పేర్కొన్నారు.

కంబోడియాపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్ : ఆదివారం జరిగిన కంబోడియాఎన్నికల్లో ప్రధానమంత్రి హున్ సేన్‌కు చెందిన కంబోడియన్ పీపుల్స్ పార్టీ (సిపిపి) విజయం సాధించిన వెంటనే అమెరికా ఆ దేశంపై ఆంక్షలు విధించింది. ఈ ఎన్నికలు న్యాయంగా, నిష్పక్షపాతంగా జరగలేదంటూ అది ఈ చర్యకు పూనుకుంది. ఇదిలా ఉండగా కంబోడియా పార్లమెంటులోని మొత్తం 125 స్థానాలకు గాను అధికార సిపిపి 120 స్థానాలు గెలుచుకుని అఖండ విజయం సాధించింది. జాతీయ ఎన్నికల సంఘం నిషేధం విధించడంతో ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష క్యాండిల్ లైట్ పార్టీ పోటీ చేయలేదు. గత 38 ఏళ్ల నుంచి అధికారంలో ఉంటున్న హున్‌సేన్ ఈసారి తన పెద్ద కుమారుడు, ప్రస్తుత సైన్యాధ్యక్షులు 45 ఏళ్ల హున్ మానెట్‌కు ప్రధాన మంత్రి బాధ్యతలను అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే మరోవైపు కంబోడియా ఎన్నికలపై అమెరికా గుర్రుగా ఉంది. ఎన్నికలు సక్రమంగా జరగలేదని ఆరోపించింది. ఆంక్షలు ప్రకటించింది.కంబోడియాకు చెందిన కొంత మంది ఉన్నతాధికారులకు వీసా నిరాకరిస్తున్నట్టు తెలిపింది.

ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్ష జాడ్యం

- ఆత్మహత్యలకు పాల్పడుతున్న దళిత విద్యార్థులు
- హార్వర్డ్, జాన్స్ హాప్‌కిన్స్ వర్సిటీలలో భిన్న వాతావరణం

న్యూఢిల్లీ : 2005లో బాంబే ఐఐటిలో విజయ్ నూకల అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఉదంతం నేపథ్యంలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక ఓ నివేదికను ప్రచురించింది. ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్ష ఎలా జడలు విప్పుతోందో ఆ నివేదిక బట్టబయలు చేసింది. విజయ్ ఆత్మహత్య ఉదంతం తర్వాత ఆధునిక భారతావని వదనంపై ఏర్పడిన గాయాలు పెద్దవై పోతూనే ఉన్నాయి. ఐఐటీ బాంబేలోనే దర్శన్ సోలంకి అనే దళిత విద్యార్థి జీవితం విషాదాంతం కావడం వ్యవస్థ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ఐఐటీలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యా సంస్థలు ఒకప్పుడు విద్యార్థులకు స్వర్గధామంలా కన్పించేవి. వాటిలో సీటు దొరికితే చాలు...చిరకాల స్వప్నాలను సాకారం చేసుకోవచ్చునని వారు ఆశించేవారు. కానీ ఇప్పుడో? ఆ సంస్థలలో అంతా అనిశ్చితి...భయానక వాతావరణం. ముఖ్యంగా దళిత విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగించాల్సి వస్తోంది.

2014-2021 మధ్యకాలంలో ఐఐటిలు, ఐఐఎంలు, ఐఐఎస్‌సిలు, ఇతర కేంద్ర యూనివర్సిటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలలో చదువుతున్న 122 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2021లో లోక్‌సభకు తెలిపింది. వీరిలో సగం మంది దళిత బిడ్డలే. విద్యాలయాలలో ప్రవేశించిన కుల రక్కసి కోరలలో చిక్కి వీరంతా బలయ్యారు. కుల పక్షపాతం అనేది క్యాన్సర్‌లా వ్యాపించి సరస్వతీ మందిరాలను దహించివేస్తోంది. అనికెత్ అంభోర్ నుండి దర్శన్ సోలంకీ వరకూ అందరూ ఈ వివక్షకు గురై ప్రాణాలు విడిచిన వారే. విద్యా సంస్థల నుండి కుల భూతాన్ని తరిమేయడంలో వ్యవస్థ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఫలితంగా ఎందరో విద్యార్థుల మేధస్సు ఎవరికీ పనికిరాకుండా పోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచంలో ప్రతి 40 సెకన్లకు ఒకరు చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ బలవన్మరణాల వెనుక అన్నీ కన్నీటి కథలే...వ్యథలే. వీరిని కాపాడుకోవడంలో సమాజం దారుణంగా విఫలమవుతోంది.

ఆ వర్సిటీల తీరే వేరు..

ఐఐటిలతో పోలిస్తే హార్వర్డ్ యూనివర్సిటీ, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలు విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంలో ఎంతో ముందడుగు వేశాయి. ఈ రెండు విశ్వవిద్యాలయాలు విద్యార్థుల మానసిక ఆరోగ్య అంశాలకు పెద్ద పీట వేశాయి. తమ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నిరోధించాయి. విద్యార్థుల బాగోగులు చూసే విషయంలో వీటికి మంచి పేరుంది. ఐఐటీలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటోంది. అక్కడ విద్యార్థుల బాగోగులను పట్టించుకునే వారే ఉండరు. అసలు అధ్యాపకులకే ఆ సోయి ఉండదు. హార్వర్డ్, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం వర్క్‌షాపులు, పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వేచ్ఛగా చర్చించుకునేందుకు అవకాశం ఇస్తారు. అవసరమైన విద్యార్థులకు మద్దతు ఇస్తూ ప్రోత్సహిస్తారు. కౌన్సిలింగ్ ఇవ్వడం, మానసిక నిపుణులతో మాట్లాడించడం వంటి సమగ్ర ఆరోగ్య సేవలు అందిస్తారు. ఐఐటిలలో ఇలాంటివి మచ్చుకైనా కానరావు. సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు విద్యార్థులకు అవసరమైన మద్దతు ఆ సంస్థలతో లభించదు. హార్వర్డ్, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంటే ఐఐటీలు కూడా విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. తద్వారా వారిలో మనోధైర్యాన్ని నింపి ఆత్మహత్య ప్రయత్నాల నుండి వారిని దూరం చేయవచ్చు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఎపిలో 2,167 ఇళ్లే నిర్మాణం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2022-23లో 2,167 ఇళ్లు మాత్రమే నిర్మించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మంగళవారం లోక్‌సభలో ఒకప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు. 2022-23లో 1,78,899 ఇళ్లు మంజూరు అయితే, అందులో కేవలం 2,167 ఇళ్లు మాత్రమే నిర్మాణం జరిగిందన్నారు. 2020-21లో 1,816 ఇళ్లు మంజూరైతే, ఒక్క ఇల్లు నిర్మాణం కూడా జరగలేదన్నారు. 2021-22లో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలిపారు. పిఎంఎవై-జి కింద ఇప్పటి వరకు 2,46,435 ఇల్లు మంజూరు అయితే, 53,965 ఇల్లు నిర్మాణం పూర్తి అయిందని ఆ శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

78 లక్షల మందికి 'ఉపాధి' తొలగింపు

ఆంధ్రప్రదేశ్‌లో తొలగించిన జాబ్ కార్డుల్లో 78,05,569 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపిలో తొలగించిన జాబ్ కార్డుల్లో 2021-22లో 6,25,514 మంది ఉపాధి కార్మికులు ఉండగా, 2022-23లో తొలగించిన జాబ్ కార్డుల్లో 78,05,569 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని తెలిపారు. తెలంగాణలో 2022-23లో తొలగించిన జాబ్ కార్డుల్లో 17,32,936 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 2022-23లో తొలగించిన జాబ్ కార్డుల్లో 5,18,91,168 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని తెలిపారు.

జెన్‌కోకి రూ.1,704 కోట్లు ఏపి డిస్కాంలు బకాయిలు

ఆంధ్రప్రదేశ్ జెన్‌కోకి నాలుగు డిస్కాంలు రూ.1,704 కోట్లు బకాయిలు పడ్డాయని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ తెలిపారు. రాజ్యసభలో మంగళవారం ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జూలై 24 నాటికి ఏపి జెన్‌కోకి ఏపి సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ రూ.158 కోట్లు, ఏపి ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ రూ. 34 కోట్లు, ఏపి పవర్ పర్చేజ్ కోఆర్డినేషన్ కమిటీ రూ.1,127 కోట్లు, ఏపి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ రూ.385 కోట్లు బకాయి పడ్డాయని తెలిపారు. తెలంగాణలో జూలై 24 నాటికి జెన్‌కోకి రెండు డిస్కాంలు రూ.1,165 కోట్లు బకాయిలు పడ్డాయని తెలిపారు.

వెనక్కి ఇవ్వబోమని ముందస్తు హామీ

- పురస్కారాల గ్రహీతలకు నిబంధనలు ప్రతిపాదించిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : 2015లో ఎదురైన 'అవార్డ్ వాపసీ' చేదు అనుభవం భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసేందుకు ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ కొన్ని సూచనలు చేసింది. రాజకీయ కారణాలతో నిరసన తెలుపుతూ ఏ దశలోనూ తమకు ఇచ్చిన అవార్డులను వాపసు ఇవ్వబోమని అవార్డు గ్రహీతల నుంచి ముందుగానే లిఖితపూర్వక హామీ పొందాలని సిఫార్సు చేసింది. కర్నాటకకు చెందిన ప్రముఖ రచయిత ఎంఎం కాల్‌బర్గీ దారుణ హత్యను నిరసిస్తూ తమకు ఇచ్చిన అవార్డులను వాపసు చేస్తున్నామని ఆ సందర్భంలో 39 మంది రచయితలు సాహిత్య అకాడమీకి తెలియజేసిన విషయం విదితమే. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని (రవాణా, టూరిజం, సంస్కృతి) ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సోమవారం పార్లమెంట్ ఉభయసభలకు తన నివేదికను అందజేసింది.

మీకోసం

జలుబుతో బాధపడేవారు అల్లం ముక్కలు వేసి మరిగించిన నీళ్లల్లో నిమ్మరసం, తేనె, పుదీనా ఆకులు వేసి తాగితే మంచి ఉపశమనం ఉంటుంది.

జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడు కంటే చేయాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ ఫలితం సాధిస్తాడు.

తుంటరి పిల్లవాడు



సోలిపేటలో సోమేశ్ అనే తుంటరి పిల్లాడు ఉండేవాడు. తన చుట్టూ ఉన్న పిల్లల బొమ్మలు పాడు చేస్తూ వాళ్ళను బాగా ఏడిపించే వాడు. అందరూ తనకు దూరంగా ఉండేవారు. ఒక రోజు సుందర్ అనే పిల్లవాడు ఓ బొమ్మతో ఆడుకుంటుండగా వాడినెలాగైనా ఏడిపించాలని ఆ బొమ్మను తీసి దూరంగా విసిరేశాడు సోమేశ్. బొమ్మ పోయిందని ఏడుస్తూ సుందర్ అక్కడి నుండి వెళ్లిపోయాడు. ఇలా సోమేశ్ అల్లరి రోజురోజుకూ పెరిగిపోతూ ఉండేది.

ఒకరోజు సోమేశ్ వాళ్ల నాన్న తనకు రిమోట్ కారును కొని ఇచ్చాడు. సోమేశ్ తన దగ్గర ఉన్న కారు బొమ్మను అందరికీ చూపిస్తూ సంతోషపడేవాడు. ఒకసారి ఆడుకుంటూ ఆడుకుంటూ అమ్మ పిలిచిందని లోపలికి వెళ్లాడు. ఇదే అదనుగా సుందర్ ఆ బొమ్మను తీసి పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి విసిరేశాడు. బయటికి వచ్చిన సోమేశ్‌కి తన బొమ్మ కనిపించకపోయే సరికి విపరీతంగా కోపం, ఏడుపు తన్నుకొచ్చాయి. వెళ్లి సుందర్‌ని అడిగితే, తనకు తెలియదని చెప్పాడు. దీంతో సోమేశ్ చుట్టూ ఉన్న పిల్లలందరిని పిలిచి తన బొమ్మను వెతకమని వేడుకున్నాడు. కానీ, వాళ్లు సోమేశ్‌కి జరగాల్సిందే జరిగిందని అనుకొని ఎవరూ వెతకలేదు. కొంతసేపటికి సుందర్ వెక్కివెక్కి ఏడుస్తున్న సోమేశ్‌ను చూడలేక ఆ కారు బొమ్మను తీసుకొచ్చి ఇచ్చాడు. అప్పుడు సోమేశ్ చాలా సంతోషంతో తీసుకున్నాడు. అప్పుడు పిల్లలందరూ 'మేము ఎంతో ఇష్టంగా కొనుక్కున్న బొమ్మల్ని నువ్వు ఎన్నో సార్లు పాడుచేసావు. ఆ బాధ నీకు కూడా తెలియాలనే ఇలా చేశాం' అన్నారు.

'నిజమే.. ఇంకెప్పుడూ ఎవరి బొమ్మలను తీసుకోను. గతంలో చేసిన వాటికి క్షమించండి' అన్నాడు సోమేశ్. స్నేహితుడిలో వచ్చిన మార్పుకు అందరూ సంతోషపడ్డారు.

-ఎన్.మనస్విని
ఆరవ తరగతి, సిద్ధిపేట



సరిచేసి రాయండి

పిల్లలూ ఇక్కడ గజిబిజిగా ఇచ్చిన అక్షరాలను సరైన క్రమంలో రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. ట్రై చేయండి మరి..

నేను గీసిన బొమ్మ

పవని కృష్ణ సాయి లాస్య,
4వ తరగతి,
సెయింట్ ఆన్స్ స్కూలు, చీరాల.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మన మూలాల్లోకి ప్రయాణం

పర్యాటకం

అంటే- ప్రాంతాల సందర్శనే కాదు..

సంస్కృతి, సాంప్రదాయాల పరామర్శ కూడా..

పర్యాటకానికి కొత్త అర్థం చెబుతున్నారు అసోం వాసి జూలీ కగ్టి. కొండలు, గుట్టలు, లోయలు, జలపాతాల సందర్శనతోనే ప్రకృతి అందాలన్నీ చూసినట్లు కాదంటారు ఆమె. ఆయా ప్రాంతాల ప్రజల జీవనశైలి, వారి మనుగడ, భాష, ఆహార నియమాలు, సాంప్రదాయాలన్నింటినీ తెలుసుకోవాలంటారు. ఆ దిశగా పర్యాటకులకు విశేష అనుభూతులను పంచేందుకు 'కర్టెన్ కాల్ అడ్వెంచర్స్' పేరుతో ఓ పర్యాటక సంస్థను ప్రారంభించి ప్రాంతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిచయం చేస్తున్నారు.

అసోం మజులిలోని సాల్మోర్ గ్రామం.. భారత దేశ మొట్టమొదటి ద్వీప జిల్లాలో ఒకటి. ఆ కుగ్రామంలో బిను భొరాలి మట్టితో కళాఖండాలు చేయడంలో నిమగ్నమై ఉన్నాడు. అతని చుట్టూ కూర్చొన్న కొంతమంది ఆ కళా నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. కొంతమంది అతనితో కలిసి ఆ మట్టి ముద్దలపై చేతులు ఆడిస్తున్నారు. మరికొంతమంది ఆ దృశ్యాలను తమ ఫోన్లలో బంధిస్తున్నారు. ఇవన్నీ చూస్తున్న బిను ఒకింత ఆనందంతో అలవోకగా ఆ మట్టి ముద్దలను అందమైన కళాకృతులుగా చేస్తున్నాడు. 'వాళ్లంతా అలా చూస్తుంటే నాకు భలే సంతోషమేస్తుంది. పనిలో నాకు ఉత్సాహంగా కూడా ఉంటుంది. మా ప్రాంతానికే పరిమితమైన కళ వాళ్ల ద్వారా బయటి ప్రపంచానికి తెలుస్తుందని ఒకింత గర్వంగా కూడా ఉంటుంది' అంటూ బిను చెబుతున్నాడు.

బిను నివసిస్తున్న ఆ ప్రాంతానికి చేరుకున్న పర్యాటక బృందానికి నాయకత్వం వహించిన జూలీ 'ఈ గ్రామ సందర్శన ఉత్తర భారత యాత్రలో ఒక భాగం. మరుగున పడిపోతున్న హస్తకళలను పరిచయం చేయాలన్న సంకల్పంతో యాత్రలో వీటిని భాగం చేస్తాను. ప్రత్యేకంగా ప్యాకేజీలో వీటి గురించి ప్రస్తావిస్తాను. ఈ కళలు వారి మనుగడ కోసమే కాదు.. ఇవి వారి జీవనవిధానమని ప్రతి ఒక్కరికీ తెలియాలి. అదే నా లక్ష్యం' అంటున్న 52 ఏళ్ల జూలీకి డిజైనర్‌గా రెండు దశాబ్దాల అనుభవం ఉంది.

'అసోం దిగ్బోయ్ మా పూర్వీకుల ప్రాంతం. బాల్యంలో సెలవులు వచ్చినప్పుడల్లా నేను అక్కడికి వెళ్లిపోయేదాన్ని. ఆ పరిసరాలు నాకు బాగా నచ్చేవి. గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలు బాగా ఆకర్షించేవి. మా ఇంట్లో మహిళలు కూడా హస్తకళలు చేయడం చాలా సార్లు చూశాను. వాటినే చూస్తూ పెరిగిన నేను డిజైనింగ్‌పై ఇష్టం

పెంచుకున్నాను. బెంగళూరు, ముంబయి టెక్స్‌టైల్ ఇండస్ట్రీలలో 25 ఏళ్లు పనిచేశాను. 2015 నాటికి పెళ్లయి ఇద్దరు పిల్లలు కలిగారు. నా పిల్లలకు కూడా నా చిన్ననాటి అనుభూతులను పరిచయం చేయాలని తీరిక చేసుకుని ఆ ప్రదేశాలకు తీసుకెళ్లేదాన్ని. అయితే ఆ గ్రామాలు ఇప్పుడు చాలా మారిపోయాయి. బతుకుదెరువు కోసం గ్రామస్తులు వలసలు వెళ్లిపోయారు. ఊళ్లో ఉన్న కొద్దోగొప్పో జనం కూడా నిస్సారంగా బతుకుతున్నట్లు అనిపించింది. హస్తకళాకారులు ఒకరో ఇద్దరో మిగిలారు. వారి తరువాత అక్కడంతా శూన్యమైపోతుందని అర్థమై తట్టుకోలేకపోయాను. ఈ పరిస్థితి పోవాలంటే.. కనుమరుగైపోతున్న సంస్కృతి, సాంప్రదాయాలను బతికించుకోవాలంటే నా వంతుగా ఏదైనా చేయాలనుకుని 'కర్టెన్ కాల్ అడ్వెంచర్స్'ను స్థాపించాను అంటూ తన ప్రయాణం గురించి చెబుతున్నారు.

'పర్యాటకం అంటే బీచ్‌లు, సముద్రాలు, కొండలు, లోయల సందర్శన ఒక్కటే కాదు. ఆయా ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలను కూడా పరిచయం చేయాల'ని గట్టిగా చెబుతున్న ఆమె.. ఎవరో చేయాలని కూర్చోవడం కంటే నేనే మొదటి అడుగు వేయాలనుకున్నాను. అలా నా ప్రయాణం మొదలుపెట్టాను. గ్రామాల్లో నివసించడం, చేనేత ప్రదర్శనలు ఇప్పించడం, స్థానికుల భాషా తరగతులను పరిచయం చేయడం, పడవ ప్రయాణాలు వంటి గ్రామీణ నేపథ్యం ఉన్న ప్రతి అంశాన్ని ఇక్కడ భాగం చేస్తున్నాను. గ్రామస్తుల కళను ఆరాధిస్తున్న పర్యాటకులను చూసి కళాకారులు కూడా చాలా ఉత్సాహంగా ఉంటున్నారు. హస్తకళలను కొనుగోలు చేయడం ద్వారా వారికి ప్రోత్సాహంగా కూడా ఉంటోంది. వారితో కలసి కొన్ని రోజులు అక్కడే గడపడం వల్ల మళ్లీ మళ్లీ ఆ ప్రాంతాలకు రావాలని పర్యాటకులు కోరుకుంటున్నారు.

ఇటువంటి వాతావరణం ఏర్పడినప్పుడే ఎంతకాలమైనా ఆ కళ, కళాకారులు మనుగడలో ఉంటారు' అని ఆమె ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అసోం ప్రాంతంలోనే కాదు, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తర కేరళ, ఈశాన్య భారత్‌లో కూడా జూలీ ఇటువంటి యాత్రలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ముందుగా వెళ్లి రోడ్డు రవాణా మార్గాల గుండా స్వయంగా ప్రయాణించి ఆ మార్గంలోనే పర్యాటకులను తీసుకెళ్తుంటారు. ఆ ప్రయాణంలో ఎదురయ్యే గ్రామాలను సందర్శిస్తూ వారి యాత్ర సాగుతుంటుంది.

విటమిన్ 'డి' కోసం ఇలా చేయండి !

మన శరీరానికి విటమిన్ డి చాలా ముఖ్యం. ఇది కాల్షియాన్ని అందించటంలో దోహదపడుతుంది. కండరాల కదలిక, మెదడు, శరీరానికి సిగ్నల్స్ అందించేందుకు అవసరం. బలమైన ఇమ్యూనిటీకి కూడా విటమిన్ డి అవసరం. ప్రస్తుతం వర్షాకాలం ఎండ తగలదు. ప్రతిరోజూ తగినంత మొత్తంలో విటమిన్ డి అవసరం. ఇది సూర్యరశ్మి నుంచే కాదు; కొన్ని ఆహార పదార్థాల నుంచి కూడా లభిస్తుంది. సాల్మన్, ట్యూనా, మాకేరెల్ వంటి చేపలు, గుడ్డు, పుట్టగొడుగులు, చీజ్‌లలో దొరుకుతుంది. ఇంకా పుట్టగొడుగులు తీసుకుంటే విటమిన్ డి అందుతుంది. వీటితో పాటు పాలు, హోల్ గ్రెయిన్స్, నారింజ, పెరుగు తీసుకోవచ్చు. విటమిన్ డి ఆహారం ద్వారా తగినంత అందకపోతే డాక్టర్ సలహాతో విటమిన్ డి సప్లిమెంట్స్ కూడా తీసుకోవచ్చు.

మరో ముఖ్య విషయం : విటమిన్ డి ఎక్కువగా తీసుకోవడం కూడా సరైంది కాదు. రక్తంలో విటిమన్ డి లెవల్స్ పెరుగుతాయి. వికారం, వాంతులు, కండరాల బలహీనత, ఇబ్బంది, నొప్పులు, ఆకలి తగ్గడం, డీహైడ్రేషన్, మూత్రవిసర్జన, దాహం, మూత్రపిండాల్లో రాళ్లు వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి, డాక్టర్ సూచించిన మోతాదులోనే సంప్లిమెంట్స్ తీసుకోవాలి.

రోగనిరోధక శక్తికి దోహదం : డి విటమిన్ ఎముకల ఆరోగ్యం, రోగ నిరోధకతనే కాదు..ఆనందం, ఉల్లాసం కూడా అందించనుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

విచారంగా ఉండటం, కోపం, చిరాకు పడటం వెనక కూడా 'డి విటమిన్' లోపమే కారణమని తెలుస్తోంది. శారీరక ఆరోగ్యానికే కాదు.. మానసిక ఆరోగ్యానికి చాలా అవసరం. ఇది ఆహారంతో లభించే కాల్షియాన్ని శరీరం బాగా గ్రహించేలా చేస్తుంది. ఎముకలు గుల్ల బారకుండా చూస్తుంది. రోగ నిరోధకశక్తిని



పెంచి ఇన్‌ఫెక్షన్లతో పోరాడుతుంది. నిస్సత్తువ, అలసట, నిద్రలేమి వంటి వాటిని పోగొడుతుంది. ఉల్లాసం, ఉత్సాహం, సంతోషాన్ని కలిగిస్తుంది. మన మెదడు సక్రమంగా పని చేయడానికి న్యూరో స్టెరాయిడ్లను వాడుకుంటుంది. మానసిక సమస్యలకు 'విటమిన్ డి'తో ప్రత్యక్ష సంబంధం ఉంది. విటమిన్ డిలో చాలా రకాలున్నాయి. చర్మానికి ఎండ తగిలినపుడు 7 డి హైడ్రో కొలెస్ట్రాల్ పుడుతుంది. ఇది డి3గా మారుతుంది. ఇది కాలేయాన్ని చేరుకొని 25 హైడ్రాక్సీ విటమిన్ డి అవుతుంది. శరీరం దీన్నే వాడుకుంటుంది. రోజూ కాసేపు ఎండ తగిలేలా చూసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. ఎండతో సెరటోన్ హర్మోన్ కూడా ఉత్పత్తి అవుతుంది. ఇది మానసిక స్థితిని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుతుంది.

'బ్రో' లిరికల్ సాంగ్ విడుదల

పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'బ్రో' చిత్రం నుండి తాజాగా లిరికల్ వీడియో సాంగ్ విడుదలైంది. సముద్ర ఖని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జులై 28న విడుదలకు సిద్ధమవుతుండగా మేకర్స్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. తాజాగా విడుదలచేసిన ఈ సాంగ్ ప్రేక్షకులను, అభిమానులని విశేషంగా ఆకట్టుకుంటోంది. కళ్యాణ్ చక్రవర్తి ఈ పాటకి లిరిక్స్ అందించారు. థమన్ సంగీత సారథ్యంలో చాలామంది సింగర్స్‌తో ఈ పాటను పాడించారని సమాచారం. ప్రియా ప్రకాష్ వారియర్, కేతిక శర్మ లేడీ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ రాశారు. జీ స్టూడియోస్‌తో కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

అల్లు అర్జున్ సరికొత్త రికార్డు

హీరో అల్లు అర్జున్ సోషల్ మీడియాలో మరో రికార్డు సృష్టించారు. దీంతో ఆయన పేరు ట్రెండింగ్‌లోకి వచ్చింది. పుష్ప సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే సోషల్ మీడియాల్లో బన్నీని కోట్లమంది ఫాలో అవుతున్నారు. ఇటీవల ట్విటర్‌కు పోటీగా కొత్తగా థ్రెడ్స్ యాప్‌ను జుకర్ బర్గ్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ యాప్‌లోనే అల్లు అర్జున్ సరికొత్త రికార్డు సృష్టించాడు. అత్యంత తక్కువ సమయంలో వన్ మిలియన్ ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్న తొలి భారతీయ నటుడిగా బన్నీ నిలిచారు. దీంతో ఆయన అభిమానులు 'ఎక్కడైనా తగ్గేదేలే', అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్' (పుష్ప 2)లో నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్ర నిర్మాణం జరుగుతోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న అల్లు అర్జున్ అందులోని (పుష్ప2) డైలాగ్‌ను లీక్ చేసిన విషయం విదితమే. అల్లు అర్జున్ పేరు ట్రెండింగ్‌లోకి రావడానికి మరో కారణం కూడా ఉంది. టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ భార్య సాక్షి తాజాగా 'లెట్స్ గెట్ మ్యారీడ్' చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. అందులో సాక్షి మాట్లాడుతూ 'నేను అల్లు అర్జున్‌కు వీరాభిమానిని. ఆయన నటించిన ప్రతి సినిమాను చూస్తాను. ఓటీటీ, యూట్యూబ్.. ఇలా అన్నింట్లో బన్నీ సినిమాలను చూస్తా' అని చెప్పారు.

4న 'మిస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి'

అనుష్క-నవీన్ పోలిశెట్టి కాంబినేషన్ లో రూపుదిద్దుకుంటోన్న తాజా చిత్రం 'మిస్ శెట్టి..మిస్టర్ పోలిశెట్టి'. 'జాతిరత్నాలు' తర్వాత నవీన్ పోలిశెట్టి, 'నిశ్శబ్దం' తర్వాత చాలా గ్యాప్ ఇచ్చిన అనుష్క.. వీరిద్దరూ నటిస్తున్న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రం ఆగస్టు 4న విడుదల కానుంది. బుధవారంనాడు ట్రైలర్ రిలీజ్ కానుంది. మహేష్‌బాబు.పి దర్శకత్వం, వంశీ - ప్రమోద్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. రధన్ సంగీతం, నీరవ్ షా ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

కన్నడలో 'హిడింబ'

తాజాగా విడుదలైన థ్రిల్లర్ మూవీ 'హిడింబ' ఇప్పుడు మరో భాషలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అశ్విన్ బాబు హీరోగా నందిత శ్వేతా హీరోయిన్‌గా అనిల్ కన్నెగంటి తెరకెక్కించిన ఈ చిత్రం తెలుగులో మంచి సక్సెస్‌ని అందుకుంది. ఇప్పుడు కన్నడ భాషలో కూడా విడుదల చేస్తున్నట్టుగా లేటెస్ట్ పోస్టర్‌తో మేకర్స్ తెలిపారు. విడుదల తేదీ త్వరలో ప్రకటించనున్నారు. కన్నడలో ఈ చిత్రాన్ని 'దండుపాళ్యం' మేకర్స్ త్రిశూల్ ఎంటర్టైన్మెంట్స్ విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది.

సీక్వెల్‌గా 'సలార్'

ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ 'సలార్' టీజర్ విడుదలతో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పృథ్వీరాజ్ సుకుమార్, శ్రుతిహాసన్, జగపతిబాబు కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. 'సలార్ రెండు భాగాలుగా రానుందా' అని గత కొంతకాలంగా సాగుతున్న ప్రచారానికి టీజర్ ద్వారా స్పష్టత ఇచ్చింది చిత్ర బృందం. 'సలార్ పార్ట్-1: సీజ్ ఫైర్' అని పేర్కొంటూ సెప్టెంబరు 28న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు తెలిపింది. దీంతో 'పార్ట్-2' కూడా ఉంటుందని ప్రభాస్ అభిమానులు పేర్కొంటున్నారు. అప్పట్లో 'వైలెన్స్.. వైలెన్స్.. వైలెన్స్' అంటూ ఒక్క డైలాగ్‌తో 'కేజీయఫ్2' ట్రైలర్ విడుదల చేసి, పార్ట్-1ను మించి సీక్వెల్ ఉంటుందన్న అంచనాలను రెట్టింపు చేశారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇక 'కేజీయఫ్' సినిమా ఆసాంతం గోల్డ్ మైన్స్‌లో సాగుతుండగా, 'సలార్' బొగ్గు గనుల నేపథ్యంలో ఉంటుందని టాక్.

2023-24 సీజన్ టీమిండియా
అంతర్జాతీయ షెడ్యూల్ ఇదే!

ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు, ఐదు టి20లు, ఆఫ్ఘన్‌తో మూడు టి20లు, ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌లు

బిసిసిఐ

ముంబయి: 2023-24 ఏడాదికి సంబంధించి టీమిండియా అంతర్జాతీయ షెడ్యూల్‌ను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) మంగళవారం విడుదల చేసింది. హోం షెడ్యూల్‌లో భాగంగా భారతజట్టు మొత్తం 16 అంతర్జాతీయ మ్యాచ్‌లను ఆడనుంది. ఇందులో ఐదు టెస్ట్‌లు, 3వన్డేలతోపాటు మరో 8టి20 మ్యాచ్‌లు ఆడనుంది. ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ మూడు వన్డేలు మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్‌లో జరగనున్నాయి. వన్డే ప్రపంచకప్ ముగిసిన తర్వాత ఆస్ట్రేలియాతో 5టి20ల సిరీస్‌ను నవంబర్ 23నుంచి టీమిండియా ఆడనుంది. ఇందులో భాగంగా నవంబర్ 23న వైజాగ్, డిసెంబర్ 3న హైదరాబాద్‌లలో ఒక్కో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ తర్వాత ఆఫ్ఘనిస్తాన్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఆ టూర్‌లో భాగంగా ఆఫ్ఘన్ జట్టుతో భారత్ మూడు టి20ల సిరీస్‌లో ఆడనుంది. ఆ మూడు టి20లు మొహాలీ, ఇండోర్, బెంగళూరులో జరగనున్నాయి. 2024 జనవరిలో ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఈ పర్యటనలో భాగంగా జనవరి 25, 2024 నుంచి ఇరుజట్ల మధ్య ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ సిరీస్ ప్రారంభం కానుంది. ఆ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు హైదరాబాద్, వైజాగ్, రాజ్‌కోట్, రాంచీ, ధర్మశాలలో జరగనున్నాయి.

ఆస్ట్రేలియాతో 3వన్డేల సిరీస్..

సెప్టెంబర్ 22 : తొలి వన్డే(మొహాలీ)
సెప్టెంబర్ 24 : రెండో వన్డే(ఇండోర్)
సెప్టెంబర్ 27 : మూడో వన్డే(రాజ్‌కోట్)

ఐదు టి20 సిరీస్..

నవంబర్ 23 : తొలి టి20(వైజాగ్)
నవంబర్ 26 : రెండో టి20(త్రివేండ్రం)
నవంబర్ 28 : మూడో టి20(గౌహతి)
డిసెంబర్ 1 : నాల్గో టి20(నాగ్‌పూర్)
డిసెంబర్ 3 : ఐదో టి20(హైదరాబాద్)

ఆఫ్ఘనిస్తాన్‌తో 3టి20ల సిరీస్..

జనవరి 11: తొలి టి20(మొహాలీ)
జనవరి 14: రెండో టి20(ఇండోర్)
జనవరి 17: మూడో టి20(బెంగళూరు)

ఇంగ్లండ్‌తో 5టెస్ట్‌ల సిరీస్..

జనవరి 25-29 : తొలి టెస్ట్(హైదరాబాద్)
ఫిబ్రవరి 2-6 : రెండో టెస్ట్(వైజాగ్)
ఫిబ్రవరి 15-19 : మూడో టెస్ట్(రాజ్‌కోట్)
ఫిబ్రవరి 23-27 : నాల్గో టెస్ట్(రాంచీ)
మార్చి 7-11 : ఐదో టెస్ట్(ధర్మశాల)

టెస్ట్ సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ రోహిత్ శర్మ

వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో చేజిక్కించుకుంది. రెండో, చివరి టెస్ట్ ఆఖరి రోజు ఆట వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోవడంతో ఆ టెస్ట్ డ్రాగా ముగిసినట్లు అంపైర్ల ప్రకటించారు. తొలిటెస్ట్ భారత్ ఇన్నింగ్స్ 141 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే.

2024 పారిస్ ఒలింపిక్స్ జ్యోతి నమూనా ఆవిష్కరణ

జిన్హువా(ఫ్రాన్స్): 2024 పారిస్ ఒలింపిక్స్, పారా ఒంపిక్స్ జ్యోతి నమూనాను మంగళవారం ఆవిష్కరించారు. ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన ఈఫిల్ టవర్‌ను పోలిన ఈ టార్చ్ నమూనాను ప్రఖ్యాత డిజైనర్ మాథ్యూ లెహెన్నూర్ రూపొందించారు. 2024 ఒలింపిక్స్ జరిగేందుకు సరిగ్గా ఏడాది ఉన్న నేపథ్యంలో ఈ జ్యోతి నమూనాను పారిస్ అధ్యక్షుడు టోనీ ఎస్టాంగ్వెస్ట్ అందజేశారు. ఇది 70 సెంటీమీటర్ల ఎత్తుతో తేలికపాటి రేడియంట్ స్టీల్‌తో తయారు చేయబడి, షాంపైన్ రంగుతో విభిన్నంగా ఉందని, అలాగే దిగువభాగంలో సెయిన్ నది కదలికలను అనుకరించే ఉపశమన నమూనా కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈసారి ఒలింపిక్స్‌లో ఎక్కువమంది మహిళలు ఎక్కువమంది పాల్గొనాలన్నదే తమ ధ్యేయమని, పారిస్ ఒలింపిక్స్‌ను దిగ్విజయంగా పూర్తి చేసి చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని అధ్యక్షుడు టోనీ ఎస్టాంగ్వెస్ట్ అన్నారు. ఇక టార్చ్ రూపకర్త మాథ్యూ లెహెన్నూర్ మాట్లాడుతూ.. తాను మూడు పారిస్ ఒలింపిక్ క్రీడల చిహ్నాలను తయారుచేశానని, పారా ఒలింపిక్స్ క్రీడలను ఒలింపిక్స్ తరహాలోనే నిర్వహించాలనే ఉద్దేశ్యంతోనే ఒకే టార్చ్‌ను రూపొందించానన్నారు. 2024 ఏప్రిల్ 16న గ్రీస్‌లో ఒలింపియాడ్‌లో సూర్యకిరణాలద్వారా జ్యోతిని వెలిగించబడుతుందని, ఐదు ఖండాల్లో తిరిగి 64 ఫ్రెంచ్ భూభాగాల గుండా ప్రయాణించి మే 8న మధ్యధరా సముద్రం దాటి ఫ్రాన్స్‌లోని మార్సెయిల్‌కు చేరుతుందన్నారు. మొత్తం 10వేలమంది టార్చ్ బేరర్లు దీనిని మోయనున్నట్లు ఆతిథ్య దేశంలోని ప్రసిద్ధ, చారిత్రాత్మక ప్రదేశాలలోనూ ఈ టార్చ్ రిలే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇక పారిస్ ఒలింపిక్స్ షెడ్యూల్ ప్రకారం జులై 26, 2024 నుంచి ఆగస్టు 11వరకు, పారా ఒలింపిక్స్ క్రీడలు ఆగస్టు 28, 2024 నుంచి సెప్టెంబర్ 8వరకు జరగనున్నాయి.

2వ ర్యాంక్‌కు సాత్విక్-చిరాగ్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి కెరీర్ అత్యుత్తమ ర్యాంక్ సాధించారు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో ఏకంగా 2వ స్థానానికి ఎగబాకారు. ఈ ఏడాది మూడో వరల్డ్ టూర్ టైటిల్ గెలిచిన ఈ జంటకు కెరీర్ అత్యుత్తమ ర్యాంక్ ఇదే. కొరియా ఓపెన్ ఫైనల్లో టాప్ సీడ్ జోడీ చైనాకు చెందిన లియాంగ్ వే కెంగ్, వాంగ్ చాంగ్ జంటను చిత్తు చేసి ట్రోఫీ అందుకున్నారు. దాంతో వీరి ర్యాంక్ మెరుగుపడింది.

వరల్డ్ టూర్ ఫైనల్లో రికార్డు

ఈ ఏడాది ఆరంభం నుంచి సాత్విక్-చిరాగ్ జంట దుమ్మురేపుతోంది. వరుస ట్రోఫీల్లో సంచలన విజయాలతో దూసుకెళ్తోంది. ఈ ఏడాది తొలిసారి స్విస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సాత్విక్-చిరాగ్ జోడీకి వరల్డ్ టూర్ ఫైనల్లో అద్భుతమైన రికార్డు కలిగి ఉన్నారు. ఇప్పటివరకూ తొమ్మిదిసార్లు ఫైనల్ చేరిన ఈ జోడీ ఏకంగా ఏడు పర్యాయాలు చాంపియన్‌గా నిలిచింది. అంతేకాదు వీళ్లిద్దరూ తొలిసారిగా ఇండోనేషియా సూపర్ 1000 టైటిల్ నెగ్గి రికార్డు నెలకొల్పారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68